సమావేశము – IV
వాల్యూం – I
నెం. 1

వెల : రూ. 60–00
09 డిసెంబర్, 2024
సోమవారము

తెలంగాణ శాసన సభ కార్యకలాపాలు

అధికార నివేదిక

విషయ సూచిక

పేజి. నెం.

I. సభా సమక్షంలో ఉంచే పత్రాలు ... 01

II. 'తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పన' పై గౌరవ ముఖ్యమంత్రి గారి ప్రకటన ... 02

తెలంగాణ శాసన సభ

ప్రధాన అధికారులు

సభాపతి	:	శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్
కార్యదర్శి	:	డా. వి. నరసింహా చార్యులు
సంయుక్త కార్యదర్శులు	:	శ్రీ సిహెచ్. ఉపేందర్ రెడ్డి శ్రీమతి వి.ఎన్.ప్రసన్నకుమారి
ఉప కార్యదర్శులు	:	శ్రీమతి ఎస్. నాగమణి శ్రీ ఎమ్. రఘుమారెడ్డి శ్రీ ఎ. సుధాకర్
సహాయ కార్యదర్శులు	:	శ్రీ పి. శ్రీనివాస్ శ్రీమతి ఎ. పద్మాసిని శ్రీమతి ఎస్.వి.వి. సత్యశ్రీ శ్రీ ఎన్. సుజిత్ కుమార్ శ్రీ కె. భాస్కర శ్రీనివాస్ శ్రీ సి.కె.వినోద్‌కుమార్ శ్రీమతి బి. ప్రమీల శ్రీ ఆర్.రమణయ్య శ్రీ సిహెచ్.నాగరాజు శ్రీ పి.వెంకటేశం శ్రీ మహమ్మద్ హమీదుద్దీన్ శ్రీ పి.వి.సునీల్
చీఫ్ రిపోర్టర్	:	శ్రీ జి. రాజేశ్వరరెడ్డి

తెలంగాణ శాసన సభ కార్యకలాపాలు

అధికార నివేదిక

(నాలుగవ సమావేశం – మొదటి రోజు)

సోమవారము, డిసెంబర్ 09, 2024

(జాతీయ గీతాలాపనతో సభ ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైనది)

(గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

మిస్టర్ స్పీకర్ :- గౌరవ ముఖ్యమంత్రి గారికీ, గౌరవ మంత్రివర్యులందరికీ, గౌరవ సభ్యులందరికీ నమస్కారం తెలియజేస్తున్నాను. All the papers included in the agenda are deemed to have been laid on the Table of the House.

PAPERS LAID ON THE TABLE.

1. A copy of the Telangana Payment of Salaries and Pension and Removal of Disqualifications (Amendment) Ordinance, 2024 (Telangana Ordinance No.2 of 2024), as required under Clause 2(a) of Article 213 of the Constitution of India.

2. A copy of the Telangana Municipalities (Amendment) Ordinance, 2024 (Telangana Ordinance No.3 of 2024), as required under Clause 2(a) of Article 213 of the Constitution of India.

3. A copy of the Greater Hyderabad Municipal Corporation (Amendment) Ordinance, 2024 (Telangana Ordinance No.4 of 2024), as required under Clause 2(a) of Article 213 of the Constitution of India.

4. A copy of the Telangana Goods and Services Tax (Amendment) Ordinance, 2024 (Telangana Ordinance No.5 of 2024), as required under Clause 2(a) of Article 213 of the Constitution of India.

5. A copy of the 9th Annual Report of the Telangana Power Finance Corporation Limited, for the year, 2022-2023, as required under Section 394 of the Companies Act, 2013.

6. A copy of the 7th Annual Report of the Telangana State Forest Development Corporation Limited, for the year, 2021-2022, as required under Section 394 (2) of the Companies Act, 2013.

7. A copy of the Telangana Panchayat Raj (Amendment) Ordinance, 2024, (Telangana Ordinance No.1 of 2024), as required under Clause 2(a) of Article 213 of the Constitution of India.

ANNOUNCEMENT

MR.SPEAKER:- I am to announce to the House that it has been decided to conduct a Two-Day Orientation Programme on Legislative Practices & Procedures to Hon'ble Members to effectively participate in the debates of the House and to make proper use of precious time of the House.

This Programme is scheduled to be held on 11th and 12th December 2024 at MCRHRD Institute, Jubilee Hills, Hyderabad. Eminent Scholars from PRS Legislative Research, New Delhi will deliver lectures on different topics. I therefore request the Hon'ble Members to participate in the Programme and make best use of the opportunity.

'తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పన' పై గౌరవ ముఖ్యమంత్రి గారి ప్రకటన.

గౌరవ ముఖ్యమంత్రి గారి ప్రకటన. గౌరవ ముఖ్యమంత్రి గారూ...

'తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పన' పై గౌరవ ముఖ్యమంత్రి గారి ప్రకటన

శ్రీ ఎ.రేవంత్ రెడ్డి (గౌరవ ముఖ్యమంత్రి - పురపాలక పరిపాలన మరియు పట్టణాభివృద్ధి, సాధారణ పరిపాలన, శాంతి భద్రతలు మరియు ఇతర కేటాయించబడని శాఖలు):- స్పీకర్ సార్, తమరి అనుమతితో...

ఈ డిసెంబరు 9, తెలంగాణ ప్రజలకు ఒక గొప్ప పర్వదినం. అదేవిధంగా డిసెంబరు 9, 2009 నాడు ఆనాటి కేంద్ర హోంశాఖామాత్యులు చిదంబరం గారు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నామని చెప్పడమే కాకుండా, మొట్టమొదట తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆకాంక్షను వారు ముందుకు తీసుకువచ్చారు.

అంతేకాకుండా, ఆనాటి యూపీఏ ఛైర్‌పర్సన్ శ్రీమతి సోనియాగాంధీ గారి జన్మదినం కూడా డిసెంబరు తొమ్మిదే. ఈ రోజుకి వారు 78 సంవత్సరాలు పూర్తి చేసుకొన్నారు. మన 60 సంవత్సరాల ఆకాంక్ష.., నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు ఏ ఆకాంక్ష కోసం, ఏ ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటం చేశారో, అమరులయ్యారో, ఆ ఆకాంక్ష నెరవేరడానికి పునాది పడ్డ రోజు. అందుకే, ఈరోజు ఈ శాసనసభ ద్వారా తమరి అనుమతితో శ్రీమతి సోనియాగాంధీ గారికి జన్మదిన శుభాకాంక్షలు ఈ సభ ద్వారా తెలియజేస్తున్నాం.

(అధికార పార్టీ సభ్యులందరూ బల్లలను చరచడం ద్వారా తమ హర్షాతిరేకాలను వ్యక్తం చేశారు)

తెలంగాణ ప్రజల యొక్క కృతజ్ఞత శ్రీమతి సోనియాగాంధీ గారికి చేరవలసిన అవసరమున్నది. అందుకోసమే, మా సహచర శాసన సభ్యులందరినీ కూడా శ్రీమతి సోనియాగాంధీ గారికి 78వ జన్మదిన శుభాకాంక్షలను తెలియజేయవలసిందిగా కోరుకుంటున్నాను.

అధ్యక్షా, ఈరోజు ప్రత్యేకమైన అంశంపై ప్రస్తావన. మనందరికీ తెలుసు, ఆనాడు తెలంగాణ ఉద్యమం జరుగుతున్నప్పుడు అన్ని అంశాలను మీరు ప్రత్యక్షంగా చూసినవాళ్ళు. ఆరోజు ప్రజల యొక్క భావోద్వేగము, ప్రజలు తెలంగాణ ఉద్యమంలో ఏ విధంగా ముందుకువచ్చి ఈ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ముందుకు నడిపించారో ఆ ప్రత్యేక సందర్భము, తెలంగాణ తల్లి గురించి ఆరోజు జరిగిన చర్చలో మీరూ, మేమూ, ఈ సభలో ఉన్న చాలా మంది సభ్యులు ప్రత్యక్ష భాగస్వాములు. అందుకే ఈరోజు, ఈ తెలంగాణ శాసన సభ తెలంగాణ తల్లికి సంబంధించిన ఒక ప్రత్యేకమైన చర్చ, ప్రకటన ద్వారా భవిష్యత్తు కార్యాచరణ నిర్ధారించుకోవాలని, ఈ రాష్ట్ర ప్రభుత్వం తమరి అనుమతితో ముందుకు సాగుతున్నది. అందులో భాగంగానే... అధ్యక్షా, చరిత్ర ఉన్నంత వరకు తెలంగాణ ప్రజల గుండెల్లో మధుర జ్ఞాపకంగా నిలిచిపోయే అంశాన్ని ఈరోజు మీ అనుమతితో నేను ఈ పవిత్ర శాసన సభలో ప్రస్తావిస్తున్నాను.

"నా తెలంగాణ కోటి రతనాల వీణ... నా తెలంగాణ తల్లి కంజాత వల్లి" అన్న మహాకవి దాశరథిమాటలు నిత్య సత్యాలు.. తెలంగాణ జాతికి నిరంతర స్ఫూర్తి వాక్యాలు.

10.40 ఉ. ఈ భూ ప్రపంచంలో ఏ జాతికైనా గుర్తింపు, గౌరవం ఆ జాతి అస్థిత్వమే. ఆ అస్థిత్వానికి మూలం సంస్కృతి. ఆ సంస్కృతికి ప్రతిరూపమే తల్లి. స్వరాష్ట్రసుదీర్ఘ పోరాట ప్రస్థానంలో సకల జనులను, సబ్బండ వర్గాలను ఐక్యం చేసి నడిపించిన శక్తి స్వరూపిణి తెలంగాణ తల్లి. నాలుగు కోట్ల ప్రజల ఆలోచనలు, ఆచరణలు, కార్యాచరణలన్నింటినీ ఒక్క చోటకు చేర్చి, తెలంగాణ జాతి భావనకు జీవం పోసిన మాతృమూర్తి తెలంగాణ తల్లి. మనల్ని నిరంతరం చైతన్య పరిచి, లక్ష్య సాధన వైపు నడిపించిన గొప్ప స్ఫూర్తి తెలంగాణ తల్లి. అలాంటి తెలంగాణ తల్లి స్వరూపంపై పలు రూపాలు ఇప్పటికే జన బాహుళ్యంలో ఉన్నాయి. వాటిలో దేనికీ ఇప్పటి వరకు అధికారిక గుర్తింపు లేదు. అధికారికంగా మనం గౌరవించుకోలేదు.

తెలంగాణ నేల.. స్వేచ్ఛ కోసం పిడికిళ్ళు బిగించిన ఉత్తేజపు జ్వాల! సకల జనులు ఒక్కటై గర్జించిన ఉద్వేగపు మాల! అటువంటి అనేక ప్రజా పోరాటాలకు ఊపిరి పోసిన మాతృమూర్తిని గౌరవించుకునే లక్ష్యంతో నేడు ప్రజా ప్రభుత్వం "తెలంగాణ తల్లి" ని రూపకల్పన చేసి రాష్ట్ర సచివాలయం

ప్రాంగణంలో ఆవిష్కరణ చేసే ఉత్సవానికి శ్రీకారం చుట్టింది. తెలంగాణ తల్లి అంటే ఒక భావన మాత్రమే కాదు, నాలుగు కోట్ల బిడ్డల భావోద్వేగం. ఆ భావోద్వేగానికి నిండైన రూపం మన తెలంగాణ తల్లి. ప్రజల మనోఫలకాలపై నిలిచి ఉన్న తెలంగాణ తల్లి రూపాన్ని నేడు సచివాలయం సాక్షిగా ఆవిష్కరించేందుకు ప్రజా ప్రభుత్వం సిద్ధమైందని ఈ పవిత్ర సభ సాక్షిగా మీ అందరికీ తెలియజేయడానికి సంతోషిస్తున్నాను.

(హర్షధ్వానాలు)

తెలంగాణ తల్లి రూపకల్పనలో మన సాంప్రదాయాలు, సంస్కృతులు, చారిత్రక నేపథ్యాలను పరిగణనలోకి తీసుకుని ఒక నిండైన రూపాన్ని తీర్చిదిద్దడం జరిగింది. మన సంస్కృతికి అద్దంపడుతూ..ప్రశాంత వదనంతో, సాంప్రదాయ కట్టు బొట్టుతో, మెడకు కంఠె, గుండు పూసల హారంతో, చెవులకు బుట్ట కమ్మలతో, ముక్కుపుడకతో, బంగారు అంచు కలిగిన ఆకుపచ్చ చీరలో, చేతికి గాజులు, కాళ్ళకు కడియాలు, మెట్టెలతో, చాకలి ఐలమ్మ, సమ్మక్క – సారలమ్మ పోరాట స్ఫూర్తితో ఎంతో హుందాతో కూడిన ఆహార్యంతో మన తెలంగాణ తల్లి రూపొందించబడినది. కుడి చేతితో జాతికి అభయాన్నిస్తూ, ఎడమ చేతిలో తెలంగాణ మాగాణంలో పండే సాంప్రదాయ పంటలైన వరి, జొన్నలు, సజ్జలు, మొక్కజొన్న పంటలతో మన సంస్కృతికి, సాంప్రదాయానికి నిలువెత్తు రూపంగా తీర్చిదిద్దడం జరిగింది. తెలంగాణ తల్లి నిలుచున్న పీఠం మన చరిత్రకు దర్పణంగా రూపొందించాం. తెలంగాణ చిరునామానే ఉద్యమాలు, పోరాటాలు, అమరుల ఆత్మ బలిదానాలు. దానికి సంకేతంగా పీఠంలో బిగించిన పిడికిళ్లను పొందుపరచడం జరిగింది. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచంలోనే సమున్నతంగా నిలబెట్టాలన్న లక్ష్యాన్ని గుర్తు చేస్తూ, చేతులన్నీ కలిపి పీఠాన్ని మోస్తున్న తీరు తెలంగాణ పునర్నిర్మాణ రీతిని తెలియజేస్తున్నాయి.

అధ్యక్షా, తెలంగాణ తల్లి రూపకల్పనలో ఉపయోగించిన వర్ణాలకు కూడా ప్రత్యేకత ఉంది. గొప్ప తాత్వికత ఉంది. పీఠంలో నీలం వర్ణం - "గోదావరి కృష్ణమ్మలు.. తల్లీ నిను తడుపంగ" అన్న అందెశ్రీ గీతంలోని తెలంగాణ జల దృశ్యానికి ప్రతీకగా నిలుస్తుంది. అలాగే, ఆకుపచ్చ వర్ణం - " పచ్చని మా నేలల్లో పసిడి సిరులు పండంగ" "అన్న తెలంగాణ సస్యశ్యామల వ్యవసాయ కీర్తికి సంకేతంగా కనిపిస్తుంది. ఎరుపు వర్ణం.. మార్పుకు, ప్రగతికి, చైతన్యానికి ప్రతీక. బంగారు వర్ణం..శుభానికి, ఐశ్వర్యానికి, సమృద్ధికి నిదర్శనంగా నిలబడుతుంది.

"పుట్టుక నీది, చావు నీది, బ్రతుకంతా దేశానిది" అన్న కాళోజీ మాటల స్ఫూర్తితో, స్వరాష్ట్ర ఉద్యమంలో లక్షలాది మంది యువత ఉద్యమ జ్వాలలై వెలిగారు. తమ బండి పైనే కాదు, గుండెపై కూడా తెలంగాణ సంక్షిప్త నామాన్ని TG గా పచ్చబొట్లు వేయించుకున్నారు. అగ్నికీలల్లో తమ దేహాలు భగ్గున మండినా పర్వాలేదు కానీ, TG అక్షరాలను మాత్రం ప్రాణప్రదంగా భావించారు. ఆ ఆకాంక్షలను నెరవేర్చే ఉద్దేశ్యంతో తెలంగాణ సంక్షిప్త నామంగా TG కి అధికారిక గుర్తింపును ఇస్తూ, ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది.

(హర్షధ్వానాలు)

అంతే కాదు అధ్యక్షా. ఉద్యమ సమయం నుండి తెలంగాణ ఆకాంక్షను, ఆత్మగౌరవాన్ని, అస్థిత్వాన్ని, జాతి జనుల కీర్తిని నలుదిశలా వ్యాప్తి చేసిన "జయ జయహే తెలంగాణ జననీ జయకేతనం" గీతాన్ని మన రాష్ట్ర అధికారిక గీతంగా ప్రకటించి, అంతటి గొప్ప గీతాన్ని మనకు అందించి స్ఫూర్తిని నింపిన రచయిత అందెశ్రీని ప్రభుత్వం గౌరవించుకున్నది. తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనంలో భాగంగా ఈ నిర్ణయాలు తీసుకున్నాం. ఆ క్రమంలో అత్యంత కీలకమైన తెలంగాణ తల్లిని మనందరం కలిసి ఆవిష్కరించుకోవడం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే ఘట్టం.

తెలంగాణ తల్లి కేవలం విగ్రహం మాత్రమే కాదు, మన జాతి ఆత్మగౌరవ ప్రతీక, మన అస్థిత్వ పతాక, మన జీవన గమనాన్ని నిర్దేశించే దీపిక, మన భవిష్యత్ కర్తవ్యాన్ని నిరంతరం గుర్తు చేసే విధాత. అందుకే, ఇకపై ప్రతి ఏటా డిసెంబర్ 9 నాడు "తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవం" అధికారికంగా నిర్వహించాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది.

(హర్షధ్వానాలు)

తెలంగాణ కీర్తిని విశ్వ వేదికపై వైభవోపేతంగా చాటి చెప్పేలా ఈ ఉత్సవాన్ని ఘనంగా జరుపుకుందాం. ఈ చారిత్రాత్మక నిర్ణయానికి మీరంతా గుండె లోతుల నుండి ఆమోదం తెలుపుతూ, పెద్ద ఎత్తున కరతాళధ్వనులతో హర్షాన్ని ఆమోదాన్ని తెలపాలని సభ్యులందరినీ కోరుతున్నాను.

(హర్షధ్వానాలు)

అధ్యక్షా, ఇంతకు ముందు ప్రస్తావించినట్లుగా ఇది ఆరు దశాబ్దాల ఆకాంక్ష. ఎన్నో సందర్భాలలో ఈ తెలంగాణ సమాజం శక్తినంతా కూడదీసుకొని అమరులైనా ఫర్వాలేదు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవాలని, ఆరు దశాబ్దాలు వీరోచితంగా పోరాటాలు చేశారు. ఆ పోరాటాలలో ఉస్మానియా, కాకతీయ యూనివర్శిటీలు ఒక ప్రత్యేకమైన భూమికను పోషించాయి. ఉన్నత విద్యను చదవాలని, తద్వారా తమ కుటుంబము, వారి పిల్లలకు బంగారు భవిష్యత్తు ఉండాలని, తండాలలో, గూడాలలో, మారు మూల పల్లెల్లో పేదలు, అత్యంత నిరుపేదలైన బహుజనులు, వాళ్ళ పిల్లలను ఉస్మానియా, కాకతీయ యూనివర్శిటీలకు పంపించడం జరిగింది. కానీ, సామాజిక బాధ్యతతో సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలను పరిష్కరించుకోవాలంటే, విద్య ఒక్కటే కాదు, పోరాటం కూడా చేయాలి, ఈ నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల పక్షాన మేము నిలబడాలనే ఒక సామాజిక బాధ్యతతోని లక్షలాది మంది విద్యార్థినీ, విద్యార్థులు ఉద్యమబాట పట్టిరు అధ్యక్షా. వారి స్ఫూర్తితో ఆరు దశాబ్దాలు తొలి దశ తెలంగాణ ఉద్యమం కావచ్చు, 1996 తెలంగాణ జనసమితి ఆధ్వర్యంలో జరిగిన మలి దశ ఉద్యమం కావచ్చు, రకరకాల రూపాలలో తెలంగాణ ప్రజలు, సందర్భము, సమయం వచ్చినప్పుడల్లా, ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను వెల్లువెత్తుతూనే చూపించిరు అధ్యక్షా. కానీ, వివిధ కారణాల చేత వాయిదాలు పడుతూ వస్తున్నప్పుడు, ఇక ఎలాగైనా సాధించాల్సిందే, చివరి రక్తపు బొట్టు వరకు, ఆఖరి శ్వాస వరకు తెలంగాణ సాధించడం కోసమే, సమిధలైనా ఫర్వాలేదని చెప్పి ఆనాడు యువత ఈ రాష్ట్రసాధనకు ముందుకు వచ్చి ఒక శ్రీకాంతాచారి, కానిస్టేబుల్ కిష్టయ్య, యాదయ్య, ఇషాన్ రెడ్డి, ఎంతో మంది విద్యార్థులు ఉద్యమకారులై, ఆకాశంలో తారాజువ్వలై వెలిగి ఈ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించాలన్న పట్టుదలతో అమరులయ్యారు.

శ్రీమతి సోనియాగాంధీ గారు ఒక తల్లిగా.. వారి అత్తగారు శ్రీమతి ఇందిరాగాంధీగారు కావచ్చు, ఆనాటి ప్రధాన మంత్రి శ్రీ రాజీవ్ గాంధీగారు కావచ్చు, కండ్లముందరే నేలకొరిగి ఈ దేశం కోసం ప్రాణాలు అర్పించినప్పుడు ప్రత్యక్షంగా ఎంతో బాధను చవి చూసిన మాతృమూర్తిగా శ్రీమతి సోనియాగాంధిగారు రాజకీయ ప్రయోజనాలు, రాజకీయ ఆలోచనలు పక్కన పెట్టి ఏది ఏమైనా సరే ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, తెలంగాణ ప్రజల యొక్క ఆకాంక్షను నెరవేర్చాలని, ఒక ఉదాత్తమైన నిర్ణయం తీసుకొని వారు ముందుకు వచ్చి, మొట్టమొదటిసారి 9 డిసెంబరు, 2009 నాడు కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నామని ప్రకటించడం జరిగింది.

10.50 ఉ. ఆ తరువాత చాలా అవాంతరాలు, ఒడుదొడుకులు ఎదురైనా వారు తెలంగాణ రాష్ట్రాన్ని ఇవ్వడం జరిగింది. తద్వారా పార్టీపరంగా, కేంద్ర ప్రభుత్వ పరంగా ఏవేమి కోల్పోయారో ఈ సందర్భంగా నేను ప్రస్తావించదలచుకోలేదు. ఎందుకంటే ఈ డిసెంబరు 9 తేదీన ఒక గొప్ప అంశం ఉన్నది కాబట్టి రాజకీయాలను మిగతా 364 రోజులూ మాట్లాడుకోవచ్చు, ఈరోజు రాజకీయాలను ప్రస్తావించవలసిన అవసరం లేదన్న ఆలోచనతోటి, తెలంగాణ ఉద్యమ సందర్భంగా రకరకాల సంస్థలు రాజకీయ పార్టీలు వాళ్ళవాళ్ళదైన నమూనాలో తెలంగాణ తల్లిని స్ఫురించే విధంగా కొంత కార్యాచరణ చేపట్టారు. ఏవి కూడా అధికారికంగా ఈనాటి వరకు ఉమ్మడి రాష్ట్రంలో కానీ, ఏర్పడిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో గానీ గత ప్రభుత్వం పది సంవత్సరాలుగా టి.జి. విషయంలో గానీ, తెలంగాణ రాష్ట్ర గీతం విషయంలో కానీ, తెలంగాణ తల్లి ప్రతిరూపాన్ని సృష్టించడం ద్వారా తెలంగాణ ప్రజల యొక్క ఆకాంక్షను నెరవేర్చాలనే ఆలోచన చేయలేదు అధ్యక్షా.

ప్రజలు ఎన్నుకొన్న ఈ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల ఆకాంక్ష మేరకు

పనిచేయాలని టి.జి.ని పునరుద్ధరించుకోవడమే కాదు, ఆనాడు ఉద్యమ సందర్భంగా బండ్లమీనే కాదు గుండెలపైన రాసుకున్న టి.జి.ని పునరుద్ధరించడం ద్వారా తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీకగా టి.జి.ని మనం ఈరోజు మనం గొప్పగా రాసుకుంటున్నాము .

అదేవిధంగా ఉద్యమం సందర్భంలో వేలాది లక్షలాది మందిని ఉద్యమ బాటవైపు నడిపించిన జయజయహే తెలంగాణ.. ఒక గొప్ప స్ఫూర్తిని, పోరాట పటిమను, ఉద్యమ బాటవైపు నడిపించినగొప్ప గీతాన్ని మనం రాష్ట్రగీతంగా ఆరోజు మనం చేసుకోవాలి అనుకున్నాము. కానీ పది సంవత్సరాలు తెలంగాణ రాష్ట్రానికి అసలు రాష్ట్రగీతమే లేకుండా పోయింది అధ్యక్షా. అందుకే తమరు స్పీకరుగా బాధ్యతలు చేపట్టిన తరువాత, ఈ ప్రభుత్వం ఏర్పడ్డ తరువాత దశాబ్దాల కాలం పాటు త్రిలింగ దేశం నుంచి తెలంగాణ రాష్ట్రంగా అవతరించిన తెలంగాణ రాష్ట్రానికి రాజకీయ గీతం లేకపోవడం ఒక లోటుగా భావించి ఆ జయజయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్రగీతంగా మనం ఈరోజు పొందుపరచుకొని, ఏ శుభకార్యం మనం చేపట్టినా, రాష్ట్ర ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు చేపట్టినా, జయజయహే తెలంగాణను పాడుకుంటూ ఈరోజు మనం పనిలో ముందుకు సాగుతున్నాము.

అదేవిధంగా పది సంవత్సరాలు గత ప్రభుత్వంలో తెలంగాణ తల్లి ప్రతిరూపమే అధికారికంగా లేదు అధ్యక్షా. ఒక లోటు. ఈరోజు మన ప్రతీక, మన భావన, మన ఆలోచన, మన ఆత్మ గౌరవం, మన అస్థిత్వం ఉట్టిపడే విధంగా, చాలా మంది తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులనే కాకుండా కవులను, కళాకారులను, తెలంగాణ సంస్కృతి పట్ల అంకిత భావంతో పనిచేసినవారందరితో చర్చించి.. చర్చలో రెండు అంశాలు ప్రస్తావనకు వచ్చాయి అధ్యక్షా. ఒక అంశం - 'తెలంగాణ దేవత', రెండవ అంశం - 'తెలంగాణ తల్లి'. తెలంగాణ మూర్తి దేవతలాగా వజ్ర వైఢూర్యాలతో, కిరీటాలతో, భుజకీర్తులతో ఉండాలా? లేకపోతే తెలంగాణ తల్లి మన తల్లిలాగ, మనింట్లో మన అమ్మను చూసుకుంటే మనకు ఏ విధంగానైతేసంతృప్తినిస్తుందో, ఒక అమ్మ మనల్ని ఎంత ప్రేమగా గుండెల్లో పెట్టుకుని చూసుకుంటుందో, అట్లా ఉండాలా? అనే ప్రస్తావన వచ్చినపుడు మేధావులు, ఉద్యమకారులు, కవులు, కళాకారులు మనం తెలంగాణ తల్లి అనే భావనతోనే ఉద్యమ బాట పట్టాము, మనకు తల్లి కావాలి, దేవత గుడిలోనే ఉంటుంది, తల్లి మన ఇంట్లో ఉంటుంది, తల్లి ఒడిలో మనం పెరుగుతాము కాబట్టి, మనం తల్లి ప్రతిరూపమే పెట్టుకోవాలని వారందరూ సూచనలు చేశారు. ఈరోజు ప్రతి ఇంట్లో కన్నతల్లిని చూసే విధంగా, ఈరోజు తెలంగాణ తల్లిని చూసిన తెలంగాణ సమాజంలో ఎవరైనా, అది తమరు కావచ్చు అధ్యక్షా, నేను కావచ్చు లేదా మన శాసన సభ్యులు ఎవరైనా ఈరోజు సభలో ఉన్న ఏ సభ్యుడికైనా తెలంగాణ తల్లిని చూస్తే సొంత మాతృ మూర్తిని చూసిన ఒక గొప్ప అనుభూతితో తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు, అస్థిత్వం, బహుజనుల తెలంగాణ తల్లిని ఈరోజు మనం ప్రతిష్టించుకుంటున్నాము అధ్యక్షా.

ఇంత గొప్ప నిర్ణయం తీసుకున్నప్పుడు, డిసెంబరు 9 తేదీన ఎలాంటి వివాదాలు, రాజకీయాలకూ తావు లేకుండా, తెలంగాణ సమాజం అంతా రాజకీయ పార్టీలు కావచ్చు, ప్రజాప్రతినిధులు కావచ్చు, రైతుకూలీ సంఘాలు కావచ్చు లేకపోతే తెలంగాణ సమాజంలో వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న వారు కావచ్చు, నాలుగుకోట్ల తెలంగాణ సమాజమంతా ఒక్కటై ఏకగళంతో ఈరోజు తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాలు జరుపుకుంటే బాగుంటుంది, మన పట్ల ఇతర రాష్ట్ర, ఇతర దేశ ప్రజలకు కూడా ఒక గొప్ప గౌరవం పెరుగుతుంది అధ్యక్షా.

దురదృష్టవశాత్తు కొంతమందికి ఇది నచ్చలేదు. ఒక వ్యక్తి, ఒక కుటుంబం, ఒక పార్టీ ఆలోచననే నాలుగుకోట్ల తెలంగాణ ప్రజలన్న ఆలోచన, భావనసమంజసం కాదు. మధ్య యుగాలలో చక్రవర్తులు 'నేనే రాజ్యం – రాజ్యమే నేను' అనే భావనలో, భ్రాంతిలో ఉండేవాళ్ళు అధ్యక్షా. మధ్య యుగాల చక్రవర్తుల యొక్క ఆలోచనతో ప్రజాస్వామ్యంలో ప్రజా ప్రభుత్వం నడవదు అధ్యక్షా. నాలుగు కోట్ల ప్రజలు ఏమి కోరుకుంటున్నారో, వారి ఆలోచన ఏంటో, ఆ ఆలోచనలకు ప్రతిరూపమే ఈనాటి ప్రజాప్రభుత్వం. అందుకే ఈరోజు ఈ రాష్ట్రాన్ని పరిపాలించే సచివాలయం.. సచివాలయం పరిపాలనకు గుండెకాయ. ఆ గుండెకాయ గుండెల్లోనే

తెలంగాణ తల్లి ఉండాలి, విగ్రహాన్ని ప్రతిష్టించాలి అని ప్రభుత్వం భావించి ఈరోజు సాయంత్రం 6 గంటల 5 నిమిషాలకు తెలంగాణ మాతృమూర్తిని, తెలంగాణ తల్లిని మనం ఆవిష్కరించుకోబోతున్నాము.

ఈ సందర్భంగా నేను సహచర శాసన సభ్యులకు, తెలంగాణ ప్రజానీకానికి, ప్రతిపక్షాలు కావచ్చు, పాలకపక్షం కావచ్చు, ఇతర రాజకీయ పక్షాలకు తమరి ద్వారా నేను సాదరంగా ఆహ్వానం పలుకుతున్నాను. దయచేసి ఈ ఒక్కరోజు రాజకీయాలకు అతీతంగా తెలంగాణ సమాజంకోసం మనం సమయాన్ని ఇద్దాము. ఈరోజు వివాదాలకు తావునీయొద్దు అని నేను ప్రతిపక్షాలకు, సహచర ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నాను అధ్యక్షా. రేపటి నుంచి ఏ అంశాలైనా ప్రస్తావిద్దాం, ఏ రాజకీయ అంశాలు కూడుకున్న విషయాలనైనా మనం ప్రస్తావించుకుందాము. కాబట్టి దయచేసి ప్రధాన ప్రతిపక్ష నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర రావుగారు, కేంద్ర మంత్రివర్గ సభ్యులు కిషన్ రెడ్డి గారు, అసదుద్దీన్ ఒవైసీ గారు, అదేవిధంగా కమ్యూనిస్టు సోదరులకు, కేంద్ర మంత్రి బండి సంజయ్ గారికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ రాష్ట్రగవర్నరు గారికి, చాలా వరకు మా మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గారు కలిసి వారికి ఆహ్వాన పత్రిక ఇవ్వడం జరిగింది. ఎవరికైనా ఆహ్వాన పత్రిక అందకపోయినా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా అధికారికంగా పాత్రికేయ మిత్రులను, కవులను, కళాకారులను, ఉద్యమకారులను, నిరుద్యోగ యువకులను, తెలంగాణ సమాజంలో ఉన్న వారందరినీ కూడా ఈరోజు సాయంత్రం మనం జరుపుకోబోయే ఈ ఉత్సవంలో పూర్తి స్థాయిలో పాల్గొని మనందరం ఏకాభిప్రాయంతోని ఉన్నాము అనే ఒక భావన కలిగించే విధంగా ఈ ఉత్సవాన్ని గొప్పగా జరుపుకుందాం. తమరు కూడా ఆ కార్యక్రమానికి వచ్చి అక్కడున్న వారందరితో మమేకమై ఈ తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాలను జరుపుకోవడానికి, అదేవిధంగా ప్రతి సంవత్సరం డిసెంబరు 9 తేదిన తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాలు జరుపుకోడానికి తమరు ఆమోదించి ఈ ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయండి. ఈ ఉత్సవాన్ని జరుపుకుందాం.

చివరిగా ఒక్క మాట. దేవత ఆశీర్వదిస్తుంది, అమ్మ మనల్ని ప్రేమిస్తుంది, మన ఆకలిని గుర్తించి అడక్కపోయినా అమ్మ మనకు అన్నం పెడుతుంది. అడక్కుండానే అన్నం పెట్టి బిడ్డలను కాపాడుకునే తల్లి తెలంగాణ తల్లి. ఆ తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాలు జరుపుకోవడం తెలంగాణ బిడ్డలుగా మన బాధ్యత. అందుకే ఈ డిసెంబరు 9వ తేది, ఈ వర్షదినాన్ని తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవంగా మనమందరం జరుపుకుందామని, మీరందరూ పెద్దఎత్తున చప్పట్లతో ఈ కార్యక్రమాన్ని ఆమోదించవలసిందిగా సభ్యులందరికీ విజ్ఞప్తి చేస్తూ తమరి దగ్గర సెలవు తీసుకుంటున్నాను అధ్యక్షా.

11.00 ఉ. శ్రీ డి. శ్రీధర్ బాబు (గౌరవ సాంకేతిక సమాచార, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్స్, పరిశ్రమలు మరియు వాణిజ్యం మరియు శాసన సభా వ్యవహారాల శాఖామాత్యులు):- అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన ఈ స్టేట్‌మెంట్ పైన రూల్స్ ప్రకారం మాట్లాడే అవకాశం ఉండదు. కాని ఇది ఒక ప్రత్యేకమైన అంశం, ప్రత్యేకమైన ప్రస్తావన కనుక గౌరవ శాసన సభ్యులు మాట్లాడాలని కోరుతున్న సందర్భంలో మీరు అనుమతిస్తే, వారికి అవకాశం కల్పిస్తే మాకేం అభ్యంతరం లేదు. ఎందుకంటే స్టేట్‌మెంట్ పైన రూల్స్ ప్రకారం చూస్తే, మాట్లాడే అవకాశం ఉండదు. ఇది ప్రత్యేకమైన అంశం గనుక, మీరు అనుమతిస్తే, మాకేం అభ్యంతరం లేదు అధ్యక్షా.

అదే విధంగా ఇంతకుముందు గౌరవ ముఖ్యమంత్రిగారు ఈ స్టేట్‌మెంట్ ప్రకారం ఈ వేడుకని ఎందుకు చేస్తా ఉన్నాం, ఈ రోజుకి ఉన్న ప్రత్యేకత ఏమిటి, డిసెంబర్ 9వ తారీఖు నాడు, ఆరోజు శ్రీమతి సోనియా గాంధీగారు ప్రకటన చేసిన తరువాత, మరొకసారి తెలంగాణ యావత్ జాతికి సంబంధించిన ఆరాటం, అనేక మంది ఉద్యమకారుల పోరాటం, సమస్త తెలంగాణవాదులకి చెందిన ఆశయం నెరవేరిన రోజు కనుక ఈరోజు మనం తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పన పై చర్చ జరుగుతా ఉన్న సందర్భంలో మన సంస్కృతికి, మన ఆనవాళ్లకు, మన చరిత్రకు దర్పణంగా రూపొందించుకుంటున్న ఈ తెలంగాణ తల్లి విషయంలో మేము ఆశించాం అధ్యక్షా, ఇతర పార్టీలకు సంబంధించి ప్రధానంగా ప్రధాన ప్రతిపక్ష పార్టీ అయిన టిఆర్ఎస్‌కి చెందిన గౌరవ శాసన సభ్యులుగాని, వారి నాయకుడు గాని, మేము చేపడుతున్న ఈ చారిత్రాత్మకమైన కార్యక్రమానికి సంబంధించి

వారికి ఉన్న గొప్ప అనుభవాన్ని గురించి రెండు మాటలు చెప్పి, తల్లి విగ్రహ రూపకల్పనపై ఇక్కడ రెండు మాటలు చెబుతారనుకున్నాము అధ్యక్షా. ఈరోజు కూడా వారు రాజకీయ ప్రస్తావనతో అసెంబ్లీకి రావద్దు, ఈ తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పన పై జరిగే చర్చలో పాల్గొనవద్దు అనే ఉద్దేశాన్ని విడనాడాలి. ఏదో కారణంతో ఈ రోజు రాకుండా ఉండాలని అసెంబ్లీకి సంబంధించిన రూల్స్, ప్రొసీజర్స్‌కి విరుద్ధంగా అసెంబ్లీ సమావేశాలకు రాకుండా చూసే విధంగా ఒక ప్రయత్నం జరుగుతున్న సందర్భాన్ని ప్రస్తావన చేస్తూ ఇప్పుడు కూడా అప్పీల్ చేస్తా ఉన్నాం. మీరు రండి, స్పీకర్‌గారిని మేము కూడా కోరుతా ఉన్నాము. ఇదొక ప్రత్యేకమైన అంశం, మన సంస్కృతికి, యావత్ జాతికి నిలువుటద్దంగా నిలబడే ఒక విగ్రహ రూపకల్పనతో పాటు, ఒక ఆవిష్కరణ చేసే రోజు ఇది. చరిత్రలో నిలిచిపోయే రోజు. భేషజాలను పక్కన పెట్టండి. ఈ ఒక్క రోజు రాజకీయాలను పక్కన పెట్టండి. మీరందరూ రావాలి. ఇదొక ప్రత్యేకమైన అంశం. ఇందులో పాల్గొనాలని అందరినీ మరొక్కసారి కోరుతున్నాను.

శ్రీ పాయల్ శంకర్ (ఆదిలాబాద్):- అధ్యక్షా, మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు మీకు ప్రత్యేకంగా ధన్యవాదాలు. ముఖ్యమంత్రిగారు ప్రత్యేకంగా ఒక విషయాన్ని ప్రస్తావించడం జరిగింది. ఈ రాష్ట్ర ఆవిర్భావం తరువాత టి.ఎస్.ని టి.జి.గా చేయడం గాని, రాష్ట్ర చిహ్నం విషయంలోగాని, తెలంగాణ తల్లి విషయంలోగాని, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత తెలంగాణ తల్లి విగ్రహాన్ని చూస్తే మన ఇంట్లో తల్లిని రోజూ ఏ రకంగా చూసుకుంటే ఆ రూపాన్ని మన మదిలో తలచుకుంటే ఏ రకమైన ఆనందం కలుగుతుందో ఆ రకమైన ఆనందం కలగాలన్న ఒక గొప్ప ఆలోచన తోనే ఈ యొక్క తెలంగాణ తల్లి విషయంలో మార్పును చేశామని గౌరవ ముఖ్యమంత్రిగారు చెప్పడం జరిగింది. ప్రభుత్వానికి పూర్తి అధికారం ఉన్నది. కాని మా తరపున విజ్ఞప్తి ఏమిటంటే ప్రభుత్వానికి అధికారం ఎంత ఉన్నప్పటికీ ఈ సభలోని అన్ని పక్షాల సభ్యులతోని ప్రభుత్వానికి ఉన్న ఆలోచనని పంచుకుని చేస్తే ఇంకా బాగుంటుందని మా సలహా, సూచన. అదే విధంగా మాకు అనిపించింది. మిగతా విషయాల చర్చకు నేను వెళ్లను. కాని తెలంగాణ తల్లి విగ్రహంలో బతుకమ్మ ఉంటే బాగుంటుందేమో అనే ఒక ఆలోచన మాకు కలిగింది. సరే, అన్ని కోణాల నుంచి ఆలోచించి మీరు నిర్ణయాలు తీసుకుని ఉండొచ్చు. కాని నేను ఏమంటున్నానంటే గౌరవ ముఖ్యమంత్రిగారు ఈ రాష్ట్రానికి సరిగా లేనటువంటి అన్ని విషయాల మీద మార్పులు చేసే ప్రయత్నం చేస్తున్నారు. దానికి నేను ముఖ్యమంత్రిగారికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తా ఉన్నాను.ఈ రాష్ట్ర చిహ్నాన్ని మార్చారు, ఈ రాష్ట్ర గీతాన్ని మార్చారు, విగ్రహాన్ని కూడా మార్చారు. నేను ఏమంటున్నానంటే రూపకల్పన చేశారు, సరే ఏది మంచి అనిపిస్తున్నదో అది చేసే ప్రయత్నం చేస్తున్నారు. చాలా సంతోషం.

మేము ఏమంటున్నామంటే గత ప్రభుత్వం జారీ చేసిన 317 జీ. ఓ. ఉద్యోగులకు పెను శాపంగా మారింది అధ్యక్షా. గౌరవ ముఖ్యమంత్రిగారికినా తరపున విజ్ఞప్తి ఏందంటే .. ప్రభుత్వ ఉద్యోగులు ఈ 317 జీ. ఓ. వలన ఎన్ని పాట్లు పడుతున్నారంటే .. తొందరగా నిర్ణయం తీసుకోండి. మూడు,నాలుగు విషయాల్లో మీరు ఏ విధంగానైతే స్పీడుగా నిర్ణయాలు తీసుకుని, సభలో చర్చపెట్టి ఏ రకంగా ముందుకు పోయే ప్రయత్నం చేస్తున్నారో ఈ 317 విషయంలో కూడా చేయండి. అసలు మనకు తెలంగాణ ఉద్యమమే స్థానికత కొరకు జరిగింది. స్టేట్‌మెంట్‌కి సంబంధించి ఒకటి, రెండు ఉదాహరణలు చెప్పే ప్రయత్నం చేస్తున్నాను. నేను ప్రభుత్వాన్ని విమర్శించడం లేదు అధ్యక్షా. చేస్తున్న మంచి పనులకు, ఇంకొక నాలుగు మంచి పనులు చేస్తే బాగుంటుందని ప్రభుత్వానికి సూచనలు మాత్రమే చేయదలచుకున్నాను. నేను ఎందుకు ఈ మాట చెబుతున్నానంటే, అసలు తెలంగాణ ఉద్యమమే స్థానికత కొరకు ఏర్పడింది. స్థానికత విషయంలోనే మనకు పంచాయతీ అంతా వచ్చింది. కాని తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత ఈ 317 జీ.ఓ. వచ్చి, ప్రభుత్వ ఉద్యోగులకు ఈ రకమైన ఇబ్బంది కలుగుతుందని ఎవరూ కూడా ఊహించలేదు. నేను అందుకే చెబుతున్నా. ఇన్ని మంచి పనులు చేస్తున్నామని సభలో చెబుతున్నారు. చాలా సంతోషం. ఈ మంచి పనులు కూడా అంత స్పీడుగా చేయండి.

చివరగా ఒక విషయం చెప్పి ముగిస్తాను అధ్యక్షా. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గత ప్రభుత్వం చిన్నాభిన్నం చేసి ఉండొచ్చు. ప్రభుత్వ ఉద్యోగులు విపరీతంగా ఇబ్బందులు పడుతున్నారు. వాళ్లు జమ చేసుకున్న జీపిఎఫ్ కూడా.. అది తప్పు అని మీ మీద నింద వేసి, నేను రాజకీయ విమర్శ చేయదలచుకోలేదు. గత ప్రభుత్వం చేసినటువంటి పాపం కావచ్చు. గత ప్రభుత్వం చేసినటువంటి తప్పులు కావచ్చు, వెంటనే ఈ తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సరిదిద్ది ప్రభుత్వ ఉద్యోగులు జీపిఎఫ్‌ను కూడా తీసుకోలేనటువంటి పరిస్థితులపై గౌరవ ముఖ్యమంత్రిగారు దృష్టిపెట్టవలసిందిగా మా తరపున విజ్ఞప్తి చేస్తా ఉన్నాను. భవిష్యత్తులో ఇటువంటి పెద్ద మార్పులు చేసేముందు, చర్చ జరపండి. అధికారం మీకున్నది. రాష్ట్ర ప్రజలు మీకు అధికారం ఇచ్చారు. కానీ మిగతా పక్ష సభ్యుల సలహాలు, సూచనలు కూడా పరిగణనలోకి తీసుకుంటే బాగుంటుందని ప్రభుత్వానికి ఈ సందర్భంగా చెప్పదలచుకున్నాను.

శ్రీ పోచారం శ్రీనివాస్‌రెడ్డి (బాన్సువాడ):- అధ్యక్షా, తమరు మాట్లాడడానికి అనుమతి ఇచ్చినందుకు ధన్యవాదాలు. తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పన పై గౌరవ ముఖ్యమంత్రిగారు చేసినటువంటి అంశాన్ని స్వాగతిస్తూ, సంపూర్ణంగా మద్దతిస్తూ ఇదొక మంచి ఆలోచనతో చేపట్టినటువంటి కార్యక్రమం. ప్రభుత్వాలు మారుతుంటాయి, నాయకులు మారుతుంటారు. కాని ఒక విగ్రహం పైన, విగ్రహ రూపకల్పన పైన అనేక అంశాలు అందులో ఇమిడి ఉన్నాయి. నీలిరంగు నదులకు, ఆకుపచ్చ రంగం పంటలకు .. అంటే మంచి ఉద్దేశంతో గౌరవ ముఖ్యమంత్రిగారి నాయకత్వంలో ఈ తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపకల్పన చేశారు.

11.10 ఉ. మేమందరం కూడా తెలంగాణ 4 కోట్ల మంది ప్రజలలో మేము ఒకరము. మేము అతీతులం కాదు. మేము కూడా ఆనాడు తొలిదశ పోరాటంలో ఉన్నాము, మలిదశ పోరాటంలో ఉన్నాము. ఇప్పుడు కూడా మీ నాయకత్వంలో శాసన సభ్యుడిగా ఉన్నాము. ఈ శాసన సభలో ముఖ్యమంత్రిగారి నాయకత్వంలో మనందరం హుందాతనంతో వ్యవహరించాలి. నేను కూడా ఆ స్థానంలో ఉన్నప్పుడు చాలా సార్లు రిక్వెస్ట్ చేసేవాడిని. శాసన సభ మర్యాదలు, శాసన సభ హుందాతనాన్ని కాపాడుకోవాలి. మనం మాట్లాడే భాష, మనం మాట్లాడే తీరు బాహ్యప్రపంచానికి ఆదర్శంగా ఉండాలి. అంతేగానీ చిల్లర, మల్లర మాటలు మాట్లాడుకొని ఒకరినొకరు నిందించుకొంటే ప్రయోజనం లేదు. తెలంగాణ రాష్ట్రం అంటే ఒక అత్యున్నతమైనటువంటి, ఆదర్శమైనటువంటి రాష్ట్రంగా పేరు తెచ్చుకోవాలి. ఇలా దేశంలోనే కొత్త రాష్ట్రంగా ఏర్పడిన తరువాత ఈ సంవత్సరం కాలంలోనే వివిధ కార్యక్రమాలు చేపట్టి.. ఎందుకంటే నేను గత 25,30 సంవత్సరాలుగా శాసన సభలో ఉన్నాను. ఒక యువకుడు ముఖ్యమంత్రిగా అయిన తరువాత వారి నాయకత్వంలో పనులు బాగా జరుగుతా ఉన్నాయి. అందరూ ఆమోదించాల్సిందే. రాజకీయ విమర్శలు వేరు, వాస్తవాలు వేరు. కాబట్టి ఈనాడు వారి నాయకత్వంలో జరిగే కార్యక్రమాలు గానీ, తెలంగాణ తల్లి రూపకల్పనలో వారు చేసినటువంటి కృషిగానీ అభినందనీయమని ఈ సందర్భంలో తెలియజేస్తున్నాను. అందుకే రాజకీయాలకు తావు ఇవ్వకుండా తెలంగాణ తల్లి రూపకల్పనలో భాగస్వాములైనటువంటి అందరినీ అభినందిస్తూ, ఈరోజు సాయంత్రం గం. 6.05 నిమిషాలకు తెలంగాణ తల్లి విగ్రహ ప్రారంభోత్సవానికి పార్టీలకు అతీతంగా, మతాలకు అతీతంగా, కులాలకు అతీతంగా, వర్గాలకు అతీతంగా అందరూ కూడా వచ్చి పాల్గొనండి. తల్లి అంటే మనందరికీ కన్నతల్లే. తల్లిని గౌరవించుకోవడం మనందరి బాధ్యత. ఏ కడుపులో ఏ బిడ్డ పుట్టినా, ఆ తల్లి జన్మిస్తేనే మనం పుట్టాము. ఈరోజు తెలంగాణ తల్లి జన్మించింది కాబట్టే, మనందరం ఇక్కడ ఉన్నాము, ఈ శాసన సభలో నిలబడ్డాము. మన నాలుగు కోట్ల మందికి తెలంగాణ తల్లి నిజమైన తల్లి మన తెలంగాణ తల్లి. ఒక్కొక్కరికి ఒక్కొక్క తల్లి ఉండవచ్చు. కానీ నాలుగు కోట్ల మందికి తల్లి తెలింగాణ తల్లి. వారిని గౌరవించుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉంది. గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పనపైన దానిని సంపూర్ణంగా ఆమోదిస్తూ, సహృదయంతో స్వాగతిస్తూ, వారికి అభినందనలు తెలియపరుచుకుంటూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ పొన్నం ప్రభాకర్ (గౌరవ రవాణా మరియు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖామాత్యులు):- అధ్యక్షా, నమస్కారం. గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టినటువంటి లేదా చెప్పినటువంటి అంశాల మేరకు ఈరోజు కొంతమంది గౌరవ సభ్యులు మాట్లాడిన దాని మీద ఒక చర్చ చేస్తూ, ముందుగా ఈరోజు అసలు తెలంగాణ రావడానికి కారకులైనటువంటి యూపిఏ ఛైర్ పర్సన్.. ఎందుకంటే మేము ఆనాడు పార్లమెంటులో ఉంటిమి. 'తెలంగాణ సోనియాగాంధీగారు లేకపోతే రాకపోతుండే' అనే మాటకు అనుగుణంగా డిసెంబర్ 9వ తేదీనాడు ప్రకటించినటువంటి ఈ సందర్భంలో వారికి జన్మదిన శుభాకాంక్షలు చెప్పడం జరిగింది. ఈ సందర్భంలో కొంత చర్చ జరుగుతూ, మనం మాట్లాడుకుంటున్న సందర్భంలో గౌరవ సభ్యులు మాట్లాడుతూ, మీరు అన్ని మార్చుకుంటూ పోతున్నారని చెబుతున్నారు. తెలంగాణ చిహ్నం మార్పు జరగలేదు అధ్యక్షా. చర్చ జరుగుతూ ఉంది. తెలంగాణకు సంబంధించి ఎక్కడ కూడా గేయం లేదు. కొత్తగా తెలంగాణ సెంటిమెంటుకు అనుగుణంగా తెలంగాణ పేరు మీద ఏర్పడ్డ ప్రభుత్వం తెలంగాణకు సంబంధించి ఒక గీతం ఉండాలనే కనీస ఆలోచన చేయకపోవడంతో మా ప్రభుత్వం రాగానే తెలంగాణ గీతం ఉండాలని ఒక గీతాన్ని తీసుకొచ్చి అధికారికంగా క్షేత్రస్థాయిలో దానిని వాడుతున్నాము. అదే విధంగా ఇప్పుడున్న విగ్రహాలు తెలంగాణ తల్లి అని ఏవైతే పెడుతున్నారో అవన్నీ ఒక పార్టీకి సంబంధించినవే తప్ప శాసన సభలో గానీ, ప్రభుత్వ పరంగా గానీ, ఎక్కడా తెలంగాణ విగ్రహం అధికారికంగా లేదు. ఈరోజు తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని మన డా. బీఆర్. అంబేద్కర్ సచివాలంలో అందరికీ కనపడే విధంగా పరిపాలన బాగుండాలని, అందరికీ స్ఫూర్తిదాయకంగా ఉండాలని, ఈరోజు తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టుకుంటున్నాము.

పది సంవత్సరాల నుండి వారు అధికారికంగా తెలంగాణ తల్లిని ఎందుకు తీసుకురాలేదని అడుగుతున్నాము. తెలంగాణ వ్యక్తిగా లేదా కుటుంబపరంగా లేదా కొంత మందికి మాత్రం పరిమితం కాదు కదా. తెలంగాణకు సంబంధించినటువంటి సకల జనుల ఆకాంక్షల కొరకు ఏర్పాటై తెలంగాణలో మనకంటూ ఒక తల్లి రూపంలో తెలంగాణ చిహ్నం ఉండాలనే ఒక ఆలోచన రాకపోవడం, ఈరోజు మా ప్రభుత్వం తీసుకుంటుంటే ఏదో మేము మార్చినము, మార్చినము అని దయచేసి మీరు కూడా పొరపాటు పడొద్దు. ఇప్పటి వరకు అధికారికంగా తెలంగాణ విగ్రహం ఎక్కడా లేదు. ఇదే సందర్భంలో మీ ద్వారా రాష్ట్రప్రభుత్వంలో గౌరవ ముఖ్యమంత్రి గారు, అందరూ కలిసి ఒక నిర్ణయం తీసుకోవలసిన అవసరం ఉంది. ఈ విగ్రహాలన్ని కూడా ప్రతి జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ల దగ్గర కావొచ్చు, పోలీస్ కార్యాలయాల దగ్గర కావొచ్చు, మండల కేంద్రంలో ఉంచి అధికారికంగా ప్రతి సంవత్సరం డిసెంబర్ 9వ తేదీన తెలంగాణ తల్లి దినోత్సవం జరుపుకునే విధంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నాము.

అదే విధంగా అనేక అంశాలు చెబుతున్నారు. అసలు తెలంగాణ రావడానికి సోనియా గాంధీగారి అకుంఠిత దీక్ష , సోనియా గాంధీగారి కమిట్‌మెంట్. ప్రక్క రాష్ట్రంలో నష్టం జరుగుతుందని తెలిసినప్పటికీ కూడా రాజకీయాలకు అతీతంగా, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సోనియా గాంధీగారు తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారు. ఈరోజు వారి జన్మదినం..., వారు తెలంగాణ ఏర్పడడానికి, ప్రజాస్వామిక గొంతు ఏర్పడడానికి కారణమైన నాయకురాలు అని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

రాజకీయంగా తెలంగాణకు సంబంధించినటువంటి అంశం మీద మనం పది సంవత్సరాలుగా చూసాము. పరిపాలన, ఉద్యోగాలకు సంబంధించి చెబుతున్న మాటలు చూశాం. ఉద్యోగుల నాయకులకు పదవీ విరమణ తరువాత పదవులు ఇస్తామని చెప్పి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించబడలేదు అధ్యక్షా. జీ.ఓ. 317 ఎందుకొచ్చింది? లేదా ఇతరత్రా అనేక అంశాలు .. ఉద్యోగాలకు సంబంధించి ఒక ప్యాంపరింగ్ లాగా నాయకులను మంచిగా చేసుకొని, నాయకులు రిటైర్‌మెంట్ కాగానే ఏదో పదవులు ఇచ్చేస్తే, పాపం ఉద్యోగులందరూ పది సంవత్సరాలు ఇబ్బంది పడితే, మా దామోదర్ రాజనర్సింహం గారి నాయకత్వంలో శ్రీధర్ బాబుగారు, నేను, ముఖ్యమంత్రి గారు వేసిన సబ్ కమిటీ మేరకు అనేక సందర్భాల్లో దాదాపు

20, 30 సార్లు సమావేశమై ఆ సమస్యలన్ని పరిష్కరించే విధంగా ప్రయత్నం చేశాము. ఇంక ఒక లోకల్‌కి సంబంధించిన సమస్య ఉంది. దానికి సంబంధించిన అనేక డెఫినేషన్స్ ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వంతో దాని మీద చర్చించి ఒక క్లారిటీ ఇప్పించే ప్రయత్నం చేయమని గౌరవ మంత్రిగారిని ఈ సందర్భంగా కోరుతున్నాను.

నిధులు తదితర అంశాలు.., రైట్. రాష్ట్రంలో అనేకమైన ఆర్థిక ఇబ్బందులున్నాయి. నేను కేంద్రంలో అధికారంలో ఉన్న గౌరవ భారతీయ జనాతా పార్టీ సభ్యుడిని కోరుతున్నాను. మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన మొదటి శాసన సభ సమావేశంలోనే బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోతే మనందరం కూడా తీర్మానం చేసుకున్నాము. ఈవేళ మొన్నటికి మొన్న ఖమ్మం జిల్లా వరదల వల్ల మునిగితే రూ.10 వేల కోట్ల ప్రతిపాదనలు అధికారులకు, తదితరులందరికీ, గౌరవ మంత్రులకు విజ్ఞాపన పత్రాలు ఇస్తే కూడా ముష్టి రూ.400 కోట్లు ఇచ్చిన పరిస్థితి ఈవేళ కనపడుతుంది. కాబట్టి, దయచేసి రాజకీయాలకు అతీతంగా ఈరోజు మనం నిధులు తెచ్చే విషయంలో కలిసి ముందుకు పోదాం. తెలంగాణ తల్లికి సంబంధించిన విషయంలో అధికారికంగా ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ, భవిష్యత్తులో అన్ని జిల్లా కేంద్రాలలో పెట్టేవిధంగా కార్యక్రమం జరగాలని ఈ సందర్భంగా నేను కోరుకుంటున్నాను. దానితోపాటు ఈరోజు తెలంగాణ తల్లికి సంబంధించి రాచరికపు భావాలు లేకుండా ఒకవైపు అభయహస్తం, ఇంకొకవైపు పాడిపంటలను చూపెడుతూ, పచ్చదనం అభివృద్ధికి నిదర్శనంగా, క్రింద తెలంగాణ ఉద్యమ స్ఫూర్తినిస్తూ, గద్దెని తీసుకొని ఏర్పరచిన విగ్రహాన్ని మనందరం కూడా గుండెల్లో నింపుకొని ఉద్యమ ఆకాంక్షకు అనుగుణంగా తెలంగాణ ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని వినియోగించుకోవాలని ఈ సందర్భంగా కోరుతున్నాను. ఇది ఏదో ఎవరో మాకు సంబంధించి లేదు, మాకు సంబంధినట్లె ఉండాలి, మన గ్రామాల్లో ప్రజలు ఇంతకు ముందు మాట్లాడుకున్నట్లుగా కిరీటాలు, భుజకీర్తులు ఉండాలనే ఆలోచన లేకుండా, గ్రామాల్లో కనిపించే గ్రామ వనితలాగా ఉండేలా ఒక ఆలోచన చేయడం జరిగిందని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను. భవిష్యత్తులో దీనికి సంబంధించి ఇంకా ఏమన్నా అంశాలుంటే తెలంగాణ తల్లికి సంబంధించి కావచ్చు, సాంప్రదాయాలకు సంబంధించిన అంశం కావచ్చు, ఇతరత్రా విషయాలకు సంబంధించి అనేక అంశాలున్నాయి అధ్యక్షా. కానీ, తెలంగాణాకు సంబంధించినటువంటి, ఆత్మ గౌరవానికి సంబంధించిన విషయం వచ్చినప్పుడు ఎవరో కొంత మంది హక్కుగా భావించుకోవద్దు. ఈరోజు ఆనాడు తెలంగాణ రావడానికి కారకులైనటువంటి ఆర్‌టీసీకి సంబంధించి

نہیں چلے گا بس کا پہیا نہیں چلے گا

వాళ్లు కావచ్చు. సింగరేణి కార్మికులు బొగ్గు ఉత్పత్తి బంద్‌చేస్తే, దక్షిణ భారతదేశంలో విద్యుత్తు ఉత్పాదనకు సంబంధించిన అంశం కావచ్చు. ఎన్‌జీవోలు కావచ్చు. లేకపోతే అనేకమంది కష్టపడి సకల జనుల సమ్మె మీకు తెలుసు అధ్యక్షా. మనం సాగర తీరం తీసుకున్నా, లేకపోతే ఇతరత్రా ఉద్యమాలు తీసుకున్నా చాలామంది వ్యతిరేకించినవారు కూడా ఈరోజు మేము దానికి కారణమనే మాట చెప్పుకుంటున్నారు. ఏదేమైనా, తెలంగాణ సకల జనుల ఆకాంక్ష అందరు ప్రజలు కోరుకున్నారు. వచ్చింది. అందరి ఆకాంక్షకు అనుగుణంగా ప్రభుత్వం నడవాలి. అందుకే ఈవేళ ఈప్రభుత్వం రాగానే 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు కావొచ్చు, రైతాంగ రుణమాఫీ కావొచ్చు, 55 వేల ఉద్యోగాలు కావొచ్చు, ఇట్లా అనేక కార్యక్రమాలు చేసుకుంటూ పోతూ ఉన్నది. ఈ ప్రభుత్వాన్ని అందరూ దీవించాలి, సహకరించాలి, ఒక సంవత్సరం పూర్తి చేసుకుని నేడు అధికారికంగా రాష్ట్రానికి ఒక గీతాన్ని తెచ్చుకున్నాము. అభినందించాలి. అధికారికంగా తెలంగాణ తల్లి విగ్రహానికి విగ్రహ స్ఫూర్తిని తెచ్చుకున్నాము.

అదే విధంగా గౌరవ ముఖ్యమంత్రిగారు చెప్పినట్లుగా తెలంగాణ కోసం అనేక ఉద్యమాలు చేసి కొంత మంది ప్రాణాలు అర్పించిన వారి సంగతి, అది కూడా నిర్లక్ష్యానికి గురైంది. తెలంగాణకు సంబంధించిన అనేక కళాకారులు వారి జీవితం మొత్తం ధారపోస్తే తినడానికి తిండిలేని వారిని గౌరవించాలనే నిర్ణయం ప్రభుత్వం తీసుకుంటుంది. ఈ విధంగా ముందుకు పోతున్న సందర్భంలో తప్పకుండా మంచిని మంచి, చెడును

చెడు అని అనడానికి, ఈరోజు శాసనసభలోకి వచ్చి మేము కూడా గౌరవ మాజీ ముఖ్యమంత్రిగారు ప్రతిపక్షనాయకులు కలిసి విగ్రహావిష్కరణకు రమ్మని ప్రభుత్వం పక్షాన ఆహ్వానించాము, కేంద్ర మంత్రిగారిని ఆహ్వానించాము, మిగతా గౌరవ పెద్దలందరినీ, ప్రభుత్వ పక్షాన ఆహ్వానించాము. వారందరూ వచ్చి, తెలంగాణకు ముఖ్యమంత్రిగారు చెప్పినట్లుగా రాజకీయాలు వేరు, తెలంగాణ ప్రయోజనాలు దేశంలో చాలా రాష్ట్రాల్లో రాష్ట్రసమస్య వచ్చినప్పుడు అధికార, ప్రతిపక్షం తేడా లేకుండా అందరూ కలిసి ఆ రాష్ట్రప్రయోజనాల కోసం పోరాడుతారు అధ్యక్షా. తెలంగాణలో రాజకీయ పోరాటాలు, ప్రతి విమర్శలు ఒక పక్క ఉంటే, తెలంగాణ ప్రయోజనాలకు సంబంధించి ఈ యొక్క పవిత్ర దినాన తెలంగాణ తల్లి ఆవిష్కరణ సందర్భంగా ఒక వేదిక మీదకి వచ్చి మనమంతా ఒక్కటే తెలంగాణ ప్రయోజనాల కొరకు రాజకీయాలు వేరు, తెలంగాణ అభివృద్ధి వేరు అనేటటువంటి ఒక దిశను కేంద్రానికో లేదా సమాజానికో చూపెట్టే అవసరం ఉందన్న మాటను మనవి చేస్తూ, ప్రభుత్వం, ముఖ్యమంత్రిగారు తీసుకున్న ఈ నిర్ణయం....., ఎందుకంటే తెలంగాణలో అందరం కూడా సకల జనులతోపాటు ఆనాడు తెలంగాణ బిల్లు పాస్ అయిన సందర్భంలో డా. బిఆర్. అంబేద్కర్ గారు ఇచ్చిన ఆర్టికల్–3 కి అనుగుణంగా బిల్లు పాస్ అయిన సందర్భంలో పాత్రదారులుగా కొంత మంది ఉండి లేకుండా మేము దేనికి తెచ్చామనే పరిస్థితి 10 సంవత్సరాలు పార్టీ పుస్తకాలల్లో కూడా ఉద్యమ చరిత్ర తప్పులు తప్పులు రాసిన పరిస్థితి కనపడుతుంది.

11.20 ఉ. అనేక సందర్భాల్లో ఆనాడు ఆంధ్ర పాలకులు తెలంగాణ అంశాన్ని మరుగున పరిచారు. తెలంగాణ కవులు, కళాకారులు, ఉద్యమకారులు అని అన్నారు. ఆనాడు రజాకారుల పోరాటానికి వ్యతిరేకంగా మాట్లాడినటువాళ్ళను మార్చేశారు. ఈనాడు కూడా 10 సంవత్సరాల్లో తెలంగాణకు సంబంధించిన వాస్తవ చరిత్రను మరగున పెట్టే ప్రయత్నం చేశారు. అందుకే ఈ ప్రభుత్వం తెలంగాణ అనలు సిసలైన కళాకారులకు, ఉద్యమకారులకు సంబంధించి, అందరికీ సంబంధించి ప్రాధాన్యత ఉండాలి, భాగస్వామ్యం ఉండాలనే ఆలోచనతో ఈ మార్పులు చేర్పులు తెలంగాణ ప్రజల ఆకాంక్షలతో వ్యక్తిగతమైనటువంటి ఎవరి ఆకాంక్షలు వారివి అధ్యక్షా. యావత్ తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కొనసాగుతుంది. దీనిపై కూడా విమర్శ చేస్తే, వారు ఏ విధంగా కిందికి దిగజారుతున్నారో, వారి ఆకాంక్షలు, వారి ఆలోచనలు ఏమిటో వ్యక్తిగతానికే పరిమితమైతే ఎట్లా? అనే మాటను ఈ సందర్భంగా తెలియజేస్తూ, మరొకసారి విగ్రహ ఆవిష్కరణ సందర్భంగా అందరూ రావాలని ప్రభుత్వ పక్షాన కోరుతూ తెలంగాణ తల్లి విగ్రహానికి సంబంధించి ఏర్పాటు విషయంలో సహకరించిన వారికి ధన్యవాదాలు తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్:- గౌరవ సభ్యులు శ్రీ కూనంనేని సాంబశివ రావు గారూ...

(ఈ సందర్భంగా శ్రీ పాయల్ శంకర్ గారు మరియు శ్రీ పైడి రాకేష్ రెడ్డి గారు మాట్లాడేందుకు అవకాశమివ్వాలని వారి స్థానాల్లో లేచి నిలబడడం జరిగింది.)

అందరూ మాట్లాడేందుకు అవకాశం ఉంది.

శ్రీ కూనంనేని సాంబశివరావు (కొత్తగూడెం):- అధ్యక్షా, నమస్కారం. ఈ రోజు ముందుగా తెలంగాణ ఆవిష్కరణకు ఎంతో త్యాగపూరితమైన పాత్ర నిర్వర్తించి సత్యశీలిగా, అన్నమాటకు కట్టుబాటు దాటనటువంటి ఎన్ని కష్టనష్టాలు వచ్చినా సరే తెలంగాణను ఇస్తానని నిలబెట్టుకున్న ఒక గొప్ప మానవతా మూర్తి, తెలంగాణ అభిమాని, సోనియా గాంధీ గారి జన్మదినపర్వానవారికినా తరఫున, మా భారతీయ కమ్యూనిస్టు పార్టీ తరఫున జన్మదిన శుభాకాంక్షలు ఘనంగా తెలుపుతున్నాను.

శ్రీ పాయల్ శంకర్:- (మైక్ లేకుండా) మా పార్టీకి చెప్పరా?

శ్రీ కూనంనేని సాంబశివరావు:- బీజేపీ అంటే దానికి మళ్లోసారి చెప్తాను. దానికి కొన్ని రిజర్వేషన్లు ఉన్నాయి. Okay Thank you. రెండవది– ఈనాడు తెలంగాణ తల్లి

విగ్రహ ఆష్కరణకు సంబంధించి గతంలో టీఆర్ఎస్, అంటే ఇప్పుడు బీఆర్ఎస్ మిత్రులు వారు కూడా ఉంటే బాగుండేదని నా అభిప్రాయం. కారణం ఏమంటే, మీరనుకున్నట్లుగానే, మీ మనసులో ఉన్నట్లుగానే, మీ భావనకు అనుగుణంగానే అన్ని ఉండవు. ఆ పద్ధతుల్లోనే విగ్రహం ఉండాలని మీరనుకున్న పద్ధతుల్లోనే కవులు, కళాకరులను సత్కరించాలని, మీరనుకున్న పద్ధతుల్లోనే సవ్యంగా జరగాలని అంటే ఇప్పుడున్నది మీ ప్రభుత్వం కాదు. అది మీరు గమనంలో పెట్టుకోవాలి. ఇప్పుడున్నది మారిన ప్రభుత్వం. వీళ్ళకు కూడా కొన్ని లక్ష్యాలు, ఆశయాలు, ఆకాంక్షలు, అభిప్రాయాలుంటాయి. మీరు చేసిన అభిప్రాయాలపట్ల కొంత విరుద్ధమైనటువంటి వైఖరి కూడా ఉండవచ్చు. నేను మనవి చేసేదేమంటే, ఈనాడు మీరు చెబుతున్నారు కదా ఆనాడు తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పనలో మీరు ప్రతిపక్ష పార్టీలని పిలిచారా అని ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ గారిని నేను ప్రశ్నిస్తున్నాను. నాకు తెలిసి రూపకల్పన ఎలా ఉండాలని, దానికి సంబంధించినటువంటి విధివిధానాలు ఎలా ఉండాలి లేకపోతే దానికి సంబంధించిన ఆవిష్కరణలో ఉన్న పలు అంశాలు ఎలా ఉండాలని ఎవరితో కూడా చర్చించిన పరిస్థితి లేదు. మమ్మల్ని అయితే పిలవలేదు. ఇంకా ఎవరినైనా పిలిచారో లేదో నాకు తెలియదు. మమ్మల్ని అని ఎందుకు అంటున్నానంటే, మేము కమ్యూనిస్టు పార్టీగా, ఒక జాతీయ పార్టీ అయి ఉండి కూడా విశాలాంధ్ర కోసం అనేక త్యాగాలు చేసిన పార్టీ అయ్యి ఉండి కూడా తెలంగాణ ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకొని కేంద్రంలో ఉన్నటువంటి భారత కమ్యూనిస్టు పార్టీ ఒక నిర్ణయం చేసింది. ఇక ఆపలేము తెలంగాణ ఆవిష్కరణ కావల్సిందే అని ఎ.బి.బర్ధన్ గారు, లేకపోతే ఇప్పుడున్న డి.రాజా గారు, సురవరం సుధాకర్ రెడ్డి గారు, మా నారాయణ గారు అనేకమంది అనేకపద్ధతులతో నిర్ణయం చేశారు. కనీసం మాకు..., అప్పుడు సోనియా గాంధీ గారు ఒక మాట అన్నారు. మీరందరూ అన్ని పార్టీలు ఏకాభిప్రాయానికి వస్తే, తెలంగాణ మేము ఇస్తామని చెప్పి అన్నారు. అన్ని పార్టీలు ఏకాభిప్రాయానికి రావాలంటే సహజంగా విశాలాంధ్ర కావాలనేటువంటి కమ్యూనిస్టు పార్టీ రాదని కొంతమందికి ఉండేది. కానీ, మేము కోరుకున్నాము. సీపీయం కూడా మేము తటస్థంగా ఉన్నామని అన్నారు. ఆఖరికి టీడీపి వారు కూడా దాన్ని ఏకాభిప్రాయానికి అంగీకరించడం జరిగింది. అందువలన ఆ కమ్యూనిస్టు పార్టీకి సంబంధించినటువంటి మమ్మల్ని కూడా మీరు ఎప్పుడు కూడా గౌరవించింది లేదు, పిలిచింది లేదు. ఇక్కడ మమ్మల్ని గౌరవించలేదనేది పాయింట్ కాదు. కానీ, ఒక రూపకల్పన చేసేటప్పుడు అందరీ అభిప్రాయాల్ని పరిగణనలోకి తీసుకోవలసిన బాధ్యత వారికి ఉందని నేను మనవిచేస్తున్నాను. అదేవిధంగా ఇక్కడ ఒక అంశాన్ని గుర్తుచేయాలి. కోమటి రెడ్డి గారు, జూపల్లి గారు ఇక్కడే కూర్చొని ఉన్నారు. అప్పుడు వీరిద్దరూ మంత్రి పదవులకు రాజీనామా చేశారు. కోమటి రెడ్డి గారు దాదాపు పది, పదకొండు రోజులపాటు నిరహార దీక్ష చేశారు. ఇందులో వీరందరి కృషి ఉంది. అదేవిధంగా నేను కూడా మా పార్టీ ఆదేశానుసారం తెలంగాణ కోసం 7 రోజులు జైలులో ఉండి నిరహార దీక్ష చేశాను. ఏడు వందల కిలోమీటర్లు పాదయాత్ర చేశాను. మా తుమ్మల గారు కూడా నాతోపాటు కాసేపు నడిచారు. అంటే ఇక్కడ ఉన్నవాళ్ళు మన పొన్నం ప్రభాకర్ గారు పార్లమెంట్‌లో మంచి గొప్ప రోల్ ప్లే చేశారు. ఇలా అందరి పాత్ర... ఎవరి పాత్ర వారికుంది. సకలజనుల సమ్మెకు సంబంధించి జయశంకర్ గారు లేకపోతే కోదండరామ్ గారు ఇంకా అనేక మంది త్యాగధనులు అనేక మంది అనేక పద్ధతుల్లో కృషి చేశారు.

మా సింగరేణిలో అప్పుడు మాదే గుర్తింపు సంఘం. మా సింగరేణిలో దాదాపు పనికి వెళ్ళకుండా 45 రోజులు సకల జనుల సమ్మెలో పాల్గొనడం జరిగింది అధ్యక్షా. ఆర్టీసీలో కూడా మేమే గుర్తింపు సంఘం. ఆ విధంగా అందరం కలిసి చేశాము. అందరం కలిసి చేస్తేనే తెలంగాణ సాకారం అయ్యింది. సాకారమవ్వటంలో సోనియా గాంధీ గారు భిన్నాభిప్రాయంతో ఉండి, లేకపోతే కుశ్చితత్వమైనటువంటి ఆలోచన చేస్తే తెలంగాణనే వచ్చేది కాదు. అందువల్ల ఈ సందర్భంగా ఈ ఒక్కరోజు ముఖ్యమంత్రి గారు చెప్పినట్లుగా భేషజాలు, భిన్నాభిప్రాయాలు ప్రక్కన పెట్టి అందరూ ఒక్క త్రాటి మీద ఉంటేనే తెలంగాణ పట్ల, తెలంగాణ తల్లి పట్ల గౌరవం

ఉన్నట్లుగా అర్థం అవుతుందని నేను మనవి చేస్తున్నాను. (ఈ సందర్భంగా సభలో అధికారపక్ష సభ్యులు బల్లలు చరిచారు.) లేకపోతే రాజకీయ కోణంతో తెలంగాణ తల్లిని కూడా వివాదాస్పదం చేస్తే, చరిత్ర మనల్ని క్షమించదని నేను మనవి చేస్తున్నాను.

అదే సందర్భంలో నేను ఇంకొక మాట చెప్పి సెలవు తీసుకుంటాను. ఈ తెలంగాణ ఇప్పుడు జరిగినటువంటి మలిదశ తెలంగాణాలో అనేక మంది విద్యార్థులు, యువకులు ప్రాణ త్యాగాలు చేశారు. అనేక వుందిపై వందల కేసులున్నాయి. మా విద్యార్థి నాయకుడు స్టాలిన్ అనే అబ్బాయి మీద 250 కేసులున్నాయి. మలిదశలో అందరూ త్యాగాలు చేశారు. కేసీఆర్ గారి నాయకత్వాన్ని కోదండరాం గారు కూడా అంగీకరించారు. తప్పేమీ లేదు. అప్పుడున్న పరిస్థితుల్లో అంగీకరించడం జరిగింది. కానీ, దాన్ని చూసి ఇంతమంది త్యాగాలని..... తను ఒక్కరే అనే భావనతో ఎవ్వరున్నా సరే, మహాత్మా గాంధీ కూడా నేను ఒక్కడినే అని చెప్పడు. కానీ, ఆ భావన ఉండకూడదని మనవి చేస్తున్నాను. దీనికంతటికీ మూలం ఆనాడు వీరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం జరిపిన విషయాన్ని కూడా మీకు గుర్తు చేస్తున్నాను అధ్యక్షా. ఆనాడు నాలుగున్నర వేల మంది మరణించారు. అది కూడా నేను గుర్తు చేస్తున్నాను. దానికి పిలుపునిచ్చిన మగ్దుం మొయినుద్దీన్, బద్ధం మల్లారెడ్డి, రావి నారాయణ రెడ్డి ఇటువంటి గొప్ప యోధులు చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య వీరందరూ కూడా కమ్యూనిస్టు యోధులే. వారందరీ పేర్లతోనే మీరు విచారణ చేస్తూ ఉంటారు. వారందరీ త్యాగాలతో ఆనాడు హైదరాబాద్ సంస్థానం నుండి తెలంగాణకు విముక్తి జరిగింది. అ తరువాత అందరి కృషితో... అఫ్‌కోర్స్ మేము లీడర్లము కావచ్చు కానీ, అందరి కృషి ఉంది, అన్ని పార్టీల కృషి ఉంది.

11.30 ఉ. ఆనాడు హైదరాబాద్ నుంచి మన తెలంగాణ విముక్తి చెందింది. మేమే చేశామనే రోల్ కమ్యూనిస్ట్ పార్టీ తీసుకోలేదు కదా. వ్యక్తిగతంగా మేము ఎప్పుడూ తీసుకోలేదు కదా. అలాగే గత ముఖ్యమంత్రి గారికి నేను మనవి చేస్తున్నాను. మీరు(బీఆర్ఎస్ పార్టీ) టిఆర్ఎస్‌ను బీఆర్ఎస్ చేసుకుంటారు. మీరు అనేక మార్పులు చేసుకుంటారు. ఇది వాస్తవంగా మాకే అనిపించింది. తల్లి అంటే ప్రతీక ఎలా ఉంటుంది. ఎప్పుడూ బంగారు నగలు, బంగారపు వడ్డాణాలు వంటివి కాదు కదా. సామాన్యులకు అందుబాటులో ఉంటే రూపమే తల్లి రూపం. హస్తం అంటే వారు అభయ హస్తమంటున్నారు, నేనేమో ఆశీస్సులని అంటున్నాను. ఒక తల్లిగా ఆశీస్సులు ఇస్తున్నారు. అందువల్ల ఆవిధమైనటువంటి అన్ని అంశాలను గమనంలోకి తీసుకొని ప్రతి సంవత్సరం ఈ డిసెంబర్ 9వ తారీఖున తెలంగాణలో గొప్ప పర్వ దినోత్సవంగా జరపాల్సిన బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని కోరుతూ, అదే విధంగా ఆనాటి పోరాటం, ఆనాటి విజయం.. సెప్టెంబర్ 17వ తేదీని కూడా బేషజాలు లేకుండా, బింకాలు, బిడియాలు లేదా మానసికంగా లోపల ఉన్న అన్ని అడ్డంకులను వదిలి వేయండి, దానికి అందరూ అంగీకరిస్తున్నారు, దాన్ని కూడా అధికారికంగా చేయమని తమరి ద్వారా కోరుకుంటూ, తమరికి హృదయపూర్వక నమస్కారాలు.

శ్రీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి (గౌరవ రోడ్లు మరియు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు):- ధన్యవాదాలు అధ్యక్షా. ముందుగా గౌరవ ముఖ్యమంత్రి గారికి ధన్యవాదాలు. మన ప్రియతమ నాయకురాలు మనం తెలంగాణ రాదు అనుకున్న సమయంలో నాలుగు కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ సకల జనుల సమ్మెలతోబాటు అన్ని పార్టీలు కుల, మతాలకతీతంగా ఈసారి తెలంగాణ కావాలని 2009లో ఎమ్మెల్యేలుగా గెలిచిన 41 మందిమి, చిన్నా రెడ్డి గారు, ఇంకా ఇంద్రకరణ్ రెడ్డి గారు మేము 41 మంది శాసనసభ్యులం ప్రతిపక్ష నాయకుడిగా ఆ రోజు ఉన్న రాజశేఖర రెడ్డి గారికి మాకు తెలంగాణ రాష్ట్రం కావాలని చెప్పాము. అప్పుడు వారు ఢిల్లీకి వెళ్ళి సోనియా గాంధీ గారిని ఒప్పించి కోరితే, వారు ప్రణబ్ ముఖర్జీ కమిటి వేస్తే, మలి దశ తెలంగాణ ప్రాసెస్ మొదలైంది. అలా మొదలు పెట్టి డిసెంబర్ 9న తెలంగాణ ప్రకటన రావడం, అదే రోజు మా నాయకురాలు పుట్టిన రోజు కావడంతో గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన తీర్మానానికి, మా సోనియా గాంధీ గారికి, తెలంగాణ దేవతకు నా యొక్క శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ నా మద్దతును తెలుపుతున్నాను.

అధ్యక్షా, ఈ రోజు చరిత్రలో నిలిచిపోయే రోజు. మన అస్థిత్వానికి ప్రతీకైన వ్యవసాయం చేసుకునే తల్లిని, ఈ రోజు తెలంగాణ తల్లి రూపంలో గౌరవించుకునే సందర్భం ఇది. నాలుగు కోట్ల మంది ప్రజల కోరిక తీరి ప్రకటన వచ్చిన రోజు. నాకు తెలంగాణ అంటే ఎక్కడ లేని అభిమానం. ఆరోజు పిల్లలు చనిపోతుంటే ముఖ్యంగా మా నల్గొండ జిల్లా ముద్దు బిడ్డ శ్రీకాంతాచారి ఎల్‌బినగర్ చౌరాస్తాలో 'జై తెలంగాణ' అంటూ కాల్చుకొని, వుంటల్లో అవ్వ అవ్వ అనుకుంటా 'జై తెలంగాణ' అనుకుంటా పోలీస్ వ్యాన్‌లో హాస్పటల్‌కు వెళ్ళి నాలుగు రోజులు మృత్యువుతో పోరాటం చేసి మరణించిన సందర్భంలో, పిల్లలు చావకూడదనే ఒకే ఒక ఉద్దేశంతో మనం కొట్లాడి మన నాయకురాలిని ఒప్పించాలని నేను కూడా మూడు సంవత్సరాలు మంత్రి పదవి వదిలిపెట్టి అమరణ నిరాహార దీక్ష చేయడంతోబాటు మా గౌరవ ఎంపీలు, సొంత పార్టీల ఎంపీలు కూడా పోరాటం చేస్తే వారిని పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేయడం జరిగింది. ఆ తరువాత తెలంగాణ ఏర్పడడం, తెలంగాణ వచ్చిన తరువాత అక్కడ కూర్చొన్న మాజీ ముఖ్యమంత్రి స్వయంగా పద్నాలుగు మంది కుటుంబ సభ్యులతో వెళ్ళి మా నాయకురాలని కలిసి, ఫోటోలు దిగి, తెలంగాణ దేవత అని చెప్పారు. ఇదే అసెంబ్లీలో కుర్చీలో కూర్చొని.. 2014లో మేము అక్కడ కూర్చున్నాం. సరే లక్ష అబద్దాలు చెప్పారా, రెండు లక్షల అబద్దాలు చెప్పారా, ఆ అధికారం వచ్చింది ఇక్కడ కూర్చొన్నారు. మేము మొదటి సభలో అక్కడ కూర్చొన్నాము. ఎవరు ఒప్పుకున్నా ఒప్పుకోక పోయినా సోనియా గాంధీ లేకుంటే ఈ జన్మలో కాదు కదా, మరో జన్మలో కూడా తెలంగాణ వచ్చేది కాదు. ఆమె పుణ్యాన తెలంగాణ వచ్చిందని చెప్పి సభలో అందరి సమక్షంలో వారు(కేసీఆర్) ప్రకటించడం జరిగింది. మేము కూడా సభలో ఉన్నాము. తెలంగాణ ప్రజలు విన్నది మీ రికార్డుల్లో కూడా ఉన్నది. ఈ రోజు అలాంటి సోనియా గాంధీ గారి పుట్టిన రోజుతోబాటు తెలంగాణ అస్థిత్వానికి ప్రతీకలైన ఒక అమ్మ లాంటి తెలంగాణ తల్లిని ఈ రోజు ఆవిష్కరించుకుంటూ పోతున్న సందర్భంలో వాళ్ళు ఆ నాయకుడు కనీసం వచ్చి శుభాకాంక్షలు చెప్పేది పోయి బయట పిచ్చి పిచ్చి వేషాలు చేస్తున్నారు. ఈ రోజు ఎంతో పవిత్రమైన రోజు, తెలంగాణ ప్రకటించిన రోజు. అందుకే అధ్యక్షా, తమరి ద్వారా ఈ రోజు మరొకసారి ప్రతిపక్ష సభ్యులకు బీజేపీ వారు కానీ, సిపిఐ పార్టీ నాయకులకు కూడా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను.

తెలంగాణ వస్తే మన జన్మ ధన్యమైపోయిందిరా, మన జీవితాలు బాగు పడుతాయని అందరం కూడా బంగారు తెలంగాణ కాకపోయినా 'నీళ్ళు, నిధులు, నియామకాలు' వస్తాయని అనుకున్నాము. కానీ పది సంవత్సరాల్లో అవేవి రాలేదు. తెలంగాణ తల్లి విగ్రహం ఉండేది. ఈ విగ్రహం చూసిన తరువాత, తెలంగాణ తల్లంటే ఏ చాకలి ఐలమ్మనో, మన ఇంట్లో చూసే మన అమ్మలాగానో, గ్రామీణ ప్రాంతాల్లో ఉండే మన అవ్వల్లాగాలో ఉంటుందని అనుకున్నాం. కాని వజ్రవైఢూర్యాలతో కూడిన ఆ విగ్రహాన్ని చూసిన తరువాత మా గౌరవ ముఖ్యమంత్రి గారు మేధావులతో చర్చించి ఒక నిర్ణయం తీసుకొని ఈ రోజు మన తల్లిని చూసినట్లే ఉండే లాంటి విగ్రహాన్ని ఆవిష్కరించబోతున్నాము. దాన్ని కూడా అవహేళన చేస్తూ నిన్న ఆ నాయకుని కుమారుడు ఒక టి.వి ఛానెల్‌లో మాట్లాడుతూ.. నక్లెస్‌లు, డైమెండ్‌లు ఉండొదంటా, వాటిని వేసుకపోతారని ..., ఆయన మాటలు..., అధ్యక్ష ఒకటే అడుగుతున్నాను. ఇంతకు ముందు చెప్పాను. అస్థిత్వానికి, గ్రామీణ పరిస్థితులు ఉట్టి పడేలా ఉండాలని ఒక మంచి కార్యక్రమాన్ని మేధావులతో చర్చించి తీసుకుంటే, ఆయన మాట్లాడుతూ..., ఆయన్ను ఒకటే అడగదలచుకున్నాను. అసలు నీ పార్టీలోనే కాదు, ఒక్క కాంగ్రెస్ పార్టీలో తప్ప అసలు ఏ పార్టీలో తెలంగాణ అనే పదమే లేదు. మాది తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి (టిపిసిసి) అంటాము. ఆయన 'టిఆర్ఎస్'ను 'బిఆర్ఎస్' ను చేసుకున్నారు. ఈ రోజు తెలంగాణ సంస్కృతి ఉట్టి పడేలా తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందిస్తే వాళ్ళకు తెలంగాణ గురించి మాట్లాడే హక్కే లేదు. 'టి'ని తీసేసి 'బి'ని పెట్టుకున్నావు. మా పార్టీలో తెలంగాణ పిసిసి ఉన్నది. (టిపిసిసి) అని అంటాము.

మా గౌరవ ముఖ్యమంత్రి గారి ఆదేశం మేరకు ఈ రోజు సాయంత్రం జరిగే ప్రోగ్రామ్‌కు మా అధికారులు మంచి ఏర్పాట్లు చేశారు. లక్షలాది మంది మహిళలు వస్తున్నారు.

మా ఆర్ అండ్ బి శాఖ ద్వారా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాము. పేరు పేరున కోరుతున్నాను, మీ అందరూ రావాలని సవినయంగా కోరుకుంటున్నాను. కొందరి పదవి పోయిందనో, ఏదో రాజ్యం పోయిందనో ఈ రోజు వారు మాట్లాడే మాటలు నమ్మకుండా తెలంగాణ తల్లి విగ్రహా అవిష్కరణకు స్వచ్ఛందంగా అందరూ తరలి రావాలని ఈ సభ ద్వారా తెలంగాణ ప్రజలందరికి విజ్ఞప్తి చేస్తున్నాను.

నిజంగా వచ్చిన తెలంగాణ అప్పుడైతే, ఈ రోజు పది సంవత్సరాల తరువాత అసలు ప్రజా పాలన తెలంగాణ డిసెంబర్ 7, 2023న వచ్చింది. ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటూ ఈ రోజు సెక్రటేరియట్‌లో వేలాది మంది కనబడుతున్నారు. ఒక సంవత్సరం క్రింద నాలాంటి ఎంపీలకు సెక్రటేరియట్‌లో పాస్ అడిగితే కూడా ఇవ్వలేదు. ఇవాళ సామాన్యులు వేల మంది అక్కడ తిరుగుతున్నారు. అందుకే తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు రావాల్సిందిగా తమరి ద్వారా కోరుకుంటున్నాను. ఈ రోజు బీఆర్ఎస్ పార్టీ నాయకులకు, తెలంగాణకు ఎప్పుడో బంధం తెగిపోయింది. మీరు 'టి' తీసేసి 'బి' పెట్టుకున్నప్పుడే మీకు విగ్రహం గురించి కానీ, దేని గురించి కానీ మాట్లాడే హక్కు లేదు. అందుకే మీ నాటకాలు ఆపి పెట్టి రండి. గౌరవ ప్రతిపక్ష నాయకులకు చెబుతున్నాను. ఇక్కడ కూర్చొని దేవత అని అన్నావు, పద్నాలుగు మంది కుటుంబ సభ్యులందరూ పోయి కాళ్ళు మొక్కివచ్చారు. నువ్వు లేకుంటే తెలంగాణ వచ్చేదే కాదు తల్లీ అని అన్నావు. ఇవాళ ఏమి మార్పు వచ్చింది? ఇచ్చిన రుణం తీర్చుకోకుంటే, కనీసం నువ్వు ఆమె పుట్టిన రోజున కూడా శుభాకాంక్షలు చెప్పలేదంటే తెలంగాణ మర్యాద ఇదేనా? తెలంగాణలో ఎవరైనా ఇంటికి వస్తే కాళ్ళు కడుక్కోవడానికి నీళ్ళిచ్చి, మర్యాద చేసి, వారికి అన్నం పెట్టే మర్యాద తెలంగాణ ప్రజలది. తెలంగాణ ఇస్తే పది సంవత్సరాలు అధికారం అనుభవించి కనీసం శుభాకాంక్షలు చెప్పలేదంటే నీ జ్ఞానం ఎక్కడికి పోయింది? ఎనభై వేల పుస్తకాలు ఎక్కడికి పోయాయి? మీ పిల్లలకి నేర్పించు, ఆ పిల్లలు టీ-షర్టులు వేసుకొని రోడ్ల మీద లొల్లి పెడుతున్నారు.

11.40 ఉ. అందుకే అధ్యక్షా, మీ ద్వారా తెలంగాణ ప్రజలందరికీ మరొకసారి తెలియజేస్తున్నాను. నిజంగా పదకొండు వందల మంది పిల్లలు.. వారి తల్లితండ్రులు ఇప్పటికి కూడా ఏడుస్తున్నారు. ఉద్యమ సందర్భంలో మరణించిన పిల్లల ఆత్మలు..... డిసెంబరు 7, 2023నాడు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున ఆరోజే నిజమైన తెలంగాణ వచ్చిందని..... వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

డా. పాల్వాయి హరీష్ బాబు(సిర్పూర్):- తెలంగాణ ప్రజల తల్లి విగ్రహ రూపకల్పనపై శాసనసభలో ముఖ్యమంత్రిగారి ప్రకటనపై చర్చకు అవకాశమిచ్చిన గౌరవ అధ్యక్షుల వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ముందుగా మహాకవి దాశరథిగారు అన్నట్లు నా తెలంగాణ కోటి రతనాల వీణ... ఆరోజు కోటి మంది తెలంగాణ ప్రజలే ఉండేది. ఇప్పుడు నాలుగు కోట్ల వంది ప్రజలు ఉన్నారు కానీ కొన్ని సమస్యలున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో కొన్ని వెనుకబడిన ప్రాంతాలు ఈ ప్రభుత్వ హయాంలో కొంత వివక్షకు గురయ్యాయని చెప్పదల్చుకున్నాను, కానీ దాని గురించి తరువాత చెబుతాను. మన సంస్కృతికి అద్దం పడుతూ ప్రశాంతవదనాలతో, మెడకు కంఠె, గుండుపూసల హారంతో, చెవులకు బుట్టకమ్మలతో, ముక్కుపుడకతో తెలంగాణ తల్లి తయారైందని చెప్పుకుంటున్నారు. నేను ఏమంటున్నానంటే మీ కాంగ్రెస్ ప్రభుత్వం చాలా హామీలు ఇచ్చింది. కళ్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చారు. ఒకవేళ ....

(అధికార పార్టీ సభ్యుల నుండి అంతరాయం)

సరే మీకు అది ఇష్టం లేదు ఆ విషయాన్ని పక్కనపెడుదాం, I don't want to yield, దాంట్లోకి పోదలచుకోలేదు... మేము ఏం ఆశించామంటే గత పది సంవతవత్సరాలలో టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రం చిన్నాభిన్నమైనది, ఆర్థికంగా విధ్వంసానికి గురైందనేది అందరం ఒప్పుకోవాల్సిన విషయమే కదా? కానీ ఈ సంవత్సర

కాలంలో ప్రక్షాళన జరుగుతది, రిపేరు జరుగుతది, ఓవరాల్‌గా జరుగుతదని ఆశించాము కానీ అటువంటి చూచాయలు కుడా కనపడడం లేదు. కాబట్టి తప్పకుండా ఈ విషయంలో మీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడే ఆగిపోకుండా కనీసం మీ ప్రభుత్వం ఇచ్చిన హామీలకు కట్టుబడి, ప్రక్షాళన దిశగా ముందుకు పోవాలని నిండు మనసుతో కోరుకుంటున్నాను.

ఇంకొక విషయం అధ్యక్షా, ఈ రోజు శ్రీమతి సోనియాగాంధీ గారి జన్మదినం కాబట్టి డిసెంబర్ 9 నాడు తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. మా కమ్యూనిస్టు సోదరులు చెప్పినట్లుగా సెప్టెంబరు 17నాడు తెలంగాణ విమోచనం జరిగింది. మరి ఆరోజు విమోచన దినోత్సవాన్ని ఎందుకు జరుపుకోవడం లేదు? ఎందుకు మిమ్మల్ని కొన్ని శక్తులు అడ్డుకుంటున్నాయనేది మీ ప్రభుత్వం ఆలోచన చేయాలి. నిజాం ప్రభుత్వం మెడలు వంచి మీ నల్లగొండ జిల్లా నుంచే పెద్దఎత్తున సాయుధ రైతాంగ పోరాటం మొదలైంది. కాబట్టి వారికి సంఘీభావం తెలుపుతూ సెప్టెంబరు, 17ను తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ నేను ఒక్కనిమిషంలో ముగిస్తాను.

గతంలో భారతమాతను సృష్టించిన కళాకారులు పశ్చిమబెంగాలుకు చెందినవారు. ఆరోజు భారతమాతకు కిరీటం లేదు, కంఠె లేదు, హారం లేదు, ఆమె చేతిలో ఒక జపమాల ఉండేది, ఒక చేతిలో కలశం/చెంబు ఉండేది. ఆ తరువాత నెహ్రూ గారి ఆధ్వర్యంలో పెద్దఎత్తున కాంగ్రెస్‌పార్టీ ప్లీనరీ సమావేశాలలో కొత్త భారతమాత విగ్రహానికి రూపకల్పన చేశారు, ఆ విగ్రహానికి కిరీటం, హారాలు, ఒక త్రివర్ణ జెండా కూడా చేతిలో ఉండేది. ఆరోజు ఆవిధంగా ఆలోచన చేస్తే ఈ రోజు అంతా ఉల్టా ఆలోచన చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని టీ.ఎస్ నుండి టి.జి.కి మార్చారు, తెలంగాణ విగ్రహాన్ని మారుస్తున్నారు. అంటే కేవలం పేర్లు మార్చడం వల్ల, విగ్రహాలు మార్చడం వల్ల మన రాష్ట్రం ముందుకు పోతుందని అనుకుంటే మనం తప్పులు చేసినవారమవుతాము. కాబట్టి మీ ప్రభుత్వం నిజంగా ప్రక్షాళన చేయాలనుకుంటే ఈ తెలంగాణ నాలుగుకోట్ల మంది ప్రజల బతుకులు బాగుపరిచే ఏర్పాటు చేయండి.

శ్రీ పొన్నం ప్రభాకర్:- అధ్యక్షా, విగ్రహం అనేది అధికారికంగా గతంలో లేదు కాబట్టి విగ్రహాన్ని మార్చారు మార్చారు అని పదే పదే మాట్లాడి తప్పుడు ప్రచారం చేయవద్దని గౌరవ సభ్యులను కోరుతున్నాను. నూతనంగా తెలంగాణ పక్షాన అధికారికంగా శాసనసభ ద్వారా తెలంగాణ సచివాలయంలో ఏర్పాటు చేస్తున్న విగ్రహం ఇది. ఆరోజు తెలంగాణ ఉద్యమంలో మీరు మాట్లాడేటప్పుడు ఏమి మాట్లాడాలంటే టి.జి అని గుండెలలో ఉంటే మీరు టీ.ఎస్ అని రాసుకుంటే తప్పు. మీరు మార్చడం సక్రమమేనని మీ బీజేపి ప్రభుత్వం వారు ఆరోజే ప్రశంసించారు. అలాంటి మీరే మళ్లీ మార్చామని అంటున్నారు. తెలంగాణ గీతం లేదు, విగ్రహం లేదు, తెలంగాణ ప్రజల ఆకాంక్ష టి.జిగా ఉన్న దానిని టీ.ఎస్‌గా మార్చుకున్నారు. దాని గురించి మీరు మళ్లీ ఏం మాట్లాడుతున్నారనేది అర్థం కావడం లేదు. జనరల్‌గా మీ రెండు పార్టీలు ఒక్కటేనని తెలుసు గనుక కనీసం ఇప్పుడైనా వాస్తవాలు మాట్లాడే ప్రయత్నం చేయండి.

డా. పాల్వాయి హరీష్ బాబు:- మిమ్మల్ని అప్రిషియేట్ చేస్తున్నాము, కేవలం ఒక్క సంవత్సర కాలంలో మీరు చేసిన తప్పొప్పులను సరిచేసుకోకపోగా ప్రజలకు మీరు చెప్పిన విషయాలను ....

(అంతరాయం)

మిస్టర్ స్పీకర్ :- దయచేసి మీరు డీవియేట్ కాకుండా ముఖ్యమంత్రి గారి ప్రకటనపై మాట్లాడండి.

డా. పాల్వాయి హరీష్‌బాబు:- డీవియేషన్ అన్నారు నేను ఒప్పుకున్నాను. మీరన్నట్టుగా డీవియేట్ కాలేదు, నేను గ్రౌండ్ రియాలిటీ నుండి రెండు విషయాలు చెప్పదల్చుకున్నాను. తెలంగాణ రాష్ట్ర నాలుగు కోట్ల మంది ప్రజలు ఈ సంవత్సర కాలం పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత తీవ్ర నిరాశలతో ఉన్నారు. వారిని ఆదుకునే ప్రయత్నం మనం తప్పకుండా చేయాలి. తెలంగాణ తల్లి విగ్రహ

ఆవిష్కరణకు మమ్మల్ని పిలిచారు. తెలంగాణ తల్లి రూపకల్పనకు కూడా ..... ఉత్తమ్ కుమార్‌రెడ్డి గారు ఇదే సభలో ఉన్నారు, వారు ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్ పాలసీ తీసుకువచ్చే ప్రయత్నంలో మమ్మలందరిని, అఖిలపక్షాన్ని కూడా పిలిచారు, ఉత్తర ప్రత్యుత్తరములు నడిపారు. వారి కార్యాలయం నుండి చాలా ఫోన్లు కూడా వచ్చాయి. అదే ఒరవడిలో మాకు కొంత సమాచారం ఇచ్చి, మా సూచనలు, సలహాలు తీసుకుంటే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటుచేస్తే ఈ విషయంలో మేము కూడా చొరవ తీసుకునేవారము. కానీ మాపైన, తెలంగాణ సమాజంపైన మొత్తం రుద్దే ప్రయత్నం చేస్తున్నారు, అది కొంత ఆక్షేపణీయమని తెలియజేస్తూ డిసెంబరు 9 నాడు మీ కాంగ్రెస్ పార్టీ నాయకురాలి జన్మదినం, దాన్ని కూడా అవతరణ దినోత్సవమని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. పార్టీకి సంబంధించిన విగ్రహం గతంలో ఉండేదని మంత్రిగారు చెప్పారు. ప్రభుత్వం మారినప్పుడల్లా విగ్రహాలు మార్చుకుంటూ పోతే, పేర్లు మార్చుకుంటూపోతే ఎక్కడికి పోతాము? కాబట్టి ఒకసారి ఆలోచన చేయాలి, ప్రజాధనం.....

శ్రీ డి.శ్రీధర్ బాబు:- మా సోదరులు బీజేపికి సంబంధించిన గౌరవ శాసనసభ్యులు ప్రొడక్టివ్‌గా, కన్‌స్ట్రక్టివ్‌గా సలహాలు ఇచ్చే మిత్రులు. రెండుమూడు విషయాలు మాట్లాడుతారని అనుకున్నాను. ఈరోజు మా సహచరులు పాన్నం ప్రభాకర్ గారు అధికారికంగా అసలు విగ్రహ రూపకల్పన ప్రభుత్వపరంగా ఎప్పుడూ చేయలేదని చెప్పారు. మొట్ట మొదటిసారి పది సంవత్సరాల రూపకల్పన జరుగుతుంది, దానిలో ముఖ్యమంత్రిగారు స్టేట్‌మెంట్ ఇవ్వడం జరిగింది, స్టేట్‌మెంట్‌కు సంబంధించి ప్రస్తావన ప్రత్యేకంగా ఒక ప్రధానమైన అంశం కనుక మీరు అవకాశం ఇచ్చారు. ఈ రోజు వారు ప్రభుత్వానికి సంబంధించిన మంచి చెడులు, వైఫల్యాలు, విజయాల గురించి తప్పకుండా సమావేశాలు నిర్వహించి మీరు చెప్పే ప్రతి మాటకు పది సమాధానాలిస్తాం తప్ప వెనుకకు పోయేదే లేదు.

ఈరోజు కూడా మేము చెబుతున్నదేమంటే రాజకీయాలకు అతీతంగా భేషజాలకు పోకుండా ప్రధానంగా మెజార్టీ సంఖ్యలో మా పార్టీ గౌరవ శాసనసభ్యులున్నారు. మెజారీటికి సంబంధించిన అంశం విషయం కూడా మాట్లాడడం లేదు. ప్రస్తావన విషయంలో కొన్ని అంశాలు చెబుతున్నప్పుడు మేము స్వీకరించడానికి ఇక్కడ కూర్చున్న సందర్భంలో అదే అదనుగా అనేక అంశాలు మాట్లాడుతున్నారు. శ్రీమతి సోనియాగాంధీ గారు లేకుంటే మనకు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం వచ్చేదా? ఇదే కాదు, యావత్ తెలంగాణ ప్రజానీకానికి సంబంధించి తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ చేస్తున్న సందర్భంలో నేను చెబుతున్నదేమంటే మేము ఈరోజు విమర్శలు చేయదల్చుకోలేదు. దయచేసి ఈ రోజు భేషజాలకు పోకుండా మేము ఒక పాజిటివ్ ఎన్విరాన్‌మెంట్‌లో తెలంగాణ రాష్ట్రప్రజలకు సంబంధించిన విగ్రహ రూపకల్పనపై మేము సిపిఐ పార్టీకి సంబంధించిన గౌరవ సభ్యుల అంశం గానీ, బీజేపీకి చెందిన గౌరవ సభ్యులకు సంబంధించిన అంశం విషయంలో వారి ప్రస్తావన విన్నాము.

11.50 ఉ. చాలా సందర్భాలల్లో ఏదైనా ప్రస్తావించినప్పుడు డాక్టర్ గారు మంచి సలహాలు, సూచనలు, ఇస్తారు. కానీ, వారు ఎందుకో డీవియేట్ అయ్యారు, వారిని డీవియేట్ కావద్దని కోరుతున్నాను. ఎందుకంటే వారు మొదటిసారి శాసనసభ్యులుగా ఎన్నికయ్యారు. మన సంస్కృతిని ప్రతిబింబించే విధంగా తెలంగాణ జాతికి సంబంధించిన అంశాన్ని, చరిత్రలో నిలిచిపోయే ఈ అంశంపై వారు కూడా ప్రస్తావన చేయాలి, వారి ఆలోచన కూడా ఈ సభా రికార్డుల్లో ఉండాలి, ఈ రాష్ట్ర ప్రజలందరు కూడా వినాలనే ఉద్దేశంతో మీరు పెద్ద హృదయంతో వారికి మాట్లాడే అవకాశం ఇచ్చారు, కాదనటం లేదు.

కాబట్టి, వారు భేషజాలకు వెళ్లొద్దనీ తెలియజేస్తున్నాము. ఈరోజు మేము అభయమిస్తున్నాము. అధ్యక్షా, మేము అధికారపక్షంలో ఉన్నాం, సభా సమావేశాలు జరుగుతున్నాయి. వారు అడిగే ప్రతి ప్రశ్నకి గానీ, షార్ట్ డిస్కషన్‌లో గానీ, ఇతర రూపాల్లో వస్తే మా సహచర మంత్రివర్గ సోదరులతోపాటు ఖచ్చితంగా మేము సమాధానం చెప్పడం జరుగుతుంది. కాబట్టి, వారు ఓపికతో ఉండాలని కోరుతున్నాను. చాలామంది సభ్యులు ఈ ప్రస్తావనలో పాల్గొనాలని ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. దయచేసి వారికి

కూడా అవకాశం ఇవ్వాలని శాసన సభాపతి గారిని కోరుతున్నాను.

డా. రాంచందర్ నాయక్ :- ధన్యవాదాలు అధ్యక్షా, ముందుగా...

(బిజెపి సభ్యుల నుండి అంతరాయం)

మిస్టర్ స్పీకర్:- పాయల్ శంకర్ గారు కూర్చోండి.

డా. జాటోత్ రాంచందర్‌నాయక్ (డోర్నకల్):- త్యాగాల కుటుంబమైన గాంధీ కుటుంబం వారసురాలిగా, ఒక త్యాగమూర్తిగా, తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియాగాంధీ గారికి ముందుగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. తెలంగాణ సాయుధ పోరాటం తరువాత, అంతే పోరాట పటిమతో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం యావత్తు తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా యువత, ఇంకా అన్ని సామాజిక వర్గాలు, బడుగు-బలహీన వర్గాలకు సంబంధించిన వారిలో ఎందరో ప్రాణ త్యాగాలు చేశారు. దానికి చలించిన సోనియాగాంధీ గారు, సుష్మాస్వరాజ్ గారు కూడా తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని చెప్పిన మాట వాస్తవం, ఇది చరిత్ర. ఆ తరువాత సాధించుకున్న తెలంగాణలో మన తెలంగాణ రాష్ట్రయాన, భాష, రాజకీయ సంస్కృతి అన్నింటినీ దెబ్బతీసే విధంగా గత ప్రభుత్వం పది సంవత్సరాలుగా కుట్ర చేసింది. ఒక రాచరిక కుటుంబం పాలనను తలపించే విధంగా, ఒక నియంత నిరంకుశ పాలనను తలపించే విధంగా పది సంవత్సరాలు ప్రజల్ని దోపిడీ చేశారు. తెలంగాణ ఉద్యమంలో చనిపోయిన కుటుంబాలని విస్మరించారు. ముఖ్యంగా మా గిరిజన సోదరులు భోజ్యా నాయక్ గారు పరుగెడుతున్న రైలుకు ఎదురొడ్డి ప్రాణాలని కోల్పోయారు. నా నియోజకవర్గంలోని నవీన్ నాయక్ గారు పట్టాల మీద తలకాయ పెట్టి ప్రాణాలని కోల్పోయారు. అలాంటి కుటుంబాలని ఆదుకున్న క్షణాల్ని గత పది సంవత్సరాల్లో ఎక్కడా చూడలేదు. ఆరోజు పార్టీపరంగా తెలుగు తల్లిని తెలంగాణ తల్లి అని వారు ప్రకటించుకున్నారు తప్ప, అధికారికంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టించిన పరిస్థితిని మనం తెలంగాణ రాష్ట్రంలో చూడలేదు. ఆ తరువాత తెలంగాణ పోరాట చరిత్రను మార్చే విధంగా, కేవలం వారి కుటుంబమే తెలంగాణను సాధించిందనే ఒక సందేశాన్ని చేరవేయాలనే కుట్రలో భాగంగానే కేసీఆర్ కుటుంబం గత పది సంవత్సరాల వారి పాలనా ధోరణిని మనం చూశాం.

నిరుపేద రైతు కుటుంబం నుండి జన్మించిన మన ముఖ్యమంత్రి గారు తెలంగాణ యావత్ ప్రజానీకానికి గిరిజన, దళిత, బీసీ, బడుగు బలహీన వర్గాల మాతృమూర్తుల్ని తలపించే విధంగా ఒక సాధారణ మాతృమూర్తి లాగా తెలంగాణ తల్లిని ఏర్పాటు చేయాలని సంకల్పించడం జరిగింది. స్త్రీ సృష్టికి మూలం. స్త్రీ లేనిదే సృష్టే లేదని చెప్పి మనందరికీ తెలుసు. ఆ స్త్రీని ఈరోజు తెలంగాణలో గౌరవించుకోవాలి. ముఖ్యంగా గత పది సంవత్సరాల నుండి వివిధ వ్యసనాలతో చెడుదారిన పడుతున్న యువతను కాపాడుకోవాలని కోరుతూ, మాతృ మూర్తిని తలపించే విధంగా తెలంగాణ తల్లిని ఆవిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని తెలియజేస్తున్నాను.

తెలంగాణ విద్యార్థుల్లో, ప్రజల్లో ఒక పోరాట పటిమ లోపిస్తోంది. తెలంగాణ ఖ్యాతిని మరిపించే విధంగా ప్రొఫెసర్ జయశంకర్ లాంటివారు, విద్యాసాగర్ లాంటివారు, ప్రొఫెసర్ కోదండరాం లాంటి వాళ్లు, మా సీతారాం నాయక్ లాంటి వాళ్లని మరిపించే విధంగా, కేవలం కెసిఆర్, కెసిఆర్ కుటుంబమే తెలంగాణను సాధించిందనే కుట్రను వారు చేస్తున్నారు. తెలంగాణ ప్రజల మనోభావాలని గౌరవించే విధంగా ఒక రాష్ట్రీయ గీతాన్ని ఈరోజు ప్రజల్లో చాలా స్ఫూర్తిదాయకంగా ముందుకు తీసుకువెళ్లడం జరుగుతోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి గారికి మనం అభినందనలు తెలియజేయాలి. పోరాట స్ఫూర్తిని తెలంగాణ ప్రజల్లో నింపడమే కాకుండా ప్రజల ఆకాంక్షలని నెరవేర్చే విధంగా పాలనను కూడా గత సంవత్సరంలో మనం ప్రజలకి అన్ని ఫలాలను అందించే దాంట్లో విజయవంతం అయ్యాం. మరోసారి ప్రజల్ని మోసం చేసే దాంట్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ముఖ్యంగా కెసిఆర్ కుటుంబ సభ్యులు వక్రీకరిస్తున్న ప్రతిదాన్నీ మనం ఆహ్వానించడం కరెక్ట్ కాదని తెలియజేస్తున్నాను. ముఖ్యంగా వారు ఈరోజు సభకు రావాల్సింది. మాజీ ముఖ్యమంత్రిగా వారు వారి సలహాలు, సూచనలు ఇచ్చి ఉంటే సభ కూడా

సంతోషించేది. ఏది ఏమైనా గానీ, ఇది ఒక మహత్తరమైన కార్యక్రమం. సాయంత్రమైనా విగ్రహ ఆవిష్కరణకు అందరు రావాలని కోరుకొంటూ ఈ అవకాశం ఇచ్చిన మీకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

శ్రీ పైడి రాకేష్ రెడ్డి (ఆర్మూర్):- అధ్యక్షా, గౌరవనీయులైన శ్రీమతి సోనియా గాంధీ గారికినా తరపున మరియు మా బీజెపి పార్టీ తరపున జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

2014 జూన్ 2న రాష్ట్రం మిగులు బడ్జెట్‌లో ఉన్నప్పుడు ఆ విగ్రహం ఉండేది. ఇప్పుడు అప్పులపాలైన తెలంగాణలాగా ఈ విగ్రహం ఉందని తెలంగాణ ప్రజలు అంటున్నారు. ముఖ్యంగా తెలంగాణ ప్రజల రాతలు మార్చాలి గానీ, తెలంగాణ తల్లులను మారుస్తూ...

(అధికార పక్ష సభ్యుల నుండి అంతరాయం)

ఒక్క నిమిషం ఆగండి. ఇలా మళ్లీ వచ్చే ప్రభుత్వం మళ్లీ, మళ్లీ మారుస్తానంటే ఈ మార్పుల వల్ల రాను, రాను తెలంగాణ ప్రజలమీద గుదిబండ పడుతుంది. నిన్న ఒకరు, ఈరోజు ఒకరు, రేపు ఒకరు.. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహంలో ఒకటే ఒక లోపం ఉంది. అది ప్రభుత్వం సరిదిద్దుకుంటే సరిదిద్దుకోవచ్చు, లేకపోతే లేదు. ఇప్పుడు ఆవిష్కరించబోతున్న తెలంగాణ తల్లి విగ్రహంలో హస్తం పెట్టడం వల్ల, ఆ విగ్రహాన్ని కాంగ్రెస్ తల్లి అంటున్నారని నేను బహిరంగంగానే చెబుతున్నాను, వాళ్లు చెప్పడం లేదు.

(మంత్రివర్యులు శ్రీమతి దనసరి అనసూయ మరియు ఇతర మంత్రులు, కాంగ్రెస్ పార్టీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు)

అధ్యక్షా, ఈ కార్డు(శాసనసభ్యుడి ఐడెంటిటీ కార్డును చూపిస్తూ)ను తెలంగాణ శాసనసభ కార్యాలయం ఇచ్చిందా? లేదా నాకు. నేను శాసనసభ్యుడినా? కాదా? ఆర్మూర్ ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధినా? కాదా నేను.

(కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యుల నుండి అంతరాయం)

అధ్యక్షా, మీరంటే, మంత్రి వర్యులంటే, తోటి శాసనసభ్యులంటే నాకు గౌరవం. కానీ, వాళ్లు మమ్మల్ని గౌరవించనప్పుడు మేమెట్ల గౌరవించాలి? అధ్యక్షా, దక్షిణ తెలంగాణ నీళ్లు, నిధులు అన్నీ దోచుకుపోతున్నారు. అభివృద్ధి లేదు, అధికారం లేదు. అవమానం. మేము ఇక్కడ ఉండడం ఇంకెందుకు అధ్యక్షా? కేవలం జీతాలు తీసుకునేందుకా అధ్యక్షా.

12.00 మ. అధ్యక్షా, మీరు కన్న తండ్రి ఈ శాసనసభకు.. వాళ్ళయితే బయట... ప్రభుత్వంలో.., ఇదిగో మా సీతక్క గారు, గౌరవనీయ మంత్రిగారు.., సమసమాజం అనిచెప్పి ఉద్యమంలోకెళ్లొచ్చి, ఈరోజు శాసనవ్యవస్థలో మంత్రైన అక్క, మాకు 5 కోట్ల ముంత, కాంగ్రెసోళ్ళకు బిందెలు... ఏమక్కా? సమసమాజమన్నవు గద అక్కా? ఎటుబోయిందక్కా?

(అధికారపక్ష సభ్యులచే అభ్యంతరాలు)

ఒక్క నిమిషమాగండి. నేను ఇది రుజువులతో చెప్తున్నా అధ్యక్షా. అడుగడుగునా అవమానాలపాలు చేస్తున్నారు. అభివృద్ధి లేదు, అధికారం లేదు, ఉల్టా అవమానం. ప్రతి అధికార వ్యవస్థనీ ప్రలోభపెడుతున్నారు... (మైక్ కట్)

మిస్టర్ స్పీకర్:- ఎల్.ఏ. మినిస్టర్ గారూ...

శ్రీ పైడి రాకేష్ రెడ్డి:- (మైకు లేకుండా) మేము మాట్లాడేదేమైనా తప్పైతే..

శ్రీ డి. శ్రీధర్ బాబు:- నో, నో... అధ్యక్షా, ఇక్కడ తప్పూ ఒప్పుల గురించి కాదు. గౌరవ శాసనసభ్యులు వారి ఆవేదనను చెప్పడం జరిగింది. నేను మీద్వారా వారిని కోరుతున్నాను. Definitely మీకు ఆవేదన ఉంది. కానీ, స్పీకర్ గారికి ఈ విధంగా... Don't attribute. It will be attributing to the Respected Chair. Please, let us try to constrain ourselves. అధ్యక్షా రెండవది, వారి ఆవేదనకు సంబంధించిన అంశం, ప్రతీ ఒక్కటీ కూడా ఒక రోజు మీరు సమావేశానికి పిలవండి అధ్యక్షా, వారికి సంబంధించిన అంశాలేవైతే ఉన్నాయో..., మేమూ వస్తాం. తప్పకుండా వారికి సంబంధించిన అంశాలను మేము

ప్రస్తావనకు తీసుకుంటాం. మీరు పిలవండి అధ్యక్షా, రేపో, ఎల్లుండో... ఎందుకంటే ఇప్పుడు ప్రత్యేకమైన అంశం ప్రస్తావన జరుగుతోంది. గౌరవ సభ్యులు....

(బీజేపీ సభ్యులచే అంతరాయం)

నేను అప్పీల్ చేస్తూ ఉన్నా..., నేను అప్పీల్ చేస్తూ ఉన్నా...

(బీజేపీ సభ్యులచే అంతరాయం)

Definitely... ఇక్కడ (శాసన వ్యవహారాల శాఖ మంత్రిగారికి కేటాయించిన సీట్లో) కూర్చున్నా ప్రోటోకాల్ వయొలేషన్ అవుతుంది. హౌస్‌కు సంబంధించి.. బెదిరిస్తే బెదిరే కార్యక్రమాలు కావ అధ్యక్షా. నేను దయచేసి మీద్వారా గౌరవ సభ్యులను కోరుతున్నాను. నేను మిమ్ములను కోరుతున్నా... అధ్యక్షా, మీరు ప్రత్యేకంగా ఆ గౌరవ సభ్యులను పిలవండి అధ్యక్షా, ఎక్కడ ప్రోటోకాల్ ఉల్లంఘనలు జరిగినాయో, ఆ ప్రోటోకాల్ ఉల్లంఘనలకు సంబంధించిన అంశం విషయంలో మేము అధికారులకి కూడా మేము తెలియజేయడం జరుగుతుంది. ఆదేశాలు కూడా ఇవ్వడం జరుగుతుంది. మేము స్పష్టంగా చెప్పాం. నేను గౌరవ సభ్యులని కోరుతున్నాను, దయచేసి ఈరోజు ఈ విగ్రహావిష్కరణకు సంబంధించిన అంశం విషయంలోనే ఒక ప్రత్యేకమైన ప్రస్తావన జరుగుతోంది. దానికి సంబంధించి...

(బీజేపీ సభ్యులచే అంతరాయం)

మీ ఆవేదనకు సంబంధించి గౌరవ శాసనసభాపతి గారిని మేము కూడా కోరుతున్నాం.

(శాసనసభలో ప్రోటోకాల్ ఉల్లంఘనలపై చర్చించాలంటూ బీజేపీ సభ్యులచే అంతరాయం)

అధ్యక్షా, అనేక సందర్భాలలో చూశాం. మేము కూడా అనేక సందర్భాలలో అనుభవించాం. మాకు కూడా తెలుసు. ఒకసారో, రెండు సార్లో... ఇక్కడ కూర్చున్న అనేకమంది శాసనసభ్యులు... చాలా సందర్భాల్లో... ఇక్కడ కూర్చున్నాం, అక్కడ కూర్చున్నాం, ఇక్కడికొచ్చాం.. ఈరోజు వారి ఆవేదనని అర్థం చేసుకునే పరిస్థితుల్లో ఉన్నాం గనుకనే ప్రత్యేకంగా సమావేశమయ్యేందుకు పిలవాలని ఈరోజు స్పీకర్ గారిని కోరుతున్నాము. స్పీకర్ గారూ, మీరు మీ ఛాంబర్‌లో... గౌరవ సభ్యులు ఎవరికైతే, ఎక్కడైతే... ప్రోటోకాల్ ఉల్లంఘన జరుగుతోందో ఆ ఉల్లంఘనకు సంబంధించిన అంశం విషయంలో మీరు ప్రస్తావన చేయండి. ప్రభుత్వపరంగా మేము తప్పకుండా దానిని సరిదిద్దుకునే అవకాశం తీసుకుంటాము.

ఈరోజు మేము చెప్తున్నాం. పాపం, కొత్తగా వచ్చిన శాసనసభ్యులు వారు. అనేక సందర్భాలలో మీరూ చూశారు. అటున్నాం, ఇటున్నాం. మేము కూడా ఆవేదన చెందాం. కానీ, సభా సాంప్రదాయాలకు అనుగుణంగానే నడిచాం. ఎక్కడా కూడా ఇబ్బంది లేదు. నేను గౌరవ శాసనసభ్యులని కోరుతున్నాను. ఇదొక ప్రత్యేకమైన ప్రస్తావన. ప్రత్యేకమైన అంశంపైన స్టేట్‌మెంట్‌కు సంబంధించి, ఈరోజు మీరు అనుమతించడంతో.. ఆ స్టేట్‌మెంట్‌కు సంబంధించిన అంశాలను ప్రస్తావన చేయడానికి మీరు అవకాశమిచ్చారు. వేరే ఇతర అంశాల విషయంలో మీరు సమయమియ్యండి అధ్యక్షా, తప్పకుండా... వారికి సంబంధించి వారి ప్రోటోకాల్, వారి ప్రివిలేజెస్‌ని కాపాడే ప్రయత్నంలో మీరు ఏ ఆదేశమిస్తే, ఆ ఆదేశాన్ని ప్రభుత్వపరంగా ముందుకు తీసుకెళ్ళడం జరుగుతుంది.

(అంతరాయం)

మిస్టర్ స్పీకర్:- వెంకటరమణా రెడ్డి గారూ, సభను సజావుగా నడిపించవలసిన బాధ్యత మీ అందరి మీదా ఉన్నది. దయచేసి...

శ్రీ కాటిపల్లి వెంకటరమణారెడ్డి (కామారెడ్డి):- (మైకు లేకుండా) మంత్రి గారూ, మేము ఛాంబర్స్‌కి వచ్చేది లేదు. అధ్యక్షా, ఆల్రెడీ ప్రివిలేజెస్ కమిటీకి పిటిషన్ ఇచ్చాము. రాలేదు. మేము రాసిచ్చి 8 నెలలైపోయింది.. ఆ పని కాదు. మేము అడుగుతున్న సందర్భం గురించి మీకు తెలుసు. వయొలేషన్ గురించి తెలుసు. క్వశ్చన్స్ పంపించాము రాలేదు. అడుగడుగునా అవమానమే.

మిస్టర్ స్పీకర్:- వెంకటరమణ రెడ్డిగారూ, రాకేష్ రెడ్డిగారూ, దయచేసి కూర్చోండి.

(బీజేపీ సభ్యులచే అంతరాయం)

వెంకటరమణా రెడ్డిగారూ, రాకేష్ రెడ్డిగారూ, దయచేసి కూర్చోండి. పాయల్ శంకర్ గారూ, మీరు మాట్లాడండి.

శ్రీ పాయల్ శంకర్:- అధ్యక్షా, సభ్యులు కోరుతున్నట్లుగా ప్రభుత్వం నుంచి సరైన రీతిలో సమాధానమిచ్చి తృప్తి పరచాలి. సభ్యులు అనేకసందర్భాలలో... వెంకటరమణ రెడ్డిగారు కానీ, రాకేష్ రెడ్డిగారు కానీ.. సందర్భం ఒకటైనప్పటికీ, ఆవేదన, ఆలోచన, నియోజకవర్గాలలో జరుగుతున్నటువంటి అవమానాలు... ఈ సభ దృష్టికి తేవడం తప్ప, మిగతా ఎవరికి చెప్పగలుగుతాం? మీరు ఈ సభకు తండ్రిలాంటి వారు. మీరు ప్రభుత్వానికి స్పష్టమైనటువంటి డైరెక్షన్ ఇచ్చి, ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఒక ప్రకటన రావాలి. సభ్యులు గొంతెమ్మ కోరికలేమీ కోరడం లేదు అధ్యక్షా. సభ్యులేమీ గొంతెమ్మ కోరికలు కోరుత లేదు. సభావ్యవహారాల శాఖామంత్రి గారికి విజ్ఞప్తి ఏంటంటే, మీరు సభ్యులకు సంతృప్తిని ఇచ్చేవిధంగా ఒక ప్రకటన చేయండి.

మిస్టర్ స్పీకర్:- వెంకటరమణా రెడ్డిగారూ, ఈ సభ తరువాత మీ ఇద్దరినీ (గౌరవ సభ్యులు కాటిపల్లి వెంకటరమణా రెడ్డి మరియు పైడి రాకేష్ రెడ్డి గార్లనుద్దేశిస్తూ) పిలుస్తాను, ఎల్.ఏ.మినిస్టరు గారినీ పిలుస్తాను. మాట్లాడతాను.

శ్రీ కాటిపల్లి వెంకటరమణా రెడ్డి:- (మైకు లేకుండా) ఛాంబర్స్‌లో ఎందుకు? ఇదే హౌస్‌లో చర్చించండి, ప్రజలు చూస్తున్నారు కదా!

మిస్టర్ స్పీకర్:- వెంకటరమణా రెడ్డిగారూ, మీకంటే ఎక్కువ ఆవేదన...

శ్రీ కాటిపల్లి వెంకటరమణా రెడ్డి:- (మైకు లేకుండా) ఒక్క దానికి సమాధానం చెప్పండి. సభలో దీనిపై చర్చ జరుగుతుందా, జరగదా? చర్చ జరిపిస్తారా లేదా?

మిస్టర్ స్పీకర్:- వెంటకరమణా రెడ్డి గారూ, వినండీ. వినడం నేర్చుకోండీ. కొత్తగా వచ్చిన సభ్యులు మీరు..

శ్రీ కాటిపల్లి వెంకటరమణా రెడ్డి:- (మైకు లేకుండా) అధ్యక్షా, నేను అసెంబ్లీకి కొత్తగానీ, రాజకీయాలకు కాదు.

మిస్టర్ స్పీకర్:- వెంకటరమణా రెడ్డిగారూ, రాకేష్ రెడ్డిగారూ... మీరు కూర్చోండి. నేను చెప్తాను. మీరు కూర్చోండి. మీరు కొత్తగా వచ్చిన సభ్యులు. ఈ విధంగా ఈ సభను అమర్యాదపరచకండి. మీరు కూర్చోండి. మీరు కొత్తగా వచ్చిన వాళ్ళు, నేర్చుకోండి.

(బీజేపీ సభ్యులచే అంతరాయం)

వెంకటరమణా రెడ్డిగారూ, రాకేష్ రెడ్డిగారూ... మీరు దయచేసి కూర్చోండి. నేను చెప్తాను.

ఒకటి.., ఈరోజు సభ ముఖ్యమంత్రిగారి ప్రకటన మీదే నడుస్తోంది. రెండు.., మీకు ఏదైతే ప్రోటోకాల్ వయొలేషన్ జరిగిందో, దాని విషయంలో నిన్ననే సీఎస్ గారినీ, మిగతా సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్లందరినీ పిలిచి మాట్లాడడం కూడా జరిగింది. దానికి తగ్గ రీతిలో ముఖ్యమంత్రిగారు, ఎల్.ఏ. మినిస్టర్‌గారు నాకు సూచనలిచ్చారు. మీకు న్యాయం జరిగే విధంగా ప్రయత్నం చేస్తామని తెలియజేస్తున్నాను. ఈరోజు జరిగే కార్యక్రమం గురించి, ప్రత్యేకంగా ముఖ్యమంత్రిగారు ఇచ్చిన స్టేట్‌మెంట్‌కు సంబంధించి ఏవైనా క్లారిఫికేషన్స్ ఉంటే అడగండి, లేదా దయచేసి వినండి. ప్లీజ్...

గౌరవ సభ్యులు వేముల వీరేశం గారూ...

(బీజేపీ సభ్యులచే అంతరాయం)

12.10 మ. **శ్రీ వేముల వీరేశం**:- ధన్యవాదాలు అధ్యక్షా, చారిత్రాత్మకమైనటువంటి ఈరోజున మాతృమూర్తి, గౌరవ సోనియాగాంధీ గారికి ఈ సభ తరఫున జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

(బీజేపీ సభ్యుల నుండి అంతరాయం)

శ్రీ డి. శ్రీధర్ బాబు:- రాకేష్ రెడ్డిగారూ..., నేను వెంకటరమణా రెడ్డిగారిని కోరుతున్నాను, ఒక్కటి కూడా ప్రస్తావన లేదు విషయంపై. మేము కూడా ఆ స్థానంలో ఉంటిమి. దయచేసి వినండి. ఎక్కడైతే ప్రోటోకాల్ ఉల్లంఘన జరిగిందో, ప్రివిలేజ్ కమిటి అనే ప్లాట్‌ఫామ్ ఉంది, ఆరోజు కూడా దానిలో మీరు ప్రస్తావన చేశారు. ప్రివిలేజ్ కమిటీ

'తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పన' పై గౌరవ ముఖ్యమంత్రి గారి ప్రకటన.

కూర్చుంటది, కూర్చొని, ఉల్లంఘనలకు సంబంధించిన అంశంలో అధికార్లను కూడా సమాధానం కోరుతది. ఎనిమిది నెలలైందనే విషయాన్ని మా దృష్టికి తీసుకువచ్చారు, అతి తొందరలో ప్రివిలేజ్ కమిటీకి సంబంధించిన మీటింగ్ ఏర్పాటు చేయమని స్పీకర్ గారు ఆదేశాలివ్వాలని కోరుతా ఉన్నాం. ఆ విధంగా తీసుకువెళ్ళటం జరుగుతది. మీరు కూడా ఈ ప్రస్తావన మొట్టమొదటిసారి మా దృష్టికి తీసుకువచ్చారు, గౌరవ సభ్యులు అర్థం చేసుకోండి, మీరిక్కడ కూర్చొని మొట్టమొదటిసారి ఈ ప్రస్తావన తీసుకు వచ్చేందుకు ప్రయత్నం చేశారు, కాదంటలేం. We have never done it. రేపు పొద్దున వచ్చి ముఖ్యమంత్రి చైర్‌లో కూర్చుంటామంటే కూడా కూర్చోండి, కాదనడం లేదు, ప్రజలకు తీర్పు ఇవ్వాలి, కూర్చుంటాం అంటే కూర్చోండి.

(బీజేపీ సభ్యుల నుండి అంతరాయం)

స్పీకర్ గారు ఈ చర్చలో పాల్గొనడానికి అందరికీ అవకాశం ఇస్తున్నారు.

(బీజేపీ సభ్యుల నుండి అంతరాయం)

What is this Sir, they have to understand. గౌరవ శాసన సభ్యులు కూడా చాలా మంది ఉన్నారు. ఎందుకు మెజారిటీలో ఉన్నారు? ఎందుకు ప్రభుత్వంలో ఉన్నారు? ఈరోజు, భారతీయ జనతా పార్టీ కూడా వారిలో ముగ్గురు మాట్లాడారు, ఇంకా ఇద్దరు మాట్లాడేది ఉంది, ఓపిక లేకపోతే ఎట్లాగండి?

(బీజేపీ సభ్యుల నుండి అంతరాయం)

అధ్యక్షా, గౌరవ సభ్యులను కోరుతున్నా, ముగ్గురు గౌరవ బీజేపీ సభ్యులకు మీరు అవకాశం ఇచ్చారు, చాలా సంతోషం. మా దగ్గర ఇప్పటి వరకు నలుగురికే అవకాశం ఇచ్చారు. మళ్ళీ ఇద్దరికి ఇచ్చే అవకాశం ఉంటే ఇవ్వండి అధ్యక్షా. కాదంటలేము.

(బీజేపీ సభ్యుల నుండి అంతరాయం)

సభ్యులకు అవకాశం ఇస్తామన్నా కూడా ఓపిక లేకుంటే ఎట్లా? రాకేష్ రెడ్డిగారు దయచేసి భేషజాలకు పోకుండా ... we are appealing...

(బీజేపీ సభ్యుల నుండి అంతరాయం)

బీజేపీలో ముగ్గురు సభ్యులకు కూడా ఈరోజు మీరు అనుమతి ఇచ్చారు కనుక, ఒకటో, రెండు నిముషాలు మాట్లాడటానికి అనుమతి ఇస్తే మాకు అభ్యంతరం లేదని కూడా మేము చెప్పాము. ముగ్గురు మాట్లాడారు, ఇంకా ఇద్దరున్నారు, అవకాశమిస్తామంటే కూడా వారు అభ్యంతరం కలిగిస్తా ఉన్నారు. ఏందయ్యా వెంకట్ ఇది? Come on man, come on..

శ్రీ కాటిపల్లి వెంకట రమణా రెడ్డి:- టైం ఇస్తామంటే వచ్చాం. (మైక్ లేకుండా)

శ్రీ డి. శ్రీధర్ బాబు:- అవకాశం వచ్చినప్పుడు ఇస్తారు, కూర్చోండి. (మైక్ లేకుండా)

శ్రీ కాటిపల్లి వెంకట రమణా రెడ్డి:- మొత్తం మీరే చూసుకోండి, ఇక వారికి (ప్రధాన ప్రతిపక్షం వైపు చూస్తూ), మీకు తేడా ఏముంది? (మైక్ లేకుండా)

(అంతరాయం)

శ్రీ పైడి రాకేష్ రెడ్డి:- మీ మంత్రిగారిని మీరు గౌరవించుకోండి. (మైక్ లేకుండా)

(బీజేపీ సభ్యుల నుండి తీవ్ర అంతరాయం)

శ్రీ వేముల వీరేశం(నకిరేకల్):- అధ్యక్షా, 9 డిసెంబరు ఒక చారిత్రాత్మకమైన దినం. దాదాపు తెలంగాణ సమాజం మొత్తం సకల జనులు, అన్ని వర్గాల ప్రజలు, ఒక ఉధృతంగా, ఒక ఉద్వేగభరితంగా చూసిన రోజు ఈరోజు. శ్రీమతి సోనియాగాంధీగారు ఆనాటి హోం మినిస్టర్ చిదంబరం గారిని ఒక స్టేట్‌మెంట్ ఇవ్వమని పంపిస్తున్న సందర్భంలో నాలుగు కోట్ల మంది ప్రజలు, సోనియా గాంధీగారి నిర్ణయం, మాతృమూర్తిగా తెలంగాణలో విద్యార్థుల బలిదానాలు చూస్తున్న తల్లిగా, ఒక త్యాగాల కుటుంబం నుండి వచ్చినటువంటి, ఒక గాంధీ కుటుంబం నుండి వచ్చినటువంటి తల్లిగా తెలంగాణ సమాజానికి ఏం సందేశం ఇస్తుంది, తెలంగాణ సమాజానికి ఏం భరోసా ఇస్తుందని చూసిన రోజు ఈరోజు అధ్యక్షా. ఆ సోనియా గాంధీ తెలంగాణ ప్రక్రియ ప్రారంభమైందని అప్పటి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ద్వారా

చెప్పియగానే, యావత్ తెలంగాణ సమాజం మొత్తం కూడా ఊపిరి పీల్చుకొని తల్లి సోనియా గాంధీ పట్ల, కాంగ్రెస్ పార్టీ పట్ల, కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల తెలంగాణ సమాజానికి ఒక విశ్వాసం నింపిన రోజు ఈరోజు. ఈ విశ్వాసం నింపినటువంటి ఈరోజు ఆ తదుపరి ప్రక్రియ 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత గౌరవ సోనియాగాంధీగారి కలలు, సోనియాగాంధీగారు ఆశించిన తెలంగాణ, సోనియాగాంధీ కలలు కన్న తెలంగాణ, గడచిన పది సంవత్సరాల్లో విధ్వంసం అవుతున్న తీరు చూసి, నిజంగా సోనియాగాంధీగారు ఎంతో బాధపడ్డారని చెప్పి ఈ సందర్భంగా గుర్తు చేసుకుంటున్నాను అధ్యక్షా. ఎందుకంటే, తెలంగాణ గర్భశోకం చూసినటువంటి తల్లిగా, తెలంగాణ బిడ్డల యొక్క ప్రతిబింబమైనటువంటి తెలంగాణ తల్లి రూపకల్పన కూడా గడచిన పది సంవత్సరాల్లో, గడచిన ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదంటే, ఇంతకంటే దుర్మార్గం ఇంకొకటి ఉండదని నేనీ సందర్భంగా గుర్తు చేసుకుంటున్నాను. ఈరోజు గౌరవ ముఖ్యమంత్రిగారు ఈ సభా వేదిక నుంచి ఈ రాష్ట్రప్రభుత్వం తెలంగాణ ప్రజల యొక్క ప్రతిబింబంగానే ఈరోజు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తా ఉన్నాం. ఈరోజు తెలంగాణ తల్లి విగ్రహం, తెలంగాణ తల్లి చేయి చూపీయడం అంటేనే, ఒక తల్లిగా అభయమిస్తున్నటువంటి అభయాన్ని, ఇంకొక చేతిలో తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయమైనటువంటి మొక్కజొన్నలు, అప్పుడు జొన్నలు, సజ్జలు, ఆ పంటలను గుర్తు చేసేటటువంటి ఒక ప్రతిరూపం దానిలో ఉందని చెప్పి ముఖ్యమంత్రిగారు వివరిస్తుంటే, నిజంగా ఈ సభలో సభ్యులు యెన్నం శీనన్నగారు, పోచారం శీనన్న వీరందరితో ఉద్యమంలో పని చేసినప్పుడు, ఈ ప్రస్తావనంతా ఉద్యమంలో ఉండేది. అప్పుడున్న తెలంగాణ సాంప్రదాయ పంటలు, ఆ పంటల ప్రతిరూపాలు కూడా ఉద్యమ సందర్భంలో మాట్లాడుతున్నప్పుడు విన్నాం. అవన్నీ కూడా ఈరోజు తెలంగాణ తల్లి రూపకంగా, తెలంగాణ చిహ్నంలో అది ఉండటం అనేది తెలంగాణ సమాజానికొక గర్వకారణంగా, తెలంగాణ సంస్కృతికి ఒక గర్వకారణంగా నేను భావిస్తా ఉన్నాను. నేను నిన్న ఒకటీవీలో చూశాను, ప్రధాన ప్రతిపక్షానికి సంబంధించిన ఒక శాసన సభ్యులు మాట్లాడుతా ఉన్నారు. తల్లులంటే, ప్రజలంటే, కన్నీళ్ళు, కష్టాలతో ఉన్న ప్రజలు మాసిన బట్టలతో ఉంటారు, ఏడుపు ముఖాలుంటాయి, ఆ ప్రతిరూపం ఇక్కడ కనిపిస్తుందని చెప్పి వారు ప్రస్తావిస్తుంటే చూశాను. కానీ, మాసిన బట్టలని, పేదరికాన్ని, తెలంగాణ సమాజాన్ని అవమానిచ్చేటటువంటి పద్ధతుల్లో వారు మాట్లాడుతుంటే నిజంగా నాకు బాధ వేసింది. కానీ, ఇక్కడొచ్చినటువంటి ప్రజా ప్రభుత్వం, ఇక్కడ నిర్వహిస్తున్న ప్రజాపాలన, ఆ మట్టి మనుషుల, యెట్టి మనుషుల వెతల్ని, బాధల్ని, కన్నీళ్ళని, కష్టాల్ని, వారి సంస్కృతిని, సాంప్రదాయాన్ని ప్రతిబింబించేలాగా ఈయాల తెలంగాణ తల్లి రూపకల్పన చేయడమన్నది, నిజంగా తెలంగాణ చరిత్రకు, తెలంగాణ సంస్కృతికి, తెలంగాణ సమాజానికి, గొప్ప గౌరవంగా నేను భావిస్తా ఉన్నాను.

ఈరోజు మన ప్రభుత్వం తీసుకున్న గొప్ప నిర్ణయం, తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు కార్యక్రమం చాలా చారిత్రాత్మకమైంది. గడచిన పాలకులు, గడచిన ప్రభుత్వాలు, ఈ సంస్కృతిని, సాంప్రదాయాన్ని విస్మరించిన్రు, ఎవరి సలహాలు, సూచనలు కూడా తీసుకోలేదు. మన ప్రభుత్వం అనేకమంది మేధావులతోని, అనేక మంది విద్యావేత్తలతోని, అనేక మంది ఉద్యమంలో పాల్గొన్నటువంటి ఉద్యమకారులతోని చర్చించి, వారి అభిప్రాయాలను తీసుకొని, వారి అభిప్రాయాలకనుగుణంగా, తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయటమనేది నేను మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాను. చరిత్రను ఎప్పుడైనా ప్రజలే నిర్మించుకుంటారు, ఈ ప్రభుత్వాన్ని కూడా ప్రజలే నిర్మించుకున్నారు, చరిత్రను ప్రజలు నిర్మిస్తారు కాబట్టి, ప్రజలు నిర్మించుకున్న, ప్రజలు ఏర్పాటు చేసుకున్న ప్రజాప్రభుత్వం, ప్రజల మనోభావాలకనుగుణంగా నిర్మించినటువంటి, తీసుకున్నటువంటి నిర్ణయాన్ని రూపకల్పన చేసినటువంటి ఈ తెలంగాణ తల్లి విగ్రహాన్ని మనస్ఫూర్తిగా ప్రభుత్వాన్ని అభినందిస్తూ, ఈ విగ్రహ ఏర్పాటును స్వాగతిస్తూ, ప్రజలందరూ కూడా నేటి కార్యక్రమంలో పెద్దయెత్తున పాల్గొంటారని తెలియజేస్తూ, నాకీ అవకాశమిచ్చినందుకు ధన్యవాదాలు అధ్యక్షా.

శ్రీమతి డి. అనసూయ (గౌరవ పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖామాత్యులు):- ధన్యవాదాలు అధ్యక్షా. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష, 60 సంవత్సరాల పోరాటం, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని గుండెల్లో పెట్టుకుని తల్లి సోనియాగాంధీ గారు మనకు డిసెంబర్ 09న తెలంగాణాను ప్రకటించిన సందర్భంగా, వారి పుట్టినరోజు కూడా ఈరోజే ఉండటం మనందరికీ చాలా సంతోషం. ఈ సందర్భంగా వారికి పుట్టినరోజు శుభాకాంక్షలను తెలియజేస్తున్నాను అధ్యక్షా.

ఈరోజు జరుగుతున్నటువంటి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఆయా పార్టీలు వారి సొంత ఎజెండాను ఈ తల్లి విగ్రహం చుట్టూ రాజకీయాన్ని చేస్తున్న పరిస్థితి మనం చూస్తా వున్నాము. ఈనాడు పెట్టినటువంటి తల్లి తెలంగాణ విగ్రహంలో తెలంగాణ ప్రజల అస్థిత్వం, ఆత్మగౌరవం, పోరాటం, శ్రమైక రూపము, ఆశీర్వాదము, తల్లి యొక్క బ్లెస్సింగ్స్.. ఇవన్నీ కలగలసినటువంటి నిండు రూపం తెలంగాణ తల్లి రూపం ఈరోజు మనం ఆవిష్కరించుకోవడం చాలా సంతోషం అధ్యక్షా.

ఇందాకసభలో బిజెపి వాళ్ళు గానీ, బయట బిఆర్ఎస్ వాళ్లు కానీ తెలంగాణ తల్లి విగ్రహాన్ని మారుస్తున్నారని మాట్లాడుతున్నారు. అయ్యా, ఇప్పటివరకు అధికారికంగా పది సంవత్సరాల కాలం నుంచి ఎక్కడైనా తెలంగాణ తల్లి విగ్రహాన్ని మీరు ఆవిష్కరించారా? కేవలం వారి పార్టీ రూపాలు, వాళ్లపార్టీ జెండా రూపం, కెటిఆర్ చెల్లికి దేవత విగ్రహ రూపాన్ని ఇచ్చుకుంటే ఎట్లా ఉంటుందో ఆ రకమైన విగ్రహాలను వారు పెట్టుకుని, దాన్ని తెలంగాణ తల్లిగా ఇన్నిరోజులూ వాళ్ళు ప్రజలమీద రుద్దారు. కానీ ఈరోజు మనం పెట్టుకునేది సాటి తల్లులు, చెల్లెళ్ళు, అమ్మలు ఎట్లా ఉంటారో, తెలంగాణ బిడ్డలయొక్క అస్థిత్వం ఎట్లా ఉంటుంది అనే రూపాన్ని మనం తెలంగాణ తల్లికి ఇచ్చుకోవడం జరుగుతా వుంది.

పది సంవత్సరాలలో ఒక తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుందాం అనే ఆలోచన వారికి రాలేదు. కనీసం నిండు గుండెల నిండా పాడుకునే జయ జయహే తెలంగాణను ఒక రాష్ట్రీయ గీతంగా ఏర్పాటు చేసుకుందామనే ఆలోచన వారికి రాలేదు. ఈరోజు మనం అవి చేస్తావుంటే మాత్రం అడ్డుపడుతున్నారు. మనం అన్నట్టుగా, మనం విన్నట్టుగా గుండెల మీద, నెత్తి గుండుల మీద కూడా మా సోదరులు, సోదరీమణులు టి.జి. అని పెట్టుకుంటే, వారి పార్టీకి వచ్చే విధంగా బిఆర్ఎస్ పార్టీ వాళ్ళు టిఎస్‌గా మార్చుకున్నారు.

తెలంగాణ ఉద్యమంలో టి.జి., టి.జి. అని పెట్టుకుని, వారు అధికారంలోకి రాగానే వెంటనే టి.ఎస్.గా మార్చుకున్నప్పుడు మా సోదరులు ఎవరూ కూడా .. మరి వారే కేంద్రంలో అధికారంలో ఉన్నారు, ఇక్కడ కూడా బిజెపి వాళ్ళు ఉన్నారు, కనీసం మాట్లాడలేకపోయారు. ఈరోజు ప్రజల ఆకాంక్షను ఆవిష్కరింపజేసే విధంగా జరుగుతున్న దాన్ని మాత్రం రాజకీయం చేస్తున్నారు. ముఖ్యంగా మేము తెలంగాణ కోసమే పుట్టాము తెలంగాణ కోసమే చస్తాము అని చెప్పినటువంటి ఈనాటి బిఆర్ఎస్ పార్టీ, తెలంగాణా పేరుతోటి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ రాష్ట్రంలో మాకు ఎదురేమీ లేదు, మేము దేశమంతా వ్యాపిస్తాం కాబట్టి భారత రాష్ట్రసమితి అని తెలంగాణ అనే పదాన్ని కూడా వారు తొలగించారు. ఈరోజు వాళ్ళు మళ్ళీ తెలంగాణాకి వ్యతిరేకం, తెలంగాణ అస్థిత్వానికి వ్యతిరేకం..

అయ్యా, వేరే వాళ్ళు పాట రాస్తే రాష్ట్రీయ గీతంగా మీకు మనసొప్పలేదు. కనీసం ఒక్క రోజు కూడా స్కూళ్ళల్లో, గుళ్ళల్లో ఆ గీతాన్ని వినిపించడానికి మీకు మనసొప్పలేదు. ఇష్టపడలేదు. ఈరోజు మాకు గర్వంగా కూడా ఉంది. ఎక్కడకెళ్ళినా ఫస్ట్ జయ జయహే తెలంగాణ అని ఒక దళిత బిడ్డరాసినటువంటి పాటను మేమందరం వింటూంటే నిజంగా మనసు పులకరిస్తావుంది.

అదేవిధంగా తల్లి విగ్రహాన్ని చూస్తుంటే మమ్మల్ని మేము చూసుకున్నట్టు, మా అక్కచెళ్ళెళ్ళను, మా తల్లులను చూసినట్టుగా మాకు అనిపిస్తా వుంది. కాకపోతే బిఆర్ఎస్ వాళ్ళకు వాళ్ళ ఇంట్లో ఉండే రూపం.. నేను రెండు మూడు ఏళ్ళ క్రింద నుంచే మాట్లాడుతున్నాను. ఆ విగ్రహ రూపం చూడండి అందులో శ్రమైక జీవనం ఉందా అని. ఈరోజు కొంతమంది ధనం, ధాన్యంతో ఉండొచ్చు. కానీ తెలంగాణ

సమాజం అట్లా లేదు. ఇందాక మా సోదరుడు వీరేశం గారు అన్నట్లుగా తెలంగాణ బిడ్డలు మట్టి బిడ్డలు. మట్టి బిడ్డలే కానీ ఎడ్డి బిడ్డలు కాదు, గట్టి బిడ్డలు. ఆ గట్టి తనాన్ని, ఆ శ్రామిక తత్వాన్ని, పంటను, అదేవిధంగా కష్టాన్ని కూడా అందులో చూపించినటువంటి ప్రతిరూపంగా మనం చూస్తున్నాము.

అదేవిధంగా ఇందాక సోదరుడు నా పేరు చెప్పడం జరిగింది. ఎన్ఆర్ఇజిఎస్‌కి సంబంధించి ఇచ్చేది అధికారికంగా జిల్లా కలెక్టర్లకు లేదా గతంలో ఎక్కువ ఇచ్చిన దగ్గర కొద్దిగా తక్కువ చేసి ఇస్తున్నాము. ఎందుకంటే ఆల్రెడీ ఎక్కువ ఎక్కువగా డబ్బులు వాళ్ళకు పోయిన దగ్గర నియోజకవర్గానికే ఇస్తున్నాము కానీ వేరే రూపంలో లేదు.

అదేవిధంగా ఇందాక మా బీజేపీ సోదరులు మాట్లాడారు. సోనియాగాంధీగారిని తెలంగాణ ఎట్ల ఇచ్చినవు, తల్లిని చంపి నువ్వు బిడ్డను ఇచ్చావు అని నిండు సభలో ఆరోజు మోదీగారు అవమానించారు. అది కరెక్టు కాదు అని తెలంగాణ నుంచి బీజేపీ నాయకులు గానీ, బిఆర్ఎస్ నాయకులు గానీ ఆ విధానాలకు వ్యతిరేకంగా మాట్లాడలేకపోయారు. కాబట్టి...

(ఆరోజు మీరు ఎక్కడున్నారు.. అని బిజెపి సభ్యులు సర్వశ్రీ పాయల్ శంకర్, పైడి రాకేష్ రెడ్డి, కాటిపల్లి వెంకటరమణా రెడ్డి అడిగారు)

నేనెక్కడున్నా గానీ పోరాటంలోనే ఉన్నాను.. పోరాటంలోనే ఉన్నాము. 1200 మంది అని ఆరోజు కేసీఆర్ అని, ఆయన అధికారంలోకి వచ్చాక మళ్ళీ 400 మందికి కుదించారు. కనీసం మీరైనా ఇవ్వలేదు.

(బీజెపి సభ్యులచే అంతరాయం)

మేమెక్కడున్నా గానీ ప్రజలలోనే ఉన్నాము... ప్రజలలోనే ఉన్నాం. పోరాటంలో ఉన్నాం. తెలంగాణ ఉద్యమంలో జైలుకు పోయి వచ్చినం, ఏడు రోజులు ములుగు కేంద్రంలో నిరాహార దీక్ష కూడా చేసినం. తెలంగాణ వచ్చిన తరువాత కూడా తెలంగాణాని కించపరచడం అవసరమా అని అంటున్నాను. మేమెక్కడున్నామో ఈరోజు అదే పార్టీతోని మీరు అంటగడుతున్నారు కదా, మేము ఆరోజు ఉన్న పార్టీతోని మీరు అంటగడుతున్నారు కదా. ఆ పార్టీ మీద డిపెండయ్యే ఈరోజు కేంద్రంలో మీ ప్రభుత్వం నడుస్తుందికదా అని నేనంటున్నాను. నేననేది.. ఆరోజైనా ఈరోజైనా మా గొంతును తెలంగాణ ప్రజలకోసం వినిపించాము. నిండు సభలో సోనియమ్మను పట్టుకొని, కాంగ్రెస్ పార్టీని పట్టుకొని మీరు తల్లిని చంపి తెలంగాణ ఇచ్చారు.. ఈరోజు మీరు ఏం మాట్లాడుతున్నారు. కాబట్టి..

మిస్టర్ స్పీకర్:- వెంకటరమణారెడ్డిగారూ, దయచేసి కూర్చోండి..

శ్రీమతి డి. అనసూయ:- కేంద్రంలో పార్లమెంటు వేదికగా ఆ మాటలు మాట్లాడితే మీరెందుకు మాట్లాడలేదు. పదేళ్ళలో జాతీయగీతం, రాష్ట్రీయ గీతం రాకుంటే మీరెందుకు మాట్లాడలేదు? అరే, ఈరోజు తెలంగాణ ఇవ్వడాన్నే మీరు వ్యతిరేకించారు. తెలంగాణ ఇవ్వడాన్ని మీ మోదీగారు వ్యతిరేకించారు.

కాబట్టి అధ్యక్షా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి.. కాంగ్రెసు ప్రభుత్వం అంటేనే మహిళలను గౌరవించే ప్రభుత్వం. ఈరోజు మహిళలకు ఇచ్చే సంక్షేమ పథకాలు అన్నీ కూడా మహిళలను.. ఏ సమాజంలో అయితే మహిళా అభివృద్ధి జరుగుతదో ఆ సమాజం అభివృద్ధి చెందినట్టుగా అని ఏదైతే మనం కొలమానంగా తీసుకుంటామో ఆ విషయాన్ని డా.బి.ఆర్.అంబేడ్కర్ గారు చెప్పిన పద్ధతిలో ఈనాటి గవర్నమెంటు కూడా మహిళల యొక్క సంక్షేమం కోసం మొదటినుంచీ, గత సంవత్సరం ఇదే అసెంబ్లీ వేదికగా, ఇదే అసెంబ్లీ పక్కన ఉచితంగా బస్సు ప్రయాణాన్ని మనం మహిళలకు ప్రారంభించిన రోజు కూడా డిసెంబరు 9వ తేదీనే అధ్యక్షా. ఈరోజు వరకు రూ.4000 కోట్లను ఉచిత బస్సు ప్రయాణానికి ఖర్చు పెట్టడం జరిగింది, దాదాపు 110 కోట్ల మంది మహిళల ఉచిత ప్రయాణాలు జరిగాయి. నష్టాలలో ఉన్నటువంటి ఆర్.టి.సిని ఈరోజు లాభాల్లోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నాము.

అదేవిధంగా గతంలో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రూ.450/-500/-లకే గ్యాస్ సిలిండర్‌ని ఇస్తే, బిజెపి పార్టీ అధికారంలోకి వచ్చాక దాన్ని రూ.1200/- లకు పెంచారు. ఇప్పుడు మళ్ళీ మా సోనియాగాంధీ గారి ఆదేశానుసారం సిఎం రేవంత్‌రెడ్డిగారు, మా క్యాబినెట్ అంతా కూర్చుని ఏదైతే వాగ్దానం చేశామో రూ.500/-లకే మేము గ్యాస్ సిలిండర్ ఇస్తున్నాము.

పేదింటి బిడ్డల గుడిసెల్లో వెలుగులు నింపాలని 200 యూనిట్ల కరెంటు ఉచితంగా ఇస్తున్నాము. పదేళ్ళలో మీరు రైతులకు రుణమాఫీ చేయలేదు, తీసుకొస్తానన్న బ్లాక్‌మనీ తీసుకురాలేదు, రెండు కోట్ల ఉద్యోగాలు ఇవ్వలేదు, ఇవన్నీ 11 ఏళ్ళు అయినా మీరు చేయలేదు. మా ఒక్క సంవత్సరంలో చేయలేదు చేయలేదు అనడం ఎంతవరకు కరెక్టు. ఇదంతా మాట్లాడడము ఎంతవరకు కరెక్టు సార్?

ఈరోజు జరుగుతున్నటువంటి సమావేశంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ గురించి మాట్లాడుతున్నాం. సిఎం గారు విగ్రహావిష్కరణకు సంబంధించినటువంటి ఇన్విటేషన్ గురించి ఈరోజు స్టేట్‌మెంట్ ఇవ్వడం జరిగింది. దాన్నుంచి డైవర్ట్ చేసి కొంతమంది సభ్యులు రాజకీయాలు మాట్లాడుతున్నారు. అందుకనే నేను మాట్లాడాల్సి వచ్చింది. కాబట్టి ఈరోజు మనం ప్రతిష్టింపచేసుకునే తెలంగాణ తల్లి విగ్రహం ప్రతి ఇంట్లో ఒక ఆడపడుచు విగ్రహం లాగా మనకు అనిపిస్తుంది.

ఇందాక నేను మండలికి పోయాను. అక్కడ బిజెపి సభ్యులు 100 శాతం సపోర్టు చేశారు. ఇక్కడ మాత్రం వీళ్ళు కావాలని రాజకీయం చేస్తున్నారు. బిఆర్ఎస్ వాయిస్, బిజెపి వాయిస్ ఒక్కటే అనేది స్పష్టం అవుతా వుంది. వాళ్ళు బయట చేస్తున్నారు. మీరు లోపల చేస్తున్నారు. అంతకంటే తేడా లేదు. కాబట్టి తెలంగాణ అస్థిత్వ విగ్రహం ఇది. అందరూ సంతోషంగా తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సభకి రావాలని కోరుతున్నాను.

12.30 మ. శ్రీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి (గౌరవ రెవెన్యూ మరియు గృహనిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖామాత్యులు):- దన్యవాదాలు అధ్యక్షా. ఈ డిసెంబర్ తొమ్మిదికి ఒక ప్రత్యేకత ఉంది. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షని నెరవేర్చేది, తెలంగాణ రాష్ట్ర ప్రకటన ఆనాడు డిసెంబర్ 9న జరిగింది. అదేరకంగా యుపిఏ ఛైర్‌పర్సన్ అయిన శ్రీమతి సోనియా గాంధీగారి పుట్టిన రోజు. ఆ పుట్టిన రోజు సందర్భంగా నా పక్షాన, నా నియోజకవర్గ పక్షాన శ్రీమతి సోనియా గాంధీ గారికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్నాను.

ఇంతకుముందు గౌరవ ముఖ్యమంత్రిగారు తెలంగాణ తల్లి ప్రతిరూపం, తెలంగాణ అమ్మల రూపం ఉట్టిపడేలా కనిపించే విగ్రహాన్ని రాష్ట్రప్రభుత్వం అధికారికంగా ఈరోజు ప్రకటిస్తూ, దానిని సెక్రటేరియట్‌లో ఈరోజు సాయంత్రం ఆరుగంటల ఐదు నిమిషాలకు ప్రతిష్టించడం శుభసూచకంగా భావిస్తున్నాను. అలాగే ఇందాక మిత్రులు పాన్నం ప్రభాకర్‌గారు చెప్పినట్లు అన్ని కలెక్టరేట్‌లల్లో, అన్ని ఎస్.పి. ఆఫీసుల్లో, మండల స్థాయిల్లో ఉన్న ఆఫీసుల్లో ఈ విగ్రహాలను ప్రతిష్టించాలని, అలాగే గౌరవ ముఖ్యమంత్రిగారు చెప్పినట్లు ప్రతి సంవత్సరం డిసెంబర్ 9వ తారీఖున ఈ పండుగను పెద్ద ఎత్తున జరుపుకోవాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని నేను పూర్తిగా సమర్థిస్తూ, మరొక్కసారి రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. అదే విధంగా ఈ శాసన సభలో సభ్యులందరం ఒక సంవత్సరం పూర్తి చేసుకున్నాము. గత సంవత్సరం డిసెంబర్ 9నాడు ప్రమాణస్వీకారం చేశాము. తమరితోపాటు మేమందరం కూడా. అందరికీ కూడా ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీమతి వుట్టా రాగమయి (సత్తుపల్లి):- ధన్యవాదాలు అధ్యక్షా. ఈరోజు నాతో పాటు నూతనంగా ఎన్నికైన శాసన సభ్యులు ఎంతోమంది ఉన్నాము. వారందరికీ కూడా జీవితంలో మరిచిపోలేని రోజు. గత సంవత్సరం ఇదే రోజున మేము మొట్టమొదటిసారిగా అసెంబ్లీలోకి అడుగుపెట్టి, ప్రమాణస్వీకారం చేయడం జరిగింది. ఇందుకు నా తోటి శాసన సభ్యులందరికీ కూడా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ఈ సంవత్సర కాలంలో మీ అందరి ఆశీర్వచనాలతో, మీరు అందించిన ప్రోత్సాహంతో మేము మా

నియోజకవర్గాల్లో ఎన్నో అభివృద్ధి పనులు చేసుకోవడం జరిగింది. అలాగే డిసెంబర్ 9, 2009 నాడు మన సోనియమ్మగారు యావత్ తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు, ప్రజల ఆత్మబలిదానాలకు చలించి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇవ్వాలి అని భావించి, దాని వలన ఉభయ రాష్ట్రాల్లో పార్టీకి ఎంతో నష్టం వాటిల్లుతుంది అని తెలిసినా కూడా, ఇచ్చిన మాటకు కట్టుబడి, ఎక్కడా వెనుకంజ వేయకుండా, చెప్పిన ప్రకారం తెలంగాణ రాష్ట్రం గురించి ప్రకటన చేయడం జరిగింది. ఈ సందర్భంగా శ్రీమతి సోనియా గాంధీగారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్నాను.

ముఖ్యంగా చూస్తే గత పది సంవత్సరాల కాలంలో ఆనాటి ప్రభుత్వం ఏం చేసింది? పది సంవత్సరాల కాలం సరిపోలేదా అధ్యక్షా ? తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ అధికారికంగా జరపలేదు. ఒక ప్రత్యేక రూపం అంటూ ఇవ్వలేదు. ఇచ్చినది కూడా ఎలా ఉందంటే తల్లి రూపంలా లేదు. దేవతలాగా ఉన్నారు. కిరీటము, నడుముకు వడ్డాణము, నగలు అన్నీ అలంకరించుకుని, తల్లి అనే భావన మనకు రావడం లేదు. తెలంగాణ తల్లి అంటే నిత్యం మనం ఇంట్లో చూసే మన మాతృమూర్తి లాగా, అక్కచెల్లెమ్మలాగా ఉండే రూపమే మనకు తెలుసు. అందుకనే ఇప్పుడు మన రేవంత్‌రెడ్డి గారు అందరు మేథావులు, కవులు, కళాకారులందరితో చర్చించి, అందరి ఆకాంక్షల మేరకు, వారి అభిప్రాయాల మేరకు ఇవ్వాళనిండైన తెలంగాణ తల్లి రూపం యొక్కవిగ్రహాన్ని ఆవిష్కరించడం జరుగుతా ఉంది. ప్రతిపక్షాలుగాని, ఎవరైనాగాని, తగిన సూచనలు, సలహాలు ఇచ్చి, అప్పుడే చెప్పి ఉంటే బాగుండేది. ఇప్పుడు ప్రతిదాన్ని రాజకీయం చేస్తూ వస్తున్నారు. ఇప్పుడు మన తెలంగాణ తల్లి విగ్రహాన్ని చూస్తే ఎంతో సంప్రదాయబద్ధంగా, ఆకుపచ్చని చీరలో, నిండు ముత్తైదువ లాగా, వరికంకులు, ధాన్యం కంకులు పట్టుకుని, ఒక చేత్తో మనకు ఆశీర్వాదం ఇస్తూ, ఎంతో ఆహ్లాదకంగా ఉంది. తెలంగాణ ప్రజలందరూ కూడా చాలా ఆనందిస్తున్నారు. ఇన్నాళ్లకు రాష్ట్రానికి ఒక తెలంగాణ తల్లి విగ్రహం కాని, మన తెలంగాణకు టి.జి. అని మార్పు జరగడం గాని, తెలంగాణకు ప్రత్యేక రాష్ట్రగీతం రావడం జరిగింది. మరి పది సంవత్సరాల కాలంలో ఎందుకు చేయలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాని మన సోదరులు తెలంగాణ ప్రజలు ఎంతో నిరాశా నిస్పృహల్లో ఉన్నారంటున్నారు. మరి వాళ్లు అలా ఎందుకంటున్నారో తెలియదు. ఉద్యోగులందరికీ ఫస్టు తారీఖున జీతాలు వస్తున్నందుకు నిరాశలో ఉన్నారా, రైతులందరికీ రెండు లక్షలలోపు రుణ మాఫీ జరిగినందుకు నిరాశలో ఉన్నారా, ఈ సంవత్సర కాలంలో 55 వేల పైచిలుకు ఉద్యోగాలు వచ్చినందుకు నిరాశలో ఉన్నారా చెప్పాలి. వీటన్నిటికితెలంగాణ ప్రజలు ఆశీర్వదిస్తున్నారు.

(అంతరాయం)

అధ్యక్షా, ఎదుటి వాళ్లు మాట్లాడుతున్నప్పుడు కూర్చో, కూర్చో అనడం సభ్యత అనిపించుకోదు అధ్యక్షా. వాళ్లు మాట్లాడుతున్నప్పుడు మేము వింటున్నాము, కాని మేము మాట్లాడుతుంటే వాళ్లు కూడా వినాలి. ఎందుకంటే మేము కూడా మొట్టమొదటిసారి ఎన్నికైన సభ్యులమే అధ్యక్షా. మా భావాలు చెప్పడానికి మీరు మాకు అవకాశం ఇవ్వాలి. మధ్యలో డిస్టర్బ్ చేయకూడదని మేము వేడుకుంటున్నాము, రిక్వెస్ట్ చేస్తున్నాము. అలాగే ఇవ్వాళ మన ముఖ్యమంత్రిగారు ప్రకటించినట్లు అందరు సభ్యులు హుందాగా విగ్రహ ఆవిష్కరణకు వచ్చి, ఆశీర్వదించాలని వినమ్రంగా కోరుకుంటూ, ఈ అవకాశం ఇచ్చిన మీకు మరొకసారి ధన్యవాదాలు తెలుపుకుంటూ ముగిస్తున్నాను.

శ్రీ కాటిపల్లి వెంకటరమణా రెడ్డి (కామారెడ్డి):- ధన్యవాదాలు అధ్యక్షా. గౌరవ సభ్యులందరికీ కూడా ఒక విషయం చెప్పదలచుకున్నాను. నేను సభలోకివచ్చిన తరువాత శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి గారి చైర్‌లో కూర్చుని నిరసన తెలియజెప్పాను. ప్రొటోకాల్ వయలేషన్ అవుతుందని పక్కన ఉన్న సీనియర్ మోస్ట్ నాయకులు తుమ్మల నాగేశ్వరరావు గారు కూడా అన్నారు. నేను అప్పుడన్నాను అన్నా! ఇక్కడ మీ చైర్‌లో కూర్చుంటే మీకు ఇబ్బంది అయినప్పుడు, రేపు ఇలాగే మా నియోజకవర్గంలో కూడా మాకు ఇలాగే ఇబ్బంది అవుతున్నది అంటే, ఇవ్వాళ తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ ఉంది, ఇవ్వాళ ఒక్కరోజు వదిలేయ్ అని ఆయన మాటిచ్చారు.

సరే, మాట ఇచ్చారు రేపటి వరకు కాదు, అవకాశం ఇవ్వాళ ఇవ్వాలి అని చెప్పాము. సరే మంచిది అని చెప్పి, జనగణమన అయిన తరువాత ఇక్కడికి వచ్చాము, ఇది ఆయన నోటి ద్వారా వచ్చినటువంటి మాట. ఇది అబద్ధం కాదు. ముందరే చెబుతున్నా. ఇక్కడికొచ్చి కూర్చున్న తరువాత అవకాశం ఇవ్వడానికి ఇబ్బంది పడుతున్నారు. సరే ఇవ్వాళ తెలంగాణ తల్లి విషయం మాట్లాడుతున్నారు కాబట్టి దాని మీద నేను రాజకీయం చేయడంగాని, అవాకులు చవాకులు పేలడం గాని, అనవసరమైనవి మాట్లాడడం గాని నాకు అవసరం లేదు. ఎందుకంటే ప్రజల మంచి చెడుల గురించి ఆలోచించే వ్యక్తిగా, ఒక మంచి లెజిస్లేటివ్ అసెంబ్లీ మెంబర్‌గా, ఫ్యూచర్‌లో జనానికి ఆదర్శంగా ఉండడానికి వచ్చామే తప్ప కొత్తగా కాదు, తెలవక కాదు, మాకేమీ అనుభవం లేక కాదు. 25 సంవత్సరాల రాజకీయ అనుభవం ఉంది, ఓడిపోవచ్చు, గెలవకపోవచ్చు, రాకపోవచ్చు. కాని అనుభవం లేని వ్యక్తినయితే కాదు. కాని ఇక్కడికొచ్చినంక శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రిగారు సమయం అయితే ఇవ్వలేదు. మీరూ నాకు అవకాశం ఇవ్వట్లేదు. సరే నేను సూటిగా అడిగేది అధ్యక్షా ఈ ప్రొటోకాల్ విషయంలోగాని, వయలేషన్ విషయంలోగాని మంత్రులు చేస్తున్న పనుల విషయంలోగాని నేను ఎవరినీ నిందించడానికి మాట్లాడడం లేదు. ఎమ్మెల్యే అనే పదానికి జరుగుతున్న అవమానం గురించి మాట్లాడుతున్నా. ఇవ్వాళ వెంకటరమణారెడ్డి ఉంటాడు, రేపు వెంకటయ్య ఉంటాడు. అదేం పెద్ద పర్మనెంట్ కాదు. ఇక్కడున్నోడు అక్కడుంటాడు, అక్కడున్నోడు ఇక్కడుంటాడు టైం వస్తే. దాంట్లో ఏం సమస్య లేదు. కాని ఇవ్వాళ ఆలోచన ఉండాలి. రేపటికి అవకాశం ఇవ్వము అంటే ఊరుకునేది లేదు. నేను ఎనిమిది నెలల క్రితము ప్రివిలేజ్ కమిటీకి ఇచ్చాము కలెక్టర్‌గారు చేసిన ఒక పని మీద, అక్కడున్న ఒక ఇన్‌చార్జి మంత్రిగారు చేసిన పని మీద. దాని మీద ఇప్పటి వరకు యాక్షన్ లేదు. సుమారు అరవై క్వశ్చన్లు పంపాము, దాని మీద ఇప్పటివరకు పత్తా లేదు, అత్తా లేదు, సంవత్సరమైంది. నేను ఒక ఎమ్మెల్యేకి ఉండే మర్యాద గురించి చెబుతున్నాను, వెంకటరమణారెడ్డి గురించి కాదు. ఇది మీరు ఆలోచించి, మీరు రేపు నిర్ణయం తీసుకోవాలి. రేపు మళ్లీ కొత్తగా నేర్చుకోండి అంటే ఊరుకొనేది లేదు అధ్యక్షా. మీరు దయచేసి సహకరించాలి, ఎట్టి పరిస్థితుల్లో చర్చ జరగాలని కోరుకుంటున్నాను.

12.40 మ. **శ్రీ మేడిపల్లి సత్యం**:- అధ్యక్షా, తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు సందర్భంగా మాట్లాడే అవకాశం కల్పించిన మీకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. 2014వ సంవత్సరంలో ఆనాటి యుపిఏ చైర్‌పర్సన్ శ్రీమతి సోనియాగాంధీగారి చలువతో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైనప్పుడు వారు గతంలో పది సంవత్సరాలు తెలంగాణ ఉద్యమం పేరిట పార్టీ నడిపి అధికారంలోకి వచ్చిన తరువాత కనీసం తెలంగాణ తల్లి విగ్రహం పెట్టడం గానీ, తెలంగాణ రాష్ట్రగీతం పెట్టడంలోగానీ పూర్తిగా విఫలమయ్యారు. వారు కేవలం పార్టీకి చిహ్నమైనటువంటి తెలంగాణ తల్లి విగ్రహం ఆ పార్టీనే ప్రభుత్వానికే అప్పచెప్పారు తప్ప నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షని ఏనాడు కూడా వారు పరిగణన లోనికి తీసుకోలేదు. ఈనాడు ప్రజాపాలన ఈ రాష్ట్రంలో కొలువుదీరింది. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష అయినటువంటి తెలంగాణ తల్లి విగ్రహం డా. బిఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేయాలని వారు తలచడం, ఈ నిండు సభలో ప్రకటన చేయడం గౌరవ ముఖ్యమంత్రికి, ఈ రాష్ట్ర మంత్రివర్గానికి, ఈ శాసన సభలో కొలువుదీరిన సభ్యులందరికీ కూడా నేను మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

ఆనాడు ఉస్మానియా యూనివర్సిటీ నుండి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థి నాయకుడిగా నాకు చాలా సంతోషంగా అనిపిస్తుంది. ఎందుకంటే మలిదశ ఉద్యమంలో ఉస్మానియా యూనివర్సిటీలో అనేకసార్లు జైలుకు వెళ్లి కేసులపాలై, ఈనాడు తెలంగాణ శాసన సభలో ఒక శాసన సభ్యుడిగా నాకు మాట్లాడే అవకాశం వచ్చినందుకు నిజంగా నేను చాలా అదృష్టంగా భావిస్తున్నాను. గతంలో ఉన్న బిఆర్ఎస్ సర్కార్ ఏనాడు కూడా తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు

విరుద్ధంగా పనిచేసింది తప్ప, ఏనాడు కూడా వారి ఆకాంక్షలకు అనుగుణంగా పని చేయలేదు. ఇంకొక ముఖ్యమైన విషయం ఏమిటంటే, శ్రీమతి సోనియా గాంధీగారి జన్మదినం కూడా ఈనాడే కాబట్టి, ఈ శాసన సభ తరఫున వారికి మనస్ఫూర్తిగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, నాకు అవకాశం ఇచ్చిన మీకు మరొకసారి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ముగిస్తున్నాను.

శ్రీ వాకిటి శ్రీహరి (మక్తల్):- అధ్యక్షా, తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పనపై శాసన సభలో ముఖ్యమంత్రి గారి ప్రకటనపై చర్చించే అవకాశం ఇచ్చినందుకు నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. అదే మాదిరిగా ఇదే సభలో గతంలో శ్రీమతి సోనియాగాంధీ గారి వల్లనే తెలంగాణ ఆకాంక్ష నెరవేరిందని ఆన్ రికార్డ్‌లో ఉన్న మాట. మరి ఆ తెలంగాణ రావడానికి రూపకల్పన చేసినటువంటి సోనియాగాంధీ గారి పుట్టిన రోజు సందర్భంగా వారికి మా తరఫున, మా మక్తల్ నియోజకవర్గ ప్రజల తరఫున శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్నాను.

అధ్యక్షా, పూర్తిగా విగ్రహం గురించే చర్చ చేసుకుంటున్నాము కాబట్టి, ఆనాడు యువకులు, సబ్బండ వర్గాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అగ్ర వర్ణాలు ఉన్న పేదలందరూ కూడా ఈ తెలంగాణ దోపిడీకి గురవుతున్నది, అటువంటి తెలంగాణ మాలాంటి సబ్బండ వర్గాల వారికి కూడా ఇంతో అంతో న్యాయం చేయాలని, తెలంగాణ రావాలని, పిడికిలి బిగించినటువంటి ప్రతి ఒక్కరి పిడికిలిని పునాదిగా వేసుకొని, సకల జనులందరూ కూడా ఈ కార్యక్రమంలో పూర్తి స్థాయిలో పాల్గొని వాళ్ల చేతుల మీద తెలంగాణ తల్లిని నిలబెట్టుకునే విధంగా ఆ చేతులను ఏర్పాటు చేసి మిగతా పాడిపంటలతో కూడినటువంటి తెలంగాణ, ఆ చీర, కట్టు, బొట్టు ప్రతి ఒక్కరం కూడా ఈ నాలుగు కోట్ల ప్రజల కన్న తల్లులకు కన్న తల్లి తెలంగాణ తల్లి. ప్రతి ఇంటిలో ఒక అక్కను గానీ, మన మాతృమూర్తిని గానీ చూస్తే ఏ విధంగానైతే మనకు భావం కల్గుతుందో అదే భావనతో అదే మాదిరిగా తెలంగాణ తల్లి ఈ తెలంగాణలో పసిడి పంటలను ఒక చేత బూని, ఈ తెలంగాణ తల్లి మనందరినీ కూడా ఆశీర్వదించే విధంగా విగ్రహాన్ని ఏర్పాటు చేశారు కాబట్టి, ఖచ్చితంగా ఈ విగ్రహం ఈ విధంగానే ఉండాలి. సకల జనులు ఏ విధంగానైతే కోరుకున్నారో, ఈ సబ్బండ వర్గాలు ఏదైతే కోరుకున్నారో, ఈ వెనుకబడిన జాతులు ఏదైతే కోరుకున్నారో, ఈ వెనుకబడిన జాతులు ఏదైతే కోరుకున్నారో ఈ విధంగానే తెలంగాణ తెలుగు తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం వల్ల రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందని తెలియజేస్తున్నాను. రాబోయే తరాలు కూడా గుర్తు పెట్టుకోవాలి. ఈ విగ్రహంలో ప్రత్యేకత ఏముందని చూసినప్పుడే వారికి అర్థం కావాలి. ఇంత మంది యోధులు పిడికిలి బిగించి, ఇంత మంది తన తల్లిని చేతులతో పైకి లేపి, మన ఇంట్లో ఉన్న అమ్మని చూసే విధంగా ఉన్నటువంటి తెలంగాణ తల్లే విగ్రహంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఇలాంటి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నందుకు ఖచ్చితంగా ముఖ్యమంత్రిగారికి, ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

ఇంకొక చిన్న మాటతో ముగిస్తాను అధ్యక్షా. మొన్న ప్రెస్ మీట్‌లో మాట్లాడుకుంటూ..., ఆ బీద సాదలే, ఆ కూకారులే, ఆ యాస బాసలే, తెలంగాణలో పెద్ద ఎత్తున ఉద్యమం లేపడానికి పనికి వచ్చాయి. కాబట్టి, ఆ యాస బాసలు, ఆ తెలంగాణ ఉద్యమ కారుల స్ఫూర్తి నిచ్చే విధంగా ఉన్న ఈ విగ్రహమే నిజంగా కూడా భవిష్యత్తు తరాలకు ఉదాహరణగా ఉంటుందనే విధంగా నిర్ణయం తీసుకున్నందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. ధన్యవాదాలు అధ్యక్షా.

శ్రీమతి ఎన్. పద్మావతి రెడ్డి:- ధన్యవాదాలు అధ్యక్షా. ఈరోజు సోనియా గాంధీ గారికి నా తరఫున, నా నియోజక వర్గం తరఫున వారికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్నాను. మనం ఈరోజు తెలంగాణ తల్లి విగ్రహ రూప కల్పన ప్రభుత్వం చేసినందుకు, మనం కళ్లు మూసుకుంటే మన చిన్నప్పుడు మన అమ్మ ఎట్ల ఉంటుందో పూర్తిగా అట్లనే ఉన్నందుకు ప్రభుత్వానికి నా తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అధ్యక్షా. థ్యాంక్యూ.

శ్రీ బీర్ల అయిలయ్య(ఆలేరు):- ధన్యవాదాలు అధ్యక్షా. ఈరోజు ఒక శుభదినం. డిసెంబర్ 9వ తేదీన నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేరినటువంటి శుభదినం. 60

సంవత్సరాల పోరాటం, 60 సంవత్సరాల కల, నాలుగు కోట్ల ప్రజల కలను, ఆకాంక్షను నెరవేర్చినటువంటి తల్లి సోనియమ్మ జన్మదినం సందర్భంగా తెలంగాణ ప్రజల తరఫున, ఆలేరు నియోజకవర్గం తరఫున ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. నిజంగా తెలంగాణ వచ్చిన తరువాత ఆ తల్లి విగ్రహం లేకపోవడం, ఆ రాష్ట్ర గీతాన్ని కూడా రాష్ట్ర గీతంగా ప్రకటించని తెలంగాణ ప్రభుత్వంలో ఒక రాష్ట్రగీతాన్ని అధికారికంగా ప్రకటించుకొని, తెలంగాణ తల్లి అంటే నాలుగు కోట్ల ప్రజల గుండెల్లో ఉండే విధంగా, నాలుగు కోట్ల ప్రజల ఇండ్లల్లో ఒక తల్లిగా, ఒక చెల్లిగా, ఒక ప్రతిరూపంగా ఉండే విధంగా ఈరోజు తెలంగాణ రాష్ట్రప్రభుత్వం మా మంత్రివర్గం అంతా కూడా తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించారు. గతంలో తెలంగాణ దేవత అన్నారు. కానీ తెలంగాణ దేవత ఉండేది గుడిలో. కానీ, తల్లి ఉండేది నాలుగు కోట్ల ప్రజల గుండెల్లో. తల్లి ఒక రకంగా పిల్లలకు అభయహస్తం ఇస్తూ, ఈ రాష్ట్రాన్ని ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అన్ని విధాల పాడిపంటలతో, ఒకచేత అభయహస్తం ఇస్తూ, మరొక చేత మొక్కజొన్న కంకి, పాడిపంటలు, ఈ రాష్ట్రంలో ఇప్పటికే సమృద్ధిగా పండుతున్న వడ్లకు ప్రతిరూపంగా ఆ తల్లి విగ్రహం రూపొందించినందుకు నిజంగా కూడా నాలుగు కోట్ల ప్రజలు ఈనాడు ఉవ్వెత్తున లేచి, హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఆ తల్లి విగ్రహం ఈరోజు సాయంత్రం గం. 6.05 నిమిషాలకు ప్రారంభించడం తెలంగాణ ప్రజలు చేసుకున్న అదృష్టంగా భావిస్తున్నాను.

12.50 మ. గత ప్రభుత్వాలు తెలంగాణ తల్లిని విస్మరించాయి. ఈనాడు ఈ ప్రభుత్వం తెలంగాణ 4 కోట్ల మంది ప్రజలకు ఒక ఆకాంక్షగా, వాళ్ళ ఆరాధ్య దైవంగా తల్లి అంటే ఇట్లా ఉండాలని నిరూపిస్తే, దానిని కూడా వ్యతిరేకిస్తున్నటువంటి ఈ ప్రతిపక్షాలకు నిజంగా కూడా తెలంగాణ ప్రజలు బుద్ధి చెప్పినా ఇంకా బుద్ధి రావడం లేదు. ఆ తెలంగాణ తల్లి చేయబట్టే పదేండ్లు ప్రభుత్వంలో కూర్చున్న మీరు, ఈనాడు తెలంగాణ తల్లిని వ్యతిరేకిస్తున్నారు. కనీసం తెలంగాణ పేరుతో ఇవ్వాళ తల్లి సోనియమ్మ దయాదాక్షిణ్యాల మీద మీరు అధికారంలోకి వచ్చి తల్లి సోనియమ్మ బర్త్‌డే రోజు కూడా శాసన సభలో ప్రతిపక్ష నాయకులు రాకపోవడం నిజంగా కూడా ఒక దురదృష్టకరం. ఈనాడు తల్లి సోనియమ్మ దయవల్లనే తెలంగాణ వచ్చిందని ఆరోజు ఇక్కడ ఇదే నిండు సభలో చెప్పినటువంటి ప్రతిపక్ష నాయకుడు ఈరోజు సభకు రాకపోవడం తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారు. నిజంగా తెలంగాణ ప్రజలు ఈ తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు పెద్ద ఎత్తున సాయంత్రం వచ్చి ధన్యవాదాలు తెలపవలసిందిగా, అదేవిధంగా ఈ తెలంగాణలో పాడిపంటలు సమృద్ధిగా పండి, ఆ తల్లి దయవల్ల తెలంగాణ రాష్ట్రం ఇంకా దినదిన అభివృద్ధిగా గత ప్రభుత్వం పది సంవత్సరాలలో చేయనటువంటి పనిని ఒక సంవత్సరంలోనే మా గౌరవ ముఖ్యమంత్రి, మా డెప్యూటీ ముఖ్యమంత్రి, మా మంత్రులు ఈనాడు అభివృద్ధిలో ఎంతో ముందుకు తీసుకుపోతున్నందుకు వారికి ఈ ప్రజాపాలన ద్వారా ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నాను. థాంక్యూ అధ్యక్ష.

మిస్టర్ స్పీకర్:- గౌరవ సభ్యులు శ్రీ గడ్డం వినోద్ గారూ...

శ్రీ గడ్డం వినోద్ (బెల్లంపల్లి):- అందరికీ నమస్కారం. ఈ అవకాశం ఇచ్చినందుకు చాలా Thanks Hon'ble Speaker గారు. ప్రత్యేకంగా ఈ హౌస్‌లో కొన్ని మాటలు చెప్పవలసిన అవసరం ఉంది. మన తెలంగాణ రావడానికి రకరకాల కారణాలున్నాయి. ప్రత్యేకంగా సోనియమ్మ తల్లి అనుమతితో డిసెంబర్ 9, 2009న చిదంబరం గారు తెలంగాణను డిక్లేర్ చేశారో, అందుకు స్వర్గీయ మా నాన్నగారు ప్రత్యేకంగా మేడంతో థాంక్యూ చెప్పి.., ఎందుకంటే వర్కింగ్ కమిటీలో చర్చించడం జరిగింది. తెలంగాణ సమస్య గురించి దాని గురించి టాపిక్ రాలేదు. ఆయన ప్రత్యేకంగా మన్మోహన్‌సింగ్ గారిని, సోనియమ్మ తల్లి పర్మిషన్ తీసుకొని మన తెలంగాణ గురించి మాట్లాడిన ఏకైక వ్యక్తి ఆ టైంలో పెద్దలు వెంకటస్వామి గారు. నేను ఈ మాట ఎందుకు చెబుతున్నానంటే చాలా మందికి తెలియదు అందుకే చెబుతున్నాను. రెండవ అంశం ఏమిటంటే, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసిన ఘనతకు మా ముఖ్యమంత్రి గారికి personal

congratulations, and congratulations to one and all. ఎందుకంటే, ఏ గవర్నమెంట్ నడిపించినా implementation అనేది చాలా important. ఆ implementation అయ్యేటప్పుడు కొన్ని జాగల్లో అవుతాయి, కొన్ని జాగల్లో కావు. ఎందుకంటే ప్రజాస్వామ్యము.. where it has to be treated in the right way. ఈ సమస్యలను గవర్నమెంట్ నుండి తీసుకున్న ప్రతి ఒక్క కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో ఎంత అయితే అంత పూర్తి చేయడానికి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయింది. ఇంకొక రెండు సంవత్సరాలలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు పూర్తి చేసే బాధ్యత ముఖ్యమంత్రి గారికి ఉంది, Cabinet colleaguesకు కూడా ఉంది. అందరూ ఇక్కడున్నది మాట్లాడుకోవడానికే. Everybody has a right to speak. But express what is possible. ఏది realistic గా అవుతుంది, ఏది practical గా అవుతుంది, ఏది implement అవుతుంది. దీనిని మనం సూచించి ముందుకు తీసుకొని వెళితే దానిని చాలా పెద్ద విలువ ఉంటుంది. ఈ రోజు సోనియమ్మ తల్లి బర్త్‌డే సందర్భంగా తెలంగాణ తల్లి గురించి మా ముఖ్యమంత్రి గారు పెట్టిన ప్రస్తావనను మీరందరూ అంగీకరించినందుకు, మాట్లాడేందుకు అవకాశం ఇచ్చిన తమరికి Thank you very much. Please attend in the evening.

మిస్టర్ స్పీకర్:- గౌరవ సభ్యులు డా. టి. రామ్మోహన్ రెడ్డి గారూ..,

డా. టి. రామ్మోహన్ రెడ్డి (పరిగి):- ధన్యవాదాలు అధ్యక్షా. ఈ రోజు డిసెంబర్ 9వ తేదీకి, మన తెలంగాణ రాష్ట్రానికి చాలా పెద్ద అవినాభావ సంబంధం ఉంది. తెలంగాణ రాష్ట్రసాధనలో చిదంబరం గారి ద్వారా తెలంగాణ రాష్ట్రప్రక్రియ ప్రారంభం అయ్యింది అన్న స్క్రోలింగ్ ఉద్యమ సమయంలో చూసినప్పుడు ఎవరి ఇండ్లలో ఎక్కడున్నా సరే ఆ స్క్రోలింగ్ గురించే చర్చ జరిగింది. ఆ స్క్రోలింగ్ రాగానే మీకు తెలుసు, నేను పరిగి నుండి పెద్దఎత్తున కార్యకర్తలందరినీ కర్ణాటక బార్డర్‌కి తీసుకెళ్ళి చించోలీ అనే ప్రాంతం దగ్గర లారీలు వస్తుంటే, అక్కడ ఒక బోర్డు పాతించాము. తెలంగాణ రాష్ట్రానికి స్వాగతం అని బోర్డు పాతించడం జరిగింది. అక్కడ తాండూరులో కూడా మీ అందరికీ తెలుసు, సర్దార్ వాళ్ళందరూ కూడా చాలా మంది ఆ ప్రోగ్రాంకు వచ్చారు. బోర్డు పాతించి అన్ని బండ్లకు టి.జి. అని వ్రాయించాము. తాండూరులో ఎంట్రీ కర్ణాటక నుండి వచ్చినప్పుడు వ్రాయించాము అధ్యక్ష, అట్లా మన గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు తెలంగాణ రాష్ట్ర సాధనలో మనం పడిన కష్టాలు, ఇబ్బందులు మన తల్లులు మనకు ఏ విధంగా ప్రోత్సాహం ఇచ్చారో ఉద్యమ సమయంలో పోతున్నామంటే, అలాంటి తల్లి ప్రతీకగా ఉండాలి. నేను చిన్నప్పటి నుండి మా శివారెడ్డి పల్లి, పరిగి, రంగారెడ్డి జిల్లా ఎక్కడ చూసినా సరే మహిళలు ఎలా ఉంటారని గమనిస్తుంటే తెలంగాణ తల్లి రూపమే నాకు స్ఫురిస్తుంది. ఆ యొక్కవచ్చని చీర గాని, గాజులు గాని, ఒక తల్లి తన బిడ్డలకు ఏ విధంగా ధైర్యం నూరిపోస్తుందో, ఆ విధంగా పిడికిలి బిగించి ఉండడం గాని, ఒక సహజసిద్ధమైన సగటు మహిళగా. చిన్నప్పుడు ఆకలైతే అమ్మ అడుగుతుండే, అన్నం తిన్నావా అని అడుగుతుండే. అట్లాంటి అమ్మ మనం రోజు సెక్రటేరియట్‌కు వచ్చేటప్పుడు చూసే విధంగా అదేవిధంగా జిల్లాల్లో అన్ని కార్యాలయాల్లో పెట్టే విధంగా మన కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత నిర్ణయం తీసుకున్నందుకు.., అది కూడా మనం ఒక సంవత్సర కాలం పాలన పూర్తి చేసుకున్నాము. ఈ సందర్భంగా ఈ రోజు ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమం పెట్టుకోవడం చాలా సంతోషంగా ఉంది.

తెలంగాణ ఉద్యమ సమయం లోపల మా దగ్గర గండీడ్ మండలం ఆశిరెడ్డి పల్లి అనే గ్రామంలో ఉప్పరి రమేష్ అనే 10వ తరగతి విద్యార్థి.. చాలా మంది యువకులు ఆత్మహత్యలు చేసుకున్నది గమనించి, నేను కూడా చనిపోతే తెలంగాణ రాష్ట్రం వస్తుందేమో అన్న ఉద్దేశంతో అతను ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. నేను 2014లో శాసన సభ్యుడిని కాగానే అతని కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చే విధంగా కూడా కృషి చేశాను. ఈ విధంగా ఉద్యమం జరుగుతున్న సమయంలో నేను పరిగిలో, పరిగి బస్టాండ్ ముందు పచ్చి మంచి నీళ్ళు తీసుకోకుండా 23.01.2014 నుండి 26.01.2014 వరకు ఆమరణ

నిరహార దీక్ష చేశాను. దానితోపాటు బార్ కౌన్సిల్ అధ్యక్షుడు వరిగి ఆనంద్ గౌడ్ గారు, ఫిరంగి నారాయణ రెడ్డి అనే ఒక రైతు నాయకుడు .. మేమంతా కూడా 3 రోజులు పచ్చి మంచినీళ్ళు తీసుకోకుండా ఆమరణ నిరహార దీక్ష చేస్తే, నన్ను పోలీసులు అరెస్ట్ చేసి నిమ్స్ ఆసుపత్రిలో అడ్మిట్ చేయడం జరిగింది. నాకు అక్కడ డాక్టర్లు ఏం చేప్పారంటే, ఇంకొక రోజు ఆలస్యమైతే నీ కిడ్నీలు పాడైపోయేవని డాక్టర్లు చెప్పారు. ఇలాంటి ఉద్యమాలన్ని చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకొని 2014లో శాసన సభ్యుడినై, మళ్ళీ ఈరోజు గత శాసన సభలో ఏ memories రావాలని అనుకున్నామో అవి రాని సందర్భంలో గౌరవ ముఖ్యమంత్రి గారు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత రేవంత్ రెడ్డి గారి ఆలోచన విధానంతో మేధావులను, కవులను అనునిత్యం సంప్రదించి మన తెలంగాణ సంప్రదాయాల ప్రకారం ఈరోజు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఈ రోజు ఆవిష్కరిస్తున్నందుకు వారికి ధన్యవాదాలు తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను.

1.00 మ. (గౌరవ ప్యానెల్ స్పీకర్ శ్రీ రేవూరి ప్రకాష్ రెడ్డి అధ్యక్ష స్థానం వహించారు)

శ్రీ జూపల్లి కృష్ణారావు(గౌరవ మద్యపాన నిషేధం మరియు ఆబ్కారీ శాఖ, పర్యాటక, సాంస్కృతిక మరియు పురావస్తు శాఖామాత్యులు):- అధ్యక్షా, ఆరు దశాబ్దాల కలను సాకారం చేసిన సోనియాగాంధీ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసుకుంటున్నాను. గడిచిన దశాబ్దాల నుంచి చాలా చూస్తున్నాము. ఏ రాజకీయ పార్టీలు నిర్ణయాలు తీసుకున్నా రాజకీయ కోణంలో తీసుకోవడం మనం చూశాము. కానీ ఈ తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి తెలంగాణ రాష్ట్రం బిల్లు పాస్ చేస్తే అటు సీమాంధ్రలో, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి నష్టం జరుగుతుందని తెలిసి కూడా పెద్ద మనస్సుతో తెలంగాణ ఇచ్చారు. ఎందుకంటే అధ్యక్షా, వందలాది మంది బిడ్డల ప్రాణత్యాగాలు, ఆ తల్లుల కడుపుకోత ఎలా ఉంటుందో కన్న తల్లి సోనియా గాంధీ గారు తల్లిగా ఆలోచించి నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష, ఆరు దశాబ్దాల కలను నెరవేర్చడం జరిగింది. గౌరవ సభ్యులు మాట్లాడేటప్పుడు నేను విన్నాను కాబట్టి చెబుతున్నాను. బీజేపీ సభ్యులు ఇక్కడ గమనించవల్సింది ఏంటంటే ఇంత గొప్ప నిర్ణయం తీసుకోవడానికి గతంలో బీజేపీకి కూడా అవకాశం వచ్చింది. ఆనాడు రెండు, మూడు రాష్ట్రాలు ఏర్పాటైన సందర్భంలో తెలంగాణ రాష్ట్ర ఉద్యమం అన్ని రాష్ట్రాలకంటే ఎక్కువగా ఉండేది. అయినా కూడా కల నెరవేరలేదు. అందుకే అధ్యక్షా, ఈ నిర్ణయం అనేది చిన్న నిర్ణయం కాదు. తెలంగాణ రాష్ట్రప్రజలు తెలంగాణ రాష్ట్రం ఉన్నంత వరకు మరచిపోలేరు.

రెండవది, అభివృద్ధి విషయాన్ని కూడా ప్రస్తావించడం జరిగింది. ఈ రోజు తెలంగాణ రాష్ట్రం రాకుండా ఉండి ఉంటే, లక్షలాది మంది ప్రజలకు అందుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దొరికేవా అధ్యక్షా. ఇక్కడ అభివృద్ధంటే భౌతికంగా కట్టడాలు ఒకటే కాదు, తర తరాల నుంచి వెనకబడిన అన్ని వర్గాల ప్రజలకు కూడా ఈనాడు లబ్ధి జరుగుతుంది. కేవలం తెలంగాణ రాష్ట్రం సాకారం అయింది కాబట్టే మన నిధులు మనం ఖర్చు పెట్టుకుంటున్నాము. ఇంతకు ముందు కౌన్సిల్‌కు కూడా వెళ్ళి రావడం జరిగింది అధ్యక్షా. కౌన్సిల్‌లో కూడా అన్ని పార్టీల వాళ్ళు కూడా ఈ యొక్క గౌరవ ముఖ్యమంత్రి, ఈ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అన్ని పార్టీల వాళ్ళు కూడా ఏకాభిప్రాయంతో ఆమోదించడం జరిగింది. ప్రభుత్వాన్ని అభినందించడం కూడా జరిగింది కాబట్టి మిగతా అంశాల్లోకి వెళ్ళకుండా అందరం కూడా మరొకసారి ఈ ప్రభుత్వాన్ని అభినందించాలని మనవి చేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను. థ్యాంక్యూ అధ్యక్షా.

శ్రీ మందుల సామేల్ (తుంగతుర్తి):- అధ్యక్షా, నాకు మాట్లాడటానికి అవకాశం ఇచ్చినందుకు మీకు హృదయ పూర్వకకృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈనాడు ఫాసిస్ట్ పాలన పోయి ప్రజాపాలన వచ్చి ఒక్క సంవత్సరం పూర్తైన సందర్భంగా నా తుంగతుర్తి నియోజకవర్గ ప్రజలకు, నాకు ఓట్లు వేసి గెలిపించిన నా పోరాట బిడ్డలందరికీ కూడా శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. తెలంగాణ రాష్ట్రఏర్పాటుకు అరవై సంవత్సరాలు సుదీర్ఘమైన పోరాటం చేశారు. 1956లో ఆంధ్ర తెలంగాణ కలిసిన నాడే మీకు మాకు పొత్తు కుదరదని ఆనాడే వేలాది మంది రోడ్ల మీదకు వచ్చి మా తెలంగాణ మాకు కావాలని, మా సంస్కృతి మాకు కావాలని, మా బ్రతుకులు మావి, మా యాస మాది, మా భాష మాది అని ఆనాడు నినదించారు. అది అప్పటి నుండి అక్కడ ఉన్న ఆంధ్ర

పాలకులు తెలంగాణను ఏ విధంగా అణచాలని ప్రయత్నం చేసినా కూడా తెలంగాణ ప్రజానీకం ఏనాడు వెనక్కి తగ్గలేదు. మా పోరాటాన్ని ఆపామని వేలాది మంది అమరులయ్యారు. దానికి చిహ్నమే తెలంగాణ సాయుధ పోరాటం. ఆ పోరాట స్మృతులే ఈ రోజు తెలంగాణ పోరాటానికి సంకేతాలు పంపించాయని నేను జ్ఞాపకం చేస్తున్నాను.

అధ్యక్షా, ఈ రోజు గౌరవనీయులు శ్రీమతి సోనియాగాంధీ గారి పుట్టిన రోజు సందర్భంగా వారికి నేను మా పక్షాన, మా నియోజకవర్గ ప్రజల పక్షాన జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. అదే విధంగా తెలంగాణ తల్లిని మార్చారు అంటారు, మార్చుడు ఎక్కడిది, తీసుడు ఎక్కడిది? వాళ్ళేదో వాళ్ళ కోసం ఆ బొమ్మను పెట్టుకున్నారు. కాబట్టి అది మార్చింది కాదు. నిజంగా వాళ్ళకే కనుక చిత్తశుద్ధి ఉంటే ఆనాడే అది గెజిట్ అయ్యేది. చట్టమయ్యేది. ఆ చట్టం లేదు, చుట్టం లేదు, ఏది లేదు, ఎక్కడ లేదు. ఈ రోజు ప్రజా పాలన వచ్చిన తరువాత తెలంగాణకు ప్రత్యేకమైన తెలంగాణ తల్లి ఉండాలి, ఆ రూపం నిండు తెలంగాణ తల్లిలా ఉండాలని గౌరవనీయులు మన ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు మేధావులను, రచయితలను, కళాకారులందరిని కూర్చోబెట్టి ఏ రూపమైతే తెలంగాణ తల్లి రూపమొస్తుందని ఆలోచించి రూపం తయారు చేసి ఆవిష్కరించుకునే అవకాశం వచ్చింది. నిజంగా వాళ్ళకు తెలంగాణ మీద ప్రేముంటే ..., ఎందుకు ఉంటది వాళ్ళకు ..., ఎప్పుడైతే 'టిఆర్ఎస్' నుండి 'బిఆర్ఎస్'కు మార్చారో వాళ్ళ పని గోవింద మంగళమైంది. ఎక్కడ ఉంటది ఇక? 'టిఆర్ఎస్' అనేది ఒక ఉద్యమ పార్టీ కాబట్టి ఆయాల అందరం ఉన్నాము. ఆ పార్టీలో తెలంగాణ రావాలని వేలాది మంది అమరవీరులు త్యాగం చేశారు. కానీ వాళ్ళకు ఆ సోయి లేదు ఏమి లేదు. కానీ మా నియోజకవర్గానికి, నా మండలానికి సంబంధించిన కాసోజు శ్రీకాంతాచారి తెలంగాణ రావాలని నవంబర్ 29, 2009 నాడు చెప్పి పెట్రోల్ పోసుకొని డిసెంబర్ 3, 2009వ తారీఖున అమరుడయ్యాడు. ఆ తరువాత వేణుగోపాల్ రెడ్డి, యాదయ్య డిసెంబర్ 8వ తారీఖు లోపు తెలంగాణ కోసం పటా పటా ఎగిరిపోయారు. అప్పుడు సోనియాగాంధీ గారు... పిల్లలు చనిపోతున్నారు, మనం తప్పకుండా తెలంగాణ ఇవ్వాలని డిసెంబర్ 9న పార్లమెంట్‌లో ప్రకటన చేయడం జరిగింది. ఆ సందర్భంగా తెలంగాణ పండుగ చేసుకుంది. ఆ తరువాత కొన్ని కారణాల వల్ల కొంచెం లేటైంది. కానీ తెలంగాణను ఇచ్చిన సోనియాగాంధీ ఈ తెలంగాణ ఇస్తే ఇక్కడ బడుగు, బలహీన వర్గాలు కూడా ఒక ఆత్మగౌరవంతో, రాజకీయంగా, సామాజికంగా నిలదొక్కుకుంటారని ఇస్తే పది సంవత్సరాలు పరిపాలన చేశారు. ఉన్న కాడికి మేశారు. ప్రాజెక్టులు కూలకొట్టారు. అన్ని అయిపోయాయి, శుభ్రమై పోయింది, ఇప్పుడు అక్కడ కూడా లేకుండా పోయి ఇళ్ళలో కూర్చొన్నారు.

అధ్యక్షా, ఈ రోజు ఈ తెలంగాణ తల్లి విగ్రహ అవిష్కరణ. 'జయ జయ హే తెలంగాణ, జననీ జయ కేతనం' పాటను వాళ్ళు లోపల లోపల పాడుకున్నారు కానీ పిల్లలు స్కూల్స్‌లో సొంతంగా పాడుకోండి అని ప్రభుత్వ గెజిట్ చేసి చెప్పలేదు. ఆ పాట ఒక షెడ్యూల్ట్ క్యాస్టు వాడు రాసాడు కాబట్టి ఆ పాటను పెట్టవద్దనే దుర్మార్గమైన సంకల్పం ఉంది కాబట్టి ఆ పాటను తీసుకురాలేదు. ఈ రోజు కూడా సామాజికంగా అందరినీ గౌరవించాలి. ఏ పాటైనా గానీ, జ్ఞానం ఎవరికి లేదు, జ్ఞానమనేది ఎవరి సొత్తు కాదు, అందరికి ఉంటుందనేది మన ముఖ్యమంత్రి గారు, మన మంత్రివర్గం ఆలోచించి, మన ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ పాటను గెజిట్ చేసి, ప్రభుత్వ పరంగా చట్టం చేసి ఆ పాటను పెట్టడం జరిగింది. దానికి నేను ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. 'పాడుస్తున్న పాద్దు మీద నడుస్తున్న కాలమా, పోరు తెలంగాణమా' 'మా భూములు మాకేనని మర్లబడ్డ గానమా, తిరగ బడ్డ రాగమా' ఈ ఒక్క పాటతోని ఉవ్వెత్తున తెలంగాణ ఉద్యమం లేచింది. సకల జనుల సమ్మె, రాస్తా రోకోలు, వంట-వార్పు వంటివి చేశారు. ఏ ఒక్కరు కొట్లాడితే వచ్చింది కాదు ఈ తెలంగాణ. మేము తెచ్చాము, మా కుటుంబం తెచ్చింది, మేమే ఉన్నామంటే కాదది, శ్రమ జీవులు రోడ్ల మీదకు వచ్చారు. విద్యార్థులు రోడ్ల మీదకు వచ్చారు, ఆర్టీసి కార్మికులు, సింగరేణి కార్మికులు, సబ్బండ వర్గాలు అందరూ కలిసి తెలంగాణను సాధించుకున్నారు. అలా సాధించుకున్న తెలంగాణలో మేమే, మా కుటుంబమే

అనుకుంటే ప్రజలు 2023లో దానికి సమాధానం చెప్పారు. అందుకోసమే మీకేమున్న గౌరవం ఉంటే, మీకేమున్న తెలంగాణ ప్రజల మీద ఆలోచన ఉంటే మేము పోయినాము, పోతే పోయినాము, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది, వాళ్ళు ఒక రూపాన్ని తయారు చేశారు, వాళ్ళు ఒక తెలంగాణ తల్లిని తయారు చేశారు, మనం చట్టాన్ని చేయలేకపోయాము, మరి చట్టం చేశారు కాబట్టి మనం కూడా గౌరవించాలని ఉంటే అక్కడికి వచ్చి అటెండ్ కావాలి.

అధ్యక్షా, 'జయ జయ హే తెలంగాణ' పాట .. నేను తెలంగాణ ఉద్యమంలో ఉన్నప్పుడు ఆ ఎర్ర బస్సుకు 'టి.జి' అని రాసినందుకు నన్ను మోత్కూర్‌లో అరెస్ట్ చేశారు. దానికి నేనే ప్రత్యక్ష సాక్షిని. అధ్యక్షా, ఈ రోజు సాయంత్రం గం.6.05 లకు జరగాల్సిన తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు గౌరవనీయులు రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు, రాష్ట్ర మంత్రి వర్గం నిర్దేశించిన టైం ప్రకారం అందరూ కూడా వచ్చి అక్కడ హాజరై ఈ పండుగను జయప్రదం చేయాలని తమరి ద్వారా ప్రజానీకానికి విజ్ఞప్తి చేస్తున్నాను. ధన్యవాదాలు అధ్యక్షా.

శ్రీ కె. మదన్‌మోహన్ రావు (ఎల్లారెడ్డి):- అధ్యక్షా, ఈ రోజు తెలంగాణకు శుభదినం. ఈ సభలో గౌరవ ముఖ్యమంత్రి గారు తెలంగాణ తల్లికి సంబంధించి చేసిన ప్రకటనను నేను సమర్థిస్తున్నాను. తెలంగాణ అనేది పోరు గడ్డ. ఎంతో మంది రాజులు, రాజ్యాలు అధికారంలో ఉన్నప్పుడు విగ్రహాన్ని పెట్టారు. విగ్రహం అనేది ఆ సంస్కృతి, ఆ కల్చర్‌కు ప్రతిబింబం. మరి ఏదైనా కల్చర్‌లో ఏ రెవల్యూషన్ చూసినా కానీ వాళ్ళు ఒక విగ్రహాన్ని పెట్టుకుంటారు. మరి ఈ రోజు పేద తెలంగాణ కల్చర్, సంస్కృతిని ప్రతిబింబించే విధంగా తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేలాగా విగ్రహాన్ని పెట్టుకోవడం జరుగుతుంది. చాలా పేద నియోజకవర్గమైన నా ఎల్లారెడ్డి నియోజకవర్గం నుండి కూడా ఈ విగ్రహాన్ని పెడుతున్నందుకు చాలా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాను. నా తరఫున అందరికి ధన్యవాదాలు అధ్యక్షా.

1.10 మ. **శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి** (మహబూబ్‌నగర్):- అధ్యక్షా, "జనీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ".. ఈ మాటలు శ్రీరామచంద్రుడు తన సోదరుడు లక్ష్మణుడితో అన్నారు. కన్నతల్లి, పుట్టిన భూమి స్వర్గం కంటే గొప్పవి. ఆ స్వర్గంలో ఉండే దేవతా విగ్రహాన్ని పెట్టుకొని ఇన్నాళ్లు దాన్నే పూజించమని కేసీఆర్‌గారు చెప్పారు. కానీ ఆ దేవత కంటే తల్లి గొప్పదని చెప్పి నాలుగు కోట్ల మంది తెలంగాణ ప్రజల ఆంకాక్షను మా ముఖ్యమంత్రిగారు మరియు మంత్రివర్గం దానిని ఈ రోజు నిజం చేస్తూ తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయం ముందు సగర్వంగా ఆవిష్కరణ చేస్తున్న శుభసందర్భంలో తెలంగాణ ప్రజల తరపున వారందరికి ధన్యవాదాలు, శుభాకాంక్షలు తెలుపుతున్నాను.

ఉద్యమ కాలంలో ఆదిలాబాద్ జోడేఘాట్‌కి మేము వెళ్లాము. కొమరం భీమ్ జన్మదినోత్సవం సందర్భంగా ఆరోజు అక్కడకు వెళితే ఆలస్యమైయి చీకటి పడుతుంటే మేము మా మిత్రులమంతా కలిసి ఒక గోండు గూడేనికి వెళితే మట్టిగాజుల వేసుకున్న ఒకగోండు మాతృమూర్తి ఆరోజు మాకు అన్నం పెట్టింది. ఆ గోండు తల్లి రూపమే ఈ రోజు తెలంగాణ సచివాలయం ముందు ఆవిష్కరణ చేసుకుంటున్నాము. ఇంకో గుర్తు.. కరీంనగర్‌లో ఆరోజు రహదారిని దిగ్భందం చేయాలని పిలిపిస్తే వేల మంది అప్పుడు వంటావార్పు చేసుకుంటే మట్టి పిసికే ఒక తల్లి ఆరోజు మాకు అన్నం పెట్టింది. ఆ మాతృ మూర్తి రూపమే నేడు మన సచివాలయం ముందు ఆవిష్కరణ చేసుకుంటున్నాము. సబ్బండ వర్ణాలు ఆ తల్లుల సేవ, ఆ తల్లులు మా వెంబడి నిలబడి ముందుకు నడిపిన తీరు వేలాది శిబిరాలలో మా పక్కన కూర్చొని పిడికిలి ఎత్తిన ఆరోజులు నేడు గుర్తుకు వస్తున్నాయంటే పది సంవత్సరాల పాటు వాటిని మరుగున పడేయాలని దుష్టశక్తులు ఒక రాజకీయ క్రీడలో భాగంగా ఆ పనిని చేస్తున్నాయి. తెలంగాణ ప్రజలు మీ ద్వారా వారు వినాలని నేను ఒక్క మాట చెబుతున్నాను. సింహం రాయడం నేర్చుకోలేనంతవరకు తోడేళ్లదే, వేటగాళ్లదే చరిత్ర అవుతుంది. ఈ పది సంవత్సరాల కాలంలో తోడేళ్ల, వేటగాళ్ల చరిత్రనే మన మెదళ్లల్లోకి ఎక్కించే ప్రయత్నం గత పాలకులు చేశారు. కానీ నేడు సింహాల చరిత్రను తెలంగాణకు తెలియజేయాలని గౌరవ ముఖ్యమంత్రిగారు కంకణం కట్టుకున్నారు. ఎవరు ఆ సింహాలు... ఉద్యమ సింహాలు..

ఉద్యమాన్ని చేసిన సింహాలు.. మన విద్యార్థి నాయకులు, మన విద్యార్థులు, మన ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు, సబ్బండవర్ణాలు.. అందుకే నేడు నీలి వర్ణంలో ఒక పీఠం పెట్టుకున్నాము. ఆ సింహాల గుర్తుగా ప్రాణత్యాగం చేసిన యోధులకు గుర్తుగా ఆ ఉద్యమాలు పోరాటాలు, ఆమరుల బలిదానం దానికి సంకేతంగా పీఠంలో బిగించిన పిడికిళ్లను పొందుపరచుకోవడం జరిగింది. పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని సగర్వంగా వీళ్లు రాష్ట్రానికి భాగస్వాములేనని చెప్పే ఒక ఉదాహరణగా నేడు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరణ చేసుకుంటున్నాము.

అందుకే ఆకు పచ్చని చీరలో మట్టి గాజులతో, సమస్తం అణువణువునా తెలంగాణ తల్లి మాతృ రూపాన్ని మన కళ్ల ముందు ఈరోజు ఏర్పాటు చేసుకుంటుంటే చూడలేని ప్రతిపక్ష నాయకులు కడుపులో మంట పెట్టుకొని మరీ ముఖ్యంగా బిఆర్ఎస్ పార్టీకి చెందిన వాళ్లు ఈరోజు సభకు రాకపోవడమనేది చాలా శోచనీయమైనదిగా తెలంగాణ ప్రజలు గమనించాలి. వాళ్ల చరిత్ర చెబుతుంటే సంకలు గుద్దుకుంటారు, వాళ్లచరిత్ర గురించి బట్రాజులు పొగుడ్తుంటే ఆహా, ఓహో అనిపించుకుంటారు కానీ ఈరోజు నిజమైన తెలంగాణ చరిత్రను ఈ శాసనసభ వేదికగా రాస్తుంటే, ఒక రాష్ట్రగీతాన్ని ఇక్కడ చర్చించి ఆమోదం తెలుపుతుంటే, కోట్ల మంది తెలంగాణవాసులు అంటే చిన్న పిల్లలతో సహా విద్యాలయాల్లో ఆ పాట పాడుతుంటే భరించలేని కొంతమంది ఈరోజు ఆ ప్రతిపక్ష స్థానంలోకి కూడా రాకుండా ఈ సభను బాయికాట్ చేయడమంటే తెలంగాణ చరిత్రను మలినం చేసినవాళ్లు అవుతారు. కాబట్టి అలాంటి వాళ్లను తెలంగాణ జాతి క్షమించదు. ఇటువంటి మహత్తరమైన కార్యక్రమానికి పూనుకుంటున్న మా కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కార్యక్రమానికి స్ఫూర్తిదాయకమైన తన నిర్ణయంతో ఈరోజు తెలంగాణ ప్రజలు స్వేచ్ఛావాయువులు పీల్చుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆ తల్లికి కూడా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ తెలంగాణ జాతి ఉన్నంతవరకు సోనియాగాంధీ గారు ఈ రాష్ట్రానికి కలిగించిన ప్రయోజనం, ఈ రాష్ట్ర సాధనలో వారు తీసుకున్న నిర్ణయాన్ని కొనియాడుతూ.. మా పొన్నం ప్రభాకర్ గారు ఎప్పుడూ ఒక మాట అంటారు. సోనియాగాంధీ గారిని మనం తల్చుకుంటాం, సోనియాగాంధీ గారు మనగుండెల్లో ఉంటారు కానీ తెలంగాణకు తన వంతు సహాయం అందించిన మా చిన్నమ్మ (సుష్మాస్వరాజ్)ను కూడా తల్చుకోవాలని ప్రభాకర్ గారు ఎప్పుడూ అంటుంటారు....అది మా కాంగ్రెస్ నాయకుల విశాలమైనహృదయం అని చెప్పవచ్చు. తెలంగాణ తల్లి గురించి మాట్లాడుతుంటే విని తట్టుకోలేని వ్యక్తులు ఈరోజు సభలో లేరు కానీ మా కాంగ్రెస్ ప్రభుత్వం, మా కాంగ్రెస్ నాయకులు మాత్రం తెలంగాణ గురించి శ్రమపడిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపడంలో ఎటువంటి సంకోచం లేకుండా మనస్ఫూర్తిగా వాళ్లకు కృతజ్ఞతలు తెలియజేస్తుంది. ఈ సభ కూడా ఆ విధంగానే నడుపబడుతుందని తెలియజేసుకుంటూ, నాకు మాట్లాడే అవకాశమిచ్చినందుకు మీకు ధన్యవాదాలు తెలుపుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ మల్‌రెడ్డి రంగా రెడ్డి:- అధ్యక్షా, ఈరోజు రాష్ట్ర శాసనసభలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు మీద మనం చర్చించుకుంటున్న సందర్భంలో తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల యొక్క సాంప్రదాయాలు, తెలంగాణ ఉద్యమం అంటే ఆనాటి ఉద్యమ కాలంలో తెలంగాణ రాష్ట్రంలో సకలజనులు అంటే కవులు, కళాకారులు, సబ్బండ వర్గాలను ఐక్యం చేసిందే తెలంగాణ తల్లి. కానీ అలాంటి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఇప్పటివరకు తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటు చేయకపోవడం విచారకరమైన విషయం. కానీ ఈ రోజు మన ప్రభుత్వం, మన ముఖ్యమంత్రి, మంత్రివర్గం అంతా ఒక నిర్ణయం తీసుకొని తెలంగాణా తల్లిని తెలంగాణ ప్రజల యొక్క ఆశయాలను,ఆకాంక్షలను ప్రతిబింబించే విధంగా ఈరోజు రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటున్నాము.

పది సంవత్సరాలు తెలంగాణ రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేసిన వ్యక్తులు, తెలంగాణ రాష్ట్రాన్ని నిండుగా దోచిన వ్యక్తులు మాట్లాడుతున్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియాగాంధీ గారి జన్మదినం ఈ రోజు

జరుపుకుంటున్నాము, మనమందరం ఆమెకు శుభాకాంక్షలు చెబుతున్నాము. తెలంగాణ రాష్ట్రంలో ఆనాడు ఉన్నటువంటి పరిస్థితులు, తెలంగాణ వస్తేనే తెలంగాణ ప్రజల యొక్క ఆశయాలు, ఆకాంక్షలు నెరవేరుతాయని ఆనాడు శ్రీమతి సోనియా గాంధీ గారు భావించి తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇస్తే ఈ రోజు ప్రతిపక్ష నాయకులు మొహం చాటేసి పది సంవత్సరాలు పాలించి, ఏడు లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసి తెలంగాణ ప్రజల నెత్తిన పెట్టి వారికి కనీసం తెలంగాణ తల్లి రూపాన్ని కూడా ఇవ్వలేని దుర్మార్గులు ఈ రోజు మాట్లాడుతున్నారు. అందుకే ఈ రోజు మన ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి తెలంగాణ ప్రజల పక్షాన ప్రభుత్వానికి హృదయపూర్వకంగా అభినందనలు తెలియజేస్తున్నాను.

ఈ రోజు తెలంగాణ తల్లి విగ్రహాన్ని మన రాష్ట్ర పరిపాలన కేంద్రమైన సచివాలయంలో ఏర్పాటు చేస్తుంటే కొంతమందికి నిజంగా గిట్టకపోవచ్చు. మేమెందుకు పెట్టలేకపోయాము, మేము కూర్చోడానికి బ్రహ్మాండంగా చేసుకున్నాము. కానీ తెలంగాణ కోసం అందరినీ ఏకం చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయలేదంటే దాని గురించి తెలంగాణ ప్రజలు తప్పకుండా ఆలోచిస్తారు. అందుకే వారి సీట్లు కూడా ఖాళీ అయ్యాయి. కాబట్టి ఈ రోజు తెలంగాణ తల్లిని ఆవిష్కరిస్తున్న సందర్భంగా తెలంగాణ ప్రజలకు శుభాకాంక్షలు.

1.20 మ. శ్రీ రామ్‌రావ్ పవార్:- నాకు మాట్లాడేందుకు అవకాశం ఇచ్చిన అధ్యక్షుల వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలతో, తెలంగాణ ఏర్పడిన పది సంవత్సరాల తరువాత తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న దానికి ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. సోనియాగాంధీ అధ్యక్షతన పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లును ప్రవేశపెట్టడం వల్ల తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని చెబుతున్న నాయకులకు ఒక విజ్ఞప్తి చేస్తున్నాను. పార్లమెంట్‌లో ఒక కాంగ్రెస్ పార్టీ మద్దతుతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అప్పుడు కష్టంగా ఉండింది. ఆరోజు ప్రతిపక్ష నాయకురాలిగా స్వర్గీయ శ్రీమతి సుష్మాస్వరాజ్ గారు యునానిమస్‌గా తెలంగాణ కోసం సంతకం చేయడం జరిగింది. కానీ, ఈరోజు దురదృష్టం ఏమిటంటే, గౌరవ ముఖ్యమంత్రి గారు సోనియాగాంధీ గారి పేరు తీసుకున్నారు గానీ, మన చిన్నమ్మ సుష్మాస్వరాజ్ గారి పేరు చెప్పడం లేదు. ఈరోజు మంచి శుభదినం, తెలంగాణ వచ్చిన రోజు. కానీ, ఈరోజు శాసనసభలో చర్చిస్తున్న అంశాల్ని నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలు చూస్తున్నారు. గత ప్రభుత్వం చేయలేదు, ఈ ప్రభుత్వం చేయలేదు. ఆ తప్పు చేశారు, ఈ తప్పు చేశారని మాట్లాడుతున్న విషయాలన్నీ నాలుగు కోట్ల ప్రజలు గమనిస్తున్నారు. ప్రొటోకాల్‌కి సంబంధించి నా తోటి సోదరులు చెప్పారు. శాసనసభ వ్యవహారాల మంత్రివర్యులు మాట్లాడుతూ మమ్మల్ని కూడా అవమానపరిచారని చెప్పారు. అలా చేసుకొంటూ పోతే తెలంగాణ ప్రగతి కాదు. గత ప్రభుత్వం ఏవైతే తప్పులు చేసిందో, అవే తప్పులు వారు కూడా చేస్తే తెలంగాణ అభివృద్ధిలోకి రాదని సభాముఖంగా అందరికీ తెలియజేస్తున్నాను.

అదేవిధంగా మా సీతక్క గారు ఇప్పుడే చెప్పారు. నియోజకవర్గాల అభివృద్ధి కొరకు మేము నిధులు కేటాయించడం జరుగుతుందని అన్నారు. మేము 2.5 లక్షల మంది ఓటర్లతో ఎమ్మెల్యేగా గెలిచాము. సీతక్క గానీ, ఇతర మంత్రివర్యులు గానీ, మా నియోజకవర్గాల అభివృద్ధి కొరకు కూడా నిధులు కేటాయిస్తే మీకు కూడా గౌరవం ఉంటుంది, మాకు కూడా గౌరవంగా ఉంటుందని తెలియజేస్తున్నాను. కానీ, నియోజకవర్గాల్లో ఓడిపోయిన శాసనసభ్యులతో ప్రభుత్వం ఏదైతే చేస్తున్నదో అది చాలా తప్పు. పాత ప్రభుత్వం చేసిందని, ఈ ప్రభుత్వం కూడా చేస్తే బాగుండదని ఈ సభాముఖంగా తెలియజేస్తున్నాను.

అదేవిధంగా ఈరోజు తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ గురించి చాలా మంచిగా మాట్లాడారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎవరైతే రూపకల్పన చేశారో వారికి భారతీయ జనతా పార్టీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

(గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

శ్రీ ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి (గౌరవ నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి, ఆహారం మరియు పౌరసరఫరాల శాఖామాత్యులు):- అధ్యక్షా, నాకు మాట్లాడేందుకు అవకాశం ఇచ్చినందుకు

దన్యవాదాలు. ముఖ్యమంత్రి గారి ప్రకటనను నేను స్వాగతిస్తున్నాను, హర్షిస్తున్నాను. డిసెంబర్ తొమ్మిదవ తేదీ తెలంగాణ చరిత్రలో ఎప్పుడూ It will always have an important place in the history of Telangana. ఇందులో చాలామందికి గుర్తుందో, లేదో ఆనాడు చిదంబరం గారు రాత్రి 11 గంటలకు స్టేట్‌మెంట్ ఇచ్చి చాలా స్పష్టంగా The Central Government is initiating the process of creation of separate Telangana State అని ఆ రాత్రి చిదంబరం గారి స్టేట్‌మెంట్ తరువాత యావత్ తెలంగాణలో there were celebrations throughout the night. ఆ ప్రకటనకి, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకి ఈ రాష్ట్రం, ఈ రాష్ట్రప్రజలు ఎప్పుడు కూడా సోనియాగాంధీ గారికి కృతజ్ఞతతో ఉంటారని నేను మనవి చేస్తున్నాను.

ఈరోజు సోనియాగాంధీ గారి జన్మదినం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ చేస్తుండటంతో ఈరోజు నుండి ప్రతి డిసెంబర్ తొమ్మిదవ తేదిన ఈ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా జరుపుకోవాలని అనుకోవడం ఎంతో అభినందనీయం. నా సహచర మంత్రివర్యులు సూచించినట్లుగా రాష్ట్ర వ్యాప్తంగా, జిల్లా కార్యాలయాల్లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకొని ప్రతి సంవత్సరం డిసెంబర్ 9వ తేదీన ఈ ఉత్సవాలు జరుపుకోవడం చాలా అభినందనీయం. తెలంగాణ ఏవిధంగా ఏర్పడిందో ప్రతి సంవత్సరం తెలంగాణ ప్రజలకు గుర్తు చేస్తున్నట్లుగా ఉంటుందని నేను మనవి చేస్తున్నాను.

మీద్వారా తెలంగాణ ప్రజలకి రెండు, మూడు అంశాలు ఈ సందర్భంగా గుర్తు చేయాలని అనుకుంటున్నాను. డిసెంబర్ 9వ తేదీ సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా వారి హయాంలో యుపిఏ చైర్‌పర్సన్‌గా కొన్ని Historic Legislations పాస్ అయ్యాయి. MGNREGS, Food Security, Right to Education, Right to Information గానీ, సోనియాగాంధీ గారి నాయకత్వంలోని National Advisory Council యొక్క సలహా మేరకు ఆరోజు యూపీఏ ప్రభుత్వం చట్టాలు చేసిన విషయాన్ని ఈరోజు మనం గుర్తు చేసుకోవాలి.

తెలంగాణ విషయంలో కూడా నేను కొంత సంతృప్తిగా self satisfactionతో మనవి చేస్తున్నాను. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఎంత ministerial percentage అయినా, నాది కూడా కొంత కీలక, క్రియాశీలక పాత్ర ఉండడం అది నాకు జీవితాంతం సంతోషాన్ని ఇస్తుందని నేను మనవి చేస్తున్నాను. డిసెంబర్ 9వ తేదీన చిదంబరం గారి ప్రకటన తరువాత On January 05th, 2010 then Union Home Minister, Chidambaram Garu తెలంగాణలోని recognised పార్టీలతో All Party Meeting పెట్టి the way forward మీరు సజెస్ట్ చేయమని చెప్పి మా అందరినీ అడగడం జరిగింది. ఆయొక్క కీలక సమావేశంలో తెలంగాణ కాంగ్రెస్ ప్రతినిధిగా తెలంగాణ రాష్ట్రం ఎందుకు ఏర్పాటు చేయాలి? ఎందుకు అనివార్యం అని చాలా స్పష్టంగా, చాలా aggressiveగా మీటింగ్‌లో చెప్పడం జరిగింది. ఆ మీటింగ్ తరువాత ఈ way forward ఫైనలైజ్ చేయడానికి retired Supreme Court Judgeతో Justice Srikrishna Committee ఏర్పాటు చేయడం జరిగింది. ఆ శ్రీకృష్ణ కమిటీకి కూడా నేను మరియు ఆరోజు నాతో ఉన్నటువంటి సీనియర్ కాంగ్రెస్ నాయకులం అందరం కూడా ఎందుకు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయాలో పెద్దఎత్తున కొన్ని వందల పేజీల రిప్రజెంటేషన్ తయారు చేసి అందజేయడం జరిగింది. ఈ శ్రీకృష్ణ కమిటీ రిపోర్ట్ తరువాత మళ్లీ, అంటే మొదటి ఆల్ పార్టీ మీటింగ్ చిదంబరం గారు హోల్డ్ చేసింది 5th January, 2010. 2nd All Party Meeting తెలంగాణ క్రియేషన్ కోసం ఏర్పాటు చేసింది 6th January, 2011. దాంట్లో కూడా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ తరపున నేను పార్టిసిపేట్ చేసి తప్పనిసరిగా జస్టిస్ శ్రీకృష్ణ కమిటీ రిపోర్టులో 5th option ఏదైతే ఇచ్చారో, దాని ప్రకారం ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇవ్వాలి, హైదరాబాద్ నగరం తెలంగాణకి క్యాపిటల్‌గా ఉండాలని చెప్పి ఏదైతే 5th option ఇచ్చారో దానిని మేము గట్టిగా ఆ మీటింగ్‌లో చెప్పడం జరిగింది. ఆ తరువాత కేంద్రంలో ఉన్నటువంటి ఆనాటి యుపిఏ ప్రభుత్వంపై అనేక ఒత్తిడులు వచ్చినా, రాజకీయంగా కొద్దిగా ఇబ్బందులు పడ్డా, ఆనాటి యుపిఏ ప్రభుత్వంలోని చైర్‌పర్సన్ సోనియాగాంధీ గారి దృఢ సంకల్పం

వల్ల ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలనే వారి తత్వం వల్లనే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయింది. 2004లో కరీంనగర్‌లో సోనియాగాంధీ గారు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ 2014లో అది fulfil అయిందని నేను మనవి చేస్తున్నాను. అదేవిధంగా జూలై 30, 2013న తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ స్పష్టమైన ప్రకటన ఇవ్వడం. ఆ తరువాత ఫిబ్రవరి 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు సంబంధించిన ఈ చట్టాన్ని లోక్‌సభలో ప్రవేశపెట్టి పాస్ చేయడం జరిగింది. అప్పుడు ఆనాటి కాంగ్రెస్ ఎంపీలది అందులో చాలా కీలక పాత్ర ఉంది. ఫిబ్రవరి 20, 2014లో రాజ్యసభలో చట్టం పాస్ అయి, భారత రాష్ట్రపతి గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వడం జరిగింది. అప్పుడు తెలంగాణ రాష్ట్రం భారత దేశంలో 29వ రాష్ట్రంగా ఏర్పడ్డ విషయం మరొక్కసారి మనం గుర్తు చేసుకుందాం. అదేవిధంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు ఎంత ముఖ్యమైనదో ఆ చర్చల్లో పాల్గొన్న వ్యక్తిగా నేను ఆ విషయాన్ని ఈ సభ ద్వారా యావత్ తెలంగాణ ప్రజానీకానికి మరొక్కసారి గుర్తు చేస్తున్నాను. హైదరాబాద్ నగరం నుండి వచ్చే రెవెన్యూ కేవలం తెలంగాణకే కేటాయించడం అనే విషయం అది కేవలం సోనియాగాంధీ ఘనత అనే విషయం యావత్ తెలంగాణ ప్రజలు గుర్తుపెట్టుకోవాలి.

1.30 మ. మనం ఈరోజు శ్రీమతి సోనియాగాంధీ గారికి మరోమారు ధన్యవాదాలు తెలియజేస్తూ, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకి కేవలం, కేవలం సోనియాగాంధీ గారి సింగ్యులర్ కాంట్రిబ్యూషన్ అన్న విషయం ఎల్లప్పుడూ తెలంగాణ ప్రజలు గుర్తుపెట్టుకుంటారని మనవి చేస్తూ, ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన ప్రకటన, ఈరోజు తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవంగా చేసిన ప్రకటనను కూడా ఈరోజు నేను మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాను, జైహింద్.

మిస్టర్ స్పీకర్:- గౌరవ మంత్రి వర్యులు, శ్రీ దామోదర రాజనరసింహ గారు.

శ్రీ సి. దామోదర రాజనరసింహ (గౌరవ ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమం మరియు శాస్త్ర మరియు సాంకేతిక శాఖామాత్యులు):- అధ్యక్షా, గౌరవ ముఖ్యమంత్రి గారి స్టేట్‌మెంట్, ప్రత్యేకంగా తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ, తెలంగాణ రాష్ట్ర గీతం... ఇవన్నిటిపైనా చాలా చక్కగా ఒక స్టేట్‌మెంట్‌ని ఈ హౌస్‌లో ఇవ్వడం.., ఇంకొంచెం డెప్త్‌గా ఒకసారి గౌరవ ముఖ్యమంత్రిగారు ఇచ్చిన స్టేట్‌మెంట్‌ని మనం విశ్లేషణ చేసుకుంటే, ఈ భూప్రపంచంలో ఏజాతికైనా గుర్తింపు, గౌరవం... ఆ జాతి అస్థిత్వమే. సమాజమనేది... ఒక ప్రాంతముండొచ్చు, ఒక రాష్ట్రముండొచ్చు, ఒక దేశముండొచ్చు. ఎక్కడైనా ఆ సమాజానికి స్ఫూర్తి అనేది ఆ సంస్కృతి, ఆ ఆచారాలు, ఆ విశ్వాసాలు, ఆ ధైర్యం, ఆ స్ఫూర్తి, ఆ మార్గదర్శకం... అంత చక్కని స్టేట్‌మెంట్‌ని మన ముఖ్యమంత్రిగారిచ్చారు.

తెలంగాణ తల్లి... ఆ తల్లి ఉద్యమంలో ఎంత స్ఫూర్తినిచ్చిందో... కవులు, కళాకారులు... ముఖ్యంగా, గత 60, 70 సంవత్సరాల తెలంగాణ చరిత్రను మనం తీసుకుంటే, తెలంగాణ ఎప్పుడూ అభద్రతకు, ఆత్మగౌరవానికి..., పోరాటంతో ముందుకుసాగింది. ఈ 60, 70 సంవత్సరాల పోరాటంలో... అవి నిజాంకాలంలోగానీ, ఆ తరువాత సమైక్య రాష్ట్రంలోగానీ ప్రధాన పాత్ర పోషించింది కవులు, కళాకారులు, సంఘాలు. అందులో ముఖ్యంగా, గౌరవంగా చెప్పుకోవాలి మనమీరోజు.. మన పిల్లల త్యాగాలు, తెగింపులు, ధైర్యం. ప్రత్యేకంగా ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు. 1969 తెలంగాణ ఉద్యమం ఒక రకంగా ఉంటే, ఆ తరువాత వచ్చిన తెలంగాణ ఉద్యమం మరొకరకం. తెలంగాణ ఉద్యమం తెలంగాణ సమాజానికి సంబంధించింది. తెలంగాణ సమాజం ఎందుకు ఎప్పుడూ అభద్రతకు గురవుతుందనేది ఒక అంశం. అందులో మాకు... నేను కూడా Osmania alumnus. అధ్యక్షా, అక్కడ చదువుకొని వచ్చాను. తొందరగా సిద్ధాంతాలకు.., సాధించాలనే ఒక పట్టు, తెగింపుకు ప్రతిరూపం, పర్యాయపదం.. ఉస్మానియా, కాకతీయ యూనివర్శిటీలు.

ఈనాడు తెలంగాణ రాష్ట్రం కల సాకారమైనా, మనమెప్పుడూ మన యువత త్యాగధనులు, త్యాగమూర్తులను జీవితంలో ఎప్పుడూ మరచిపోవద్దు. దానికితోడు మనకు స్ఫూర్తినిచ్చిన కవులను, కళాకారులను, ఎప్పటికప్పుడు మనకు

ధైర్యాన్ని, స్ఫూర్తిని ఇచ్చి నడిపించిన ఆ త్యాగధనులను మనమెప్పుడూ మరచిపోవద్దు. ఇవన్నీ ఒక ఎత్తయితే, సోనియా గాంధీ గారి యొక్క ధైర్యము, రాజకీయ నిర్ణయం, తెలంగాణ సమాజం యొక్క పోరాటాన్ని గుర్తించడం, మన పిల్లల త్యాగాలని గుర్తించడం, రాజకీయంగా నష్టం జరిగినా మేము తెలంగాణకై కట్టుబడి ఉన్నామని సోనియమ్మ చెప్పడం, డిసెంబరు 9న తెలంగాణ రాబోతుందనే శుభవార్తతో ఆ ప్రక్రియ మొదలు కావడం, ఆ తరువాత అంచెలంచెలుగా యూపీఏ ప్రభుత్వం పాజిటివ్ దిశగా పోవడం, ఇదే అసెంబ్లీలో తెలంగాణ అంశానికి సంబంధించి ఒక రిజల్యూషన్ ప్రవేశపెట్టడం, మా తమ్ముడు, మిత్రుడు, సహచర మంత్రివర్యులు శ్రీధర్‌బాబు, సి.డబ్ల్యు.సి. తీర్మానం, ఆ తరువాత కాంగ్రెస్ పార్టీలో ఒక స్వేచ్ఛతోటి మీ అభిప్రాయాలు చెప్పండి, మీ అభిప్రాయాలను మేము గౌరవిస్తామని చెప్పడం కానీ, సమైక్య రాష్ట్రమే గానీ, పార్టీ స్టాండేగానీ, తెలంగాణ స్టాండే గానీ... ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము, కాంగ్రెస్ పార్టీ చెప్పాలని ఒక నిర్ణయం తీసుకుంటే, ఆనాటి అగ్రనాయకులు ఒక్కొక్కరు ఒక్కో స్టాండ్ తీసుకుంటే, Why Telangana? What for Telangana? Why there is always insecurity in Telangana? What is the cause for insecurity in Telangana? What is the ultimate remedy? bifurication of the State.. అనే అంశంపైన కాంగ్రెస్ హైకమాండ్ నాక్కూడా ఒక అవకాశమిచ్చింది. తెలంగాణలోని మేధావులు, అన్ని అంశాలలో నిష్ణాతులైన మేధావులు, నిష్ణాతులు... వీళ్ళందరూ కూడా నాకు సహకరించి, నన్ను గైడ్ చేసి... ఆనాడు దేశాన్ని నడిపించేటువంటి కోర్ కమిటీ.. సోనియా గాంధీ గారు, ఆనాటి ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ గారు, డిఫెన్స్ మినిష్టర్‌గారు, హోం మినిష్టర్‌గారు వంటి నిష్ణాతులు, దేశాన్ని నడిపించే అగ్రనాయకత్వం.. వారి ముందు తెలంగాణ వాదన, తెలంగాణ ఎందుకు? పరిష్కారమేంది? చరిత్ర ఏంది?.. అనే దానిపైన 35 నిమిషాలు సుదీర్ఘంగా వాదన వినిపించే అవకాశం నాకు సోనియా గాంధీ గారిచ్చారు. ఆనాటి వాదన తరువాత అర్థమైపోయింది, తెలంగాణ కల సాకారం కాబోతోందని. ఆనాడు అటువంటి పెద్దలతో, సోనియమ్మతోటి జరిపిన ఇంటరాక్షన్‌తో నాకర్థమైపోయింది... ఆ మహానేత, ఆ తల్లి మానవత్వానికి ప్రతిరూపం. ఒక కమిట్‌మెంట్, మాటిస్తే మాట నిలబెట్టుకునే ఒక ధైర్యం, నిబద్ధత ఆ తల్లికున్నాయి. తెలంగాణ కల సాకారమైన తరువాత కూడా ఆనాటి లీడర్ ఆఫ్ ది హౌస్ ఇక్కడే స్టేట్‌మెంట్ ఇచ్చారు. తన స్టేట్‌మెంట్ 'ఈరోజున కొత్తగా కొలువుదీరిన తెలంగాణ రాష్ట్ర శాసనసభలో తెలంగాణ శాసనసభ నాయకుడిగా, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా శ్రీమతి సోనియాగాంధీ గారికి నేను హృదయపూర్వకమైన కృతజ్ఞతను తెలియజేస్తున్నాను' అని. అధ్యక్షా, రాజకీయాల్లో ఓటమి, గెలుపు అనేవి సహజం. పదవులు శాశ్వతం కాదు. కానీ, సమాజానికీ, రాష్ట్రానికీ, ప్రజలకూ మనం తిరిగి ఏమి చెల్లిస్తున్నామనేది చాలా ముఖ్యం. 2014లో రాష్ట్రమేర్పడిన తరువాత ఏ కళాకారులు, కవులు, ఆ తెలంగాణ తల్లి మాకు స్ఫూర్తినిచ్చిందో... విస్మరించడం అంటలేను నేను... బాధనిపిస్తుంది.

అధ్యక్షా, ఈరోజు ఆ తెలంగాణ తల్లి ప్రతిరూపాన్ని చూస్తే, నాకు మా నాయనమ్మ గుర్తొస్తుంది. నిండు ఆభరణాలు కావు, నిండు ఆభరణాలున్న తల్లినేమంటామో నాకు తెల్వదు గానీ..., నిండు ఆభరణాలు కావు, నాకు మా నాయనమ్మ గుర్తుకొస్తోంది. నేను ఆ జాతికి, ఆ సమాజానికి చెందినవాడిని. ధైర్యము, సత్తా, తెగింపుతోటి పెరిగినవాడిని. అందుకే, ఈరోజు మా ముఖ్యమంత్రి గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. నబ్బండ వర్గాల, మట్టి బిడ్డల, గట్టి బిడ్డల... మా తల్లి ఎలా ఉంటుందో, మేము స్మరించుకోవడానికి... మా అమ్మమ్మలు, మా నానమ్మలు ఏరకంగా ఉంటారో, వారిని గుర్తించే విధంగా ఈరోజు తెలంగాణ తల్లిని మాకందరికీ అందించిన మన రాష్ట్ర ముఖ్యమంత్రిగారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఇలాంటి emotive issues లో ఎప్పుడూ రాజకీయాలుండొద్దు అధ్యక్షా. రాజకీయాల్లో స్వార్థాలు, ఆశలు, అత్యాశలు... అన్నీ ఉంటాయి. కానీ, at the end of the day, we do not move the fourth generation or third generation.

1.40 మ. కనిపించని దాని గురించి ఆశపడడం అంటే అమూర్తత్వం. చరిత్రలో మిగిలిపోవాలంటే

త్యాగముండాలి, ధైర్యముండాలి, దార్శనికత్వం ఉండాలి. మొదటి సంవత్సరం వేడుకలు, డిసెంబరు 9, సోనియమ్మ ఆరోజు మాటిచ్చి మాట నిలబెట్టుకున్నది, మా త్యాగాలని, మా మొండి ధైర్యాన్ని గుర్తించింది గనుక వారికెప్పుడూ ఋణపడి ఉంటాము. ఈరోజు ఈ విగ్రహావిష్కరణను పండుగ వాతావరణంలో మనందరం కలిసికట్టుగా చేసుకోవాలి, ఈ విగ్రహావిష్కరణ పండుగ చేసుకోవాలి. ఈరోజు ఈ అవకాశమిచ్చిన అధ్యక్షునికి, ఇంకా చాలా విషయాలు మాట్లాడాలనుకున్నాను కానీ ఈ అంశాన్ని ఇక్కడికే ముగిస్తున్నాను, ధన్యవాదాలు అధ్యక్షా.

శ్రీ మల్లు భట్టి విక్రమార్క (గౌరవ ఉప-ముఖ్యమంత్రి-ఆర్థిక మరియు ప్రణాళిక, ఇంధన శాఖామాత్యులు):- అధ్యక్షా, తెలంగాణ ప్రజల గుండెల్లో మధుర జ్ఞాపకంగా నిలిచిపోయే తెలంగాణ తల్లి విగ్రహానికి సంబంధించినటువంటి అంశాన్ని ఈరోజు రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు, సభానాయకులు ఒక స్టేట్‌మెంట్ చేసి, ఆ స్టేట్‌మెంట్‌తో తెలంగాణ ప్రజలందరి ఆలోచనల్ని, భావోద్వేగాల్ని రంగరించి, తెలంగాణ తల్లి ఏ రకంగా ఉండాలనే అంశానికి ఒక రూపం తీసుకొని వచ్చారు. ఆ విగ్రహావిష్కరణకు సంబంధించి ఈరోజు ఏర్పాటు చేసుకున్నటువంటి ఈ సందర్భంలో సహజంగా ప్రకటన చేసినప్పుడు, సభా వ్యవహారాలకు సంబంధించినంతవరకు ప్రకటనకే పరిమితమవుతారు, కానీ, ఇది అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్న అంశం కాబట్టి, మీరు ప్రత్యేకంగా చొరవ తీసుకొని, సభా నాయకులు వారి ఆమోదంతో మిగతా గౌరవ సభ్యులందరూ మాట్లాడటానికి కూడా అవకాశమిద్దామని చెప్పి మీరు అవకాశమిచ్చినందుకు మీకు కూడా నేను ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తా ఉన్నాను. కాకపోతే, నాకంటే ముందు మాట్లాడిన గౌరవ మంత్రివర్యులు, గౌరవ శాసన సభ్యులు కానీ, ఈ అంశానికి సంబంధించి సమున్నతంగా సభ దృష్టికి తీసుకొని వచ్చారు. ఈ ప్రభుత్వం కూడా ప్రతిపక్ష సభ్యులు, వారి నాయకులతో సహా, కొన్ని దశాబ్దాల కలను నిజం చేసిన రాష్ట్రావతరణ దినోత్సవానికి సంబంధించి, అట్లాగే ఈ తల్లి విగ్రహానికి సంబంధించి ఒక ప్రకటన చేస్తున్నటువంటి సందర్భంలో, వారు కూడా సభలో ఉండి, ఈ విగ్రహానికి సంబంధించి వారి అభిప్రాయాలు కూడా సభలో, రాష్ట్ర ప్రజలకు సభ ద్వారా పంచుకుంటే, బాగుండేదేమోనని మేమందరం భావిస్తా ఉన్నాం. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రజాస్వామికంగా ప్రకటన చేయడమే కాకుండా, ప్రకటన పైన సహజంగా చర్చ లేకపోయినప్పటికీ కూడా చర్చకు కూడా అనుమతినిచ్చి వారి అభిప్రాయాలు తెలుసుకుందా మనేటటువంటి ఒక ఉన్నతమైన సాంప్రదాయానికి ఈరోజు తెర కూడా లేపింది. ఇటువంటి సాంప్రదాయాన్ని కూడా వారు గౌరవించకుండా, సభ నుండి బయటకు పోవడమనేది కరెక్టు కాదేమోనని మేమంతా భావిస్తా ఉన్నాం. ప్రభుత్వం, ప్రతిపక్షం, రెండూ కూడా వారి వారి అభిప్రాయాలు చెప్పాలని, చెబితేనే అది నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తికి అద్దంపడుతుందనే ఆలోచనతో, నమ్మేటటువంటి ప్రభుత్వంగా ఈరోజు ఈ చర్చకు అవకాశమిచ్చినప్పుడు వారు చెప్పాల్సి ఉండేది.

ఏదైనా ఒక అంశాన్ని సభలో ప్రవేశపెట్టినప్పుడు, వారి వారి అభిప్రాయాలు, భిన్నాభిప్రాయాలు కావచ్చు, ఏకాభిప్రాయాలు కావచ్చు, ఇవాళ నేను పెద్దల సభలో ఈ అంశానికి సంబంధించి ప్రకటన చేసినప్పుడు ఆ సభలో ఉన్నటువంటి మేధావులు, పెద్దలందరూ కూడా దీనిని స్వాగతించడమే కాకుండా, అభినందించడమే కాకుండా, తెలంగాణ తల్లికి సంబంధించిన రూపంలో ఇందులో స్పష్టంగా కనిపిస్తా ఉంది. తెలంగాణ ప్రజల యొక్క భావోద్రేకాలు కూడా ఇందులో రంగుల ద్వారా చాలా స్పష్టంగా కనిపిస్తా ఉన్నాయని సభ్యులందరూ వారి వారి అభిప్రాయాలు చెబుతూ స్వాగతించారు. అలాగే, ఇక్కడున్నటువంటి ప్రధాన ప్రతిపక్ష పార్టీకి సంబంధించిన నాయకులు కేసీఆర్‌గారు కానీ, కేటీఆర్‌గారు గానీ, హరీష్‌రావుగారు కానీ ఆ సభ్యులందరూ ఇక్కడుండివారి అభిప్రాయాలు చెప్పి ఉండి ఉంటే, బాగుండేది అధ్యక్షా. అందరి అభిప్రాయాలు ఒకలాగే ఉండాలని మేమేమి కోరుకోవట్లేదు అధ్యక్షా, లేకపోతే మీరు మమ్మల్ని పొగడాలనో, మేము చేసింది గొప్పగా ఉందని మీరు చెప్పాలని కూడా మేము కోరుకోవట్లేదు, కనీసం మీ అభిప్రాయాలు చెప్పి ఉంటే బాగుండేది.

ఇప్పుడే పెద్దలు దామోదర రాజనర్సింహ గారు మాట్లాడినప్పుడు కొన్ని అంశాలు వారు చెప్పారు. గతంలో

అనేక సందర్భాలలో ఇక్కడ భావోద్రేకాలున్నప్పుడు సభలో ఉన్న రాజకీయ పార్టీలకు సంబంధించిన వారంతా చాలా భిన్నాభిప్రాయాలు చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు సభ అభిప్రాయాలన్నీ, ఒక్కొక్కరివి ఒక్కొక్కరకంగా ఉన్నప్పుడు కూడా సభ నడిపించాం, సభ నడపడమే కాదు, ఆ సభలో అందరి అభిప్రాయాలు కూడా చెప్పారు, మీకు తెలియనిది కాదు, మీరు కూర్చునటువంటి ఆ స్థానంలో ఆరోజుల్లో ఉమ్మడి సభలో ఆంధ్రప్రదేశ్ శాసన సభ నడుస్తున్నప్పుడు, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి సంబంధించిన బిల్లు ఈ సభలోకి వచ్చినప్పుడు, ఇక్కడ ప్రవేశ పెట్టాలన్నప్పుడు, ఆరోజు రకరకాల భిన్నాభిప్రాయాలుండే, అయినప్పటికీ కూడా నేను డెప్యూటీ స్పీకర్‌గా ఆ స్థానంలో కూర్చొని, ఇక్కడ శాసన సభ వ్యవహారాలు చూస్తున్నటువంటి శ్రీధర్‌బాబు గారు, వారు ఆ బిల్లుకు సంబంధించిన అంశాన్ని ప్రవేశ పెట్టినప్పుడు, సభలో ఉన్నటువంటి అందరి అభిప్రాయాలు తీసుకోవాలని చెప్పి మాట్లాడటానికి అవకాశమిచ్చాం. అప్పుడు దానిని వ్యతిరేకించినవారు ఎవరూ సభ వదిలిపెట్టి పోలేదు. వారు సభలోనే ఉన్నారు. వారికి భిన్నాభిప్రాయాలున్నప్పటికీ కూడా ఆ అభిప్రాయాన్ని చాలా స్పష్టంగా చేప్పేటటువంటి అవకాశం కూడా ఆనాడు ఆ స్థానం నుంచి ఇచ్చాం, వాళ్ళు కూడా చెప్పారు. అంత భావోద్రేకాలతో, అంత విపరీత పెడధోరణితో ఉన్నటువంటి సభలో కూడా సభను వదిలిపెట్టి ఎవరూ బయటకు పోలేదు అధ్యక్షా. ప్రజాస్వామ్యంలో దానిని ఏకీభవించేటటువంటివారు, వ్యతిరేకించేటటువంటి వారు అభిప్రాయాలు చేప్పారు. ఈరోజు కూడా మేము తెలంగాణ తల్లి విగ్రహానికి సంబంధించి, మనందరికీ తెలిసినదే, కొన్ని దశాబ్దాలుగా అనేక రాజకీయ పార్టీలు విగ్రహాలు తయారు చేసుకున్నప్పటికీ, అధికారికంగా ప్రభుత్వంగా ఇంతవరకూ ఏ విగ్రహానికి కూడా ఏర్పాటు చేసుకోలేకపోయామని చెప్పి, రాష్ట్ర ప్రజల భావోద్వేగాలన్నింటినీ అందులో రంగరించి ఒక అద్భుతమైన తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణను ఈరోజు చేసుకుంటూ, దానికి సంబంధించిన ప్రకటన చేసినప్పుడు, నిజంగా తెలంగాణ మీద, తెలంగాణ తల్లి మీద గౌరవమున్న ప్రతి ఒక్కరు కూడా ఈరోజు సభలో ఉండి వారి అభిప్రాయాలు చెప్పాల్సి ఉండేది. అలా చెప్పకుండా సభ వదిలి పోవడం అంటే, మేమందరం భావిస్తున్నాం, మీకు నిజంగా, అసలు తెలంగాణ మీద, తెలంగాణ తల్లి మీద గౌరవముందా? లేకపోతే కేవలం అధికారం మీదనే మీ ప్రేమ, తాపత్రయముందా అనే అభిప్రాయం కలుగుతా ఉంది. ఇది కరెక్ట్ కాదు కదా? తెలంగాణ తల్లి అని అంటే, 13 జూన్, 2014లో స్పష్టంగా ఆనాటి సభా నాయకుడు ముఖ్యమంత్రిగా ఉండి, "ఈరోజు కొత్తగా కొలువుదీరిన తెలంగాణ రాష్ట్రశాసన సభలో తెలంగాణ రాష్ట్ర శాసన సభా నాయకుడిగా, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా శ్రీమతి సోనియాగాంధిగారికి నేను హృదయపూర్వకమైన కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను, వారి యొక్క చొరవతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. అందులో ఎవ్వరూ సందేహపడనక్కర్లేదు. I am once again placing my thanks on record officially in the first session of the Telangana Assembly అని నేను ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను" అని చెప్పి ఆనాడు చంద్రశేఖర్ రావుగారు సభలో చెప్పారు.

అధ్యక్షా, ఈరోజు డిసెంబరు 9, ఈరోజే కొన్ని దశాబ్దాల పాటు తెలంగాణపైన పోరాటం చేస్తా ఉంటే, ఆ తెలంగాణ ఆవిర్భావానికి సంబంధించిన స్టేట్‌మెంట్ UPA చైర్‌పర్సన్‌గా శ్రీమతి సోనియాగాంధీగారు ఈ రాష్ట్ర ప్రజలకిచ్చినటువంటి మాటను నిలబెట్టుకుంటూ, డిసెంబరు 9వ తారీఖు నాడు వారి జన్మదిన సందర్భంగా తెలంగాణ రాష్ట్రఏర్పాటుకు సంబంధించిన స్టేట్‌మెంట్‌ని అఫీషియల్‌గా ఆనాటి కేంద్ర హోం మినిస్టర్ చిదంబరం గారి చేత స్టేట్‌మెంట్ ఇప్పించిన సంగతి మనందరికీ తెలుసు. ఆ స్టేట్‌మెంట్ ద్వారానే ఈరోజు రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని చెప్పి మనందరికీ తెలిసినటువంటి అంశం.

(హర్షధ్వానాలు)

1.50 మ. అటువంటి డిసెంబరు 9వ తేది నాడు మనందరం సభలో ఉండి ఆ ఉత్సవాన్ని చాలా గర్వంగా, సంతోషంగా జరుపుకోవడం ఒక ఎత్తు. దానికి

కారణభూతురాలైనటువంటి శ్రీమతి సోనియాగాంధీ గారి జన్మదినం కూడా ఈరోజు. ఈ రాష్ట్ర ఏర్పాటుకి, వారి నిర్ణయమే ప్రధానమైన నిర్ణయం కాబట్టి, వారు చేయకపోతే ఈ రాష్ట్రం ఏర్పడే అవకాశం లేదు కాబట్టి, మన కలలను నిజం చేసిన శ్రీమతి సోనియాగాంధీగారి జన్మదినం సందర్భంగా సభ మొత్తం కూడా ఏకగ్రీవంగా తీర్మానం చేసి వారికి జన్మదిన శుభాకాంక్షలు చెప్పడమే కాకుండా, ఈరోజు మనం తెలంగాణ తల్లిని ఏర్పాటు చేసుకునే సందర్భంలో దాన్ని స్వాగతిస్తున్నాను.

ఆ తెలంగాణ తల్లి విగ్రహాన్ని సాక్షాత్తు మన రాష్ట్ర సచివాలయ ప్రాంగణంలో, ఈ రాష్ట్రానికి పరిపాలనా స్థానంగా ఉన్న సచివాలయ ప్రాంగణంలో ఎదురుగా కనపడేటట్టుగా అద్భుతంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసుకునే సందర్భంలో రాష్ట్రమంతా ఒక పెద్ద పండగలాగా చేసుకుంటుంటే మాకీ పండగ అవసరం లేదని బయటకిపోయారు అధ్యక్షా. ఇదెక్కడ అన్యాయం? ఈ రాష్ట్రప్రభుత్వం చాలా స్పష్టంగా చెపుతావుంది. 9వ తేదీనాడు, అంటే ఈరోజు తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం. డిసెంబరు 9వ తేదీన తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని ప్రజాప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మనం ఈరోజు సభలో చేసిన స్టేట్‌మెంట్‌తోపాటూ, ఈరోజు మనం చేసుకునే విగ్రహావిష్కరణకు సంబంధించి, నిరంతరం ఈ ఉత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉత్సవంగా, అధికారికంగా ప్రతిసంవత్సరం నిర్వహిస్తాం. ఇది నిర్వహించడం మనందరి బాధ్యత అని ఈ సందర్భంగా మనవి చేస్తున్నాను.

ఇటువంటి ఒక రాష్ట్ర ఉత్సవాన్ని.. అధ్యక్షా ఆగస్టు 15, జనవరి 26.. ఈ రోజులను దేశానికి సంబంధించిన పండుగలాగా మనం జరుపుకుంటాము. అలాగే ఈ రాష్ట్ర ఆవిర్భావ దినాన్ని ప్రకటించిన రోజుని ఈ రాష్ట్రపండగ లాగా అధికారికంగా జరుపుకోవడం కోసమే ఈరోజు ఈ విగ్రహావిష్కరణ ఏర్పాటు చేసుకుంటూ, భవిష్యత్తులో కూడా అధికారికంగా చేసుకుందామని చాలా స్పష్టంగా చెపుతున్నాము. దానికి సంబంధించి అవసరమైతే గెజిట్‌ని కూడా ఇచ్చి అధికార లాంఛనాలను అన్నీ పూర్తి చేస్తామని గౌరవ ముఖ్యమంత్రిగారు ఇప్పటికే ప్రకటించారు. వారి సందేశాన్ని మీద్వారా ఈ సభకీ, ఈ రాష్ట్ర ప్రజలకి తెలియజేస్తున్నాను అధ్యక్షా.

ఇప్పుడే మా మంత్రులందరూ చెప్పారు.. మా అమ్మని చూస్తున్నట్టుగా, మా నాయనమ్మని చూస్తున్నట్టుగా , మా ఆడబిడ్డలను చూస్తున్నట్టుగా ఉందని చెప్పారు. తల్లి అంటే నిజంగా చేతులెత్తి దండం పెట్టే స్థాయిలో అటువంటి విగ్రహాన్ని అద్భుతంగా తయారు చేశారు.

మనందరం కోరుకున్న ఆకుపచ్చని తెలంగాణకు సంబంధించి ఆకుపచ్చరంగు, తెలంగాణ ప్రజల భావోద్వేగాలకు సంబంధించి రాజ్యహింస పెరిగినపుడు, దురహంకారంతో దొరలు రాష్ట్రం మీద అడ్డగోలుగా ప్రవర్తిస్తున్నప్పుడు, తెలంగాణ ప్రజలు తిరుగుబాటుచేసిన వైనాన్ని, పిడికిళ్ళు బిగించి రాజ్యాధికారానికి వ్యతిరేకంగా పోరాటం చేసిన తెలంగాణ ప్రజల మనస్తత్వాన్ని పీఠం క్రింద అద్భుతంగా ఆ విగ్రహంలో చూపించారు. తెచ్చుకున్న తెలంగాణని, తెలంగాణ తల్లిని చేతుల్లో నిలబెట్టుకుని తల్లిగా మిమ్మల్ని గౌరవిస్తామమ్మా అని చెప్పే విధంగా చేతుల్ని ఈ రకంగా చూపించేటువంటి పరిస్థితిని విగ్రహంలో చూపించాము. చక్కటి ఎరుపు రంగుతో తెలంగాణ ప్రజల యొక్క భావోద్రేకాన్ని, ఎరుపు అనేది ప్రగతిశీల భావాలకు సంబంధించినటువంటి అంశాన్ని కూడా స్పష్టంగా అందులో పొందుపరిచాము.

అట్లాగే ఒక తల్లి తన బిడ్డలేదా తనకు సంబంధించిన వాళ్ళెవరైనా ఎప్పుడు ఆపదలో ఉన్నా సుభిక్షంగా ఉండు బిడ్డా అని ఆశీర్వదించే ఆపన్న హస్తం కూడా చూపించే విధంగా చక్కగా రూపొందించి, తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డ, తెలంగాణలో భవిష్యత్ తరాలు అందరూ సుభిక్షంగా ఉండాలని ఆశీర్వదించే విధంగా ఆపన్నహస్తంతో తయారుచేసేనటువంటి ఈ విగ్రహంలో తెలంగాణ ప్రజల మనోభావాలు చాలా స్పష్టంగా కనపడతాయి అధ్యక్షా. తెలంగాణలో పండే పంటలన్నిటినీ కూడా చూపించడానికి కావలసిన విధంగా మక్క కంకులు, సజ్జ, జొన్న అన్నిటినీ

చూపిస్తూ వరి కంకులతో సహా అద్భుతంగా తయారుచేసినటువంటి ఆ రూపశిల్పికికూడా ఈ సభ తరఫున నా అభినందనలు తెలియజేస్తున్నాను. దీనిపైన ప్రత్యేక దృష్టి సారించి ముఖ్యమంత్రిగారు అందరి అభిప్రాయాలు తీసుకుని చక్కగా ఏర్పాటు చేసి, ఈరోజు తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించే కార్యక్రమ ప్రకటనను చేసినందుకు ఈ సభ అందరి తరఫున వారికి ప్రత్యేకమైన ధన్యవాదాలు, అభినందనలు తెలియజేస్తున్నాను.

సభలో ఉన్న మిత్రులందరికీ ఒకటే విజ్ఞప్తి చేస్తున్నాను. ఈరోజు ఒక పండగలాగా మనం జరుపుకుంటున్నాము. ఈ పండగ ప్రజలందరి పండగ, రాష్ట్ర పండగ. సాయంత్రం జరిగే ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి సభ్యులందరూ, నిజంగా తెలంగాణ మీద ప్రేమ ఉన్న ప్రతి ఒక్కరూ, తెలంగాణ తల్లిని గౌరవించాలని కోరుకునే ప్రతిఒక్కరూ కూడా ఇందులో పాల్గొనాల్సిందిగా ఈ సభద్వారా మీఅందరికీ విజ్ఞప్తి చేస్తూ ముగిస్తున్నాను. ధన్యవాదాలు.

మిస్టర్ స్పీకర్:- శ్రీమతి సోనియా గాంధీగారి జన్మదిన శుభ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. అదేవిధంగా ఈరోజు రాష్ట్ర ముఖ్యమంత్రిగారు తెలంగాణ తల్లి విగ్రహాన్ని అధికారికంగా సచివాలయంలో నెలకొల్పుతున్న సందర్భంగా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నాను. Now, the House is adjourned to meet again at 10 A.M. on Monday the 16th December. 2024.

(The House, then adjourned at 1.56 p.m. to meet again at 10.00 a.m. on Monday, the 16th December, 2024)

*****

"Published under Rule 347 of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Assembly and Printed at Assembly Press, Public Gardens, Hyderabad."